నవభారతి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

7 జూన్ 1960

మూల్యం : రూపాయి

నవభారతి కార్యాలయం

టెలిగ్రామ్సు : నవభారతి   టెలిఫోన్ : 482

గాంధీనగరం * విజయవాడ-2

విషయ సూచిక

నవభారతి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

సంపుటి 2 | విజయవాడ * జూన్ 1960 | సంచిక 9

ప్రజాస్వామికము - అహింస

మహాత్మ గాంధీ

ఒక్క అహింసద్వారానే ప్రజాస్వామికాన్ని కాపాడగలం - అని మీరంటారు ఎందువల్ల? - అని ఒక అమెరికన్ మిత్రుడు అడిగిన ప్రశ్నకు గాంధీజీ ఈ విధంగా సమాధానం చెప్పారు.

ప్రజాస్వామికం హింసాపూరితమై యున్నంతవరకూ అది బలహీనులను కాపాడనూలేదు, వారికొక రక్షణ కల్పించనూలేదు. ప్రజాస్వామికం అంటే-నా భావం; - ప్రజాస్వామికంలో బలవంతులకు ఏ ఏ అవకాశాలుంటాయో బలహీనులకూ ఆయా అవకాశాలుండాలని - అలా ఉండటానికి ఒక్క అహింసద్వారా తప్ప మరే విధంగానూ సాధ్యంకాదు ప్రపంచంలో ఈ నాడు ఏదేశంలోకూడా బలహీనులకు ప్రాపకం లేకుండా పోయింది. పోతేపోనీ - బలహీనులు అలా పతనమై పోవలసిందే - అని అంటారు మీరు! మీ విషయమే చూడండి! మీ భూమి ఏకొద్దిమంది పెట్టుబడి దారుల క్రిందనో ఉన్నది దక్షిణాఫ్రికా విషయంలోకూడా అంతే మరి ఇంతింత భూమిని స్వంతం చేసుకుని అనుభవిస్తూన్నారూ అంటే అది దౌర్జన్యం కాక మరేమిటి? - ఒక్క దౌర్జన్యం వల్లనే అది వీలవుతుంది. ఆ దౌర్జన్యం బహిరంగంగా కాకపోతే- చాటు మాటుగా కొన సాగిస్తున్నారు - అంతే! ఈ నాడు పనిచేస్తున్న పాశ్చాత్యదేశాల ప్రజాస్వామికం పరిశీలిస్తే అది నాజీ సిద్ధాంతంతోనే లేక ఫ్యాసిస్టు సిద్ధాంతంతోనో చేరియున్నదని స్పష్టమవుతుంది నాజీ ధోరణులనూ సామ్రాజ్యవాదం తాలూకు ఫ్యాసిస్టు ధోరణులనూ మరుగు పరచడానికి ఈ ప్రజాస్వామికం ఒక చక్కని 'ముసుగు'గా పనిచేస్తున్నది - అంతే! దోపిడిలో భాగం పంచుకోవాలని కాకపోతే ఈ నాడు ఈ యుద్ధాలు దేనికి? బ్రిటను భారతదేశాన్ని బుట్టలో వేసుకున్నదీ అంటే - అది ప్రజాస్వామిక పద్ధతికాదు! దక్షిణాఫ్రికా ప్రజాస్వామ్యానికి అర్థమేమిటి? జన్మతః అక్కడఉండే నల్లవాళ్ళనుంచి తెల్ల వాళ్ళను కాపాడడానికే దక్షిణాఫ్రికా రాజ్యాంగ చట్టం రూపొందించబడింది అందాకా ఎందుకు? మీదేశ చరిత్రనే చూడండి! మీ ఉత్తర రాష్ట్రాలవారు బానిసత్వాన్ని తొలగించినప్పటికీ కూడా మీ చరిత్ర మరింత మాలిన్యమయిపోయింది! నీగ్రోలపట్ల మీరు ప్రదర్శించిన వైఖరి - చాలా అప్రతిష్ఠ కరమైనదని స్పష్టంగా రుజువైంది. ఇటువంటి ప్రజా

స్వామికాలను నిలబెట్టడం కోసమే యుద్ధాలు చేయవలసి వస్తున్నది. ఇదంతా ఒక విధమైన కపటమూ, మాయ
ఇప్పుడు నేను అహింసా సిద్ధాంతాన్ని నిర్వచించటం కోసమూ, దౌర్జన్యాన్ని ఉన్న దున్నట్లు వాస్తవ రూపంలో బయటపెట్టటం కోసమూ ప్రయత్నిస్తున్నాను.

భారతదేశం నిజమైన ప్రజాస్వామికాన్ని - అంటే దౌర్జన్య రాహిత్యాన్ని వికసింపచేయటంకోసం ప్రయత్నిస్తున్నది - సత్యాగ్రహం, చరఖా, గ్రామ పరిశ్రమలు, చేతిపనులద్వారా ప్రాథమిక విద్య, అస్పృశ్యతానివారణ, కులాలమధ్య సామరస్యం, మద్య పాననిషేధం, అహమ్మదాబాదులో ఉన్నటువంటి అహింసా యుతమైన శ్రామిక సంస్థలూ - ఇవే మా ఆయుధాలు అంటే ప్రజా బాహుళ్యం యొక్క కృషి, సామాజిక శిక్షణ ఈ కార్యక్రమాలు నిర్వహించటానికి మాకు పెద్ద పెద్ద సంస్థలున్నాయి. అవన్నీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కలవి హీనులకూ దీనులకూ సేవచేయటమే వాటిపని

అహింసయొక్క శాశ్వతమైనకృషిఇది. ఈ కృషివల్ల సహాయ నిరాకరణ, శాసనోల్లంఘనం మొదలయినవి కొనసాగించేశక్తి ఉద్భవిస్తుంది ప్రజా బాహుళ్యం, శిస్తులు, పన్నులు చెల్లించడానికి నిరాకరిస్తుంది అహింసాయుతంగా ప్రతిఘట నోద్యమం కొనసాగిస్తుంది. సహాయనిరాకరణ, శాసనోల్లంఘనం- మేము చాలా భారీ ఎత్తుననూ, చాలా విజయవంతంగానూ కొనసాగించామని మీకు తెలుసు మున్ముందు అద్భుతమైన భవిష్యత్తు కలదని ఈ మా ప్రయోగం రుజువు చేసింది అయినా మాది బలహీనులు సాగించే ప్రతిఘటన. ఇది బలవంతుల ప్రతిఘటనగా అభివృద్ధి చెయ్యాలనే మా లక్ష్యం మీ యుద్ధాలు ప్రజాస్వామికానికి ఎప్పటికీ క్షేమకరంకావు ప్రజలు ఈ స్థాయిని అందుకోకలిగిననాడు - మరొక మాటలో చెప్పాలంటే భగవంతుడు ఇందుకు అవసరమైన వివేకమూ శక్తీ నాకు ప్రసాదించిననాడు భారతదేశంచేస్తున్న ఈ ప్రయోగం పరిపూర్ణంగా సాధింపబడుతుంది, సఫలీకృత మవుతుంది

—హరిజన్, మే 18, 1940

యోగదర్శనము

శ్రీ వేలూరి శివరామశాస్త్రి

౧౦

శబ్ద స్పర్శరూప రస గంధములను గ్రహించుచుండుట చిత్తమునకు స్వభావము వేయేల, సర్వార్థములను అనగా విషయములను గ్రహించుటయే దానిపని సర్వార్థత చిత్తధర్మము. ఈ ధర్మమువలన ప్రత్యయములును (ఇది కుండ ఇది కొండ యీ మొదలగు జ్ఞానములు) ఈ ప్రత్యయములవలన సంస్కారములును కలుగుచుండును

చిత్తముమీద జ్ఞానముగాని క్రియగాని హత్తుకొనిన యెడల అవి సంస్కారము లగును జ్ఞాన సంస్కారానుభవము స్మృతి క్రియాసంస్కారానుభవము స్వారసకక్రియ పూర్వసంస్కారమును పూర్తిగా త్రోసివైచిన యెడల ఎరుగబడు ఎరుకయు చేయబడు పనియు స్వతంత్రముగా ఉండగలవని ఊహింప నవకాశము లేదు ఇటులు చిత్తము ప్రత్యయ సంస్కారోభయాత్మకము

గుణముల యితివృత్తము చంచలము. మంచికి బోవునపుడు మంచిగను చెట్టకు బోవునపుడు చెట్టగను తరతమభావములతో నవి పరిణమించుచునే యుండును కాని ఆ పరిణామమున కొక అవధి యున్నది

సమాధి పరిణామము

కొలదికాలమేని చిత్త మేకాగ్ర మగునేని దానిని సమాహితచిత్త మని యందుము ఏకాగ్రతయే సమాధి ఏకాగ్రత లేని సమాధి లేదు ఏకాగ్రిత సమాధిసామాన్య లక్షణము. యోగారంభమున విభిన్నములగు ప్రత్యయముల నన్నిటి నేకాకార మొనరింపవలసివచ్చును అటు లొనరించునపుడు సర్వార్థతా ప్రత్యయములును వాని సంస్కారములును అడగి ఏకాగ్రతాప్రత్యయమును దాని సంస్కారమును పొడముచుండును సమాధి సామాన్యమునందు ఇట్టి పరిణామము సంభవించును ఇది సమాధి పరిణామము

ఏకాగ్రభూమికలో చిత్తము కనిపించిన విషయము వెంట బరుగిడక ఒక విషయమునందే నాటుకొనును ఇటులు అన్ని విషయములకు విలయమును ఒక విషయమునకే ఉదయమును గా గలుగు చిత్తపరిణామము సమాధి పరిణామమని చెప్పబడును. సమాధిలో చిత్తమునకు ఏకవిషయమునందు పరిణతి. పూర్వప్రత్యయ సంస్కారములకు క్షయమును సమాహిత విషయ ప్రత్యయ సంస్కారముల కుదయమును (ఏకాగ్రతా ప్రత్యయ సంస్కారములకు ఉపస్థితి) సమాధి.

× Automatic action.

ఏకాగ్రతా పరిణామము

ఇట్టి అభ్యాసము బలపడిన యెడల సమాధి కాలమునందు పూర్వప్రత్యయ మడగి సరిగా అట్టి ప్రత్యయమే పొడముచుండును. అడగిన వృత్తియు పొడమిన వృత్తియు ఏకాకారములుగనే యుండును. ఇది సదృశవృత్తి ప్రవాహము. సాధకు డొకడు కొన్ని గంటలపాటు సమాధిలో నుండెనని అందము. అతడు మొదట ఏ వృత్తితో చిత్తమును సమాహిత మొనరించెనో సమాధిభంగమువరకును అతని చిత్తమున అట్టి వృత్తియే పొడముచుండెను ఆ వృత్తి మారుటయే సమాధిభ్రేషము. ఇది ఏకాగ్రతా పరిణామము లేక ఏకాగ్రతాపరిణామరూప సమాధి.

సమాపత్తి

ఈ భూమిక స్థిరమయిన యెడల చిత్తము విషయములవెంట బోక క్రమక్రమముగా ఏకైక విషయమునందు లీన మగును ఇటుపైని సాధకుడు సంప్రజ్ఞాతభూమి నారోహించును. అపు డతని చిత్త మేకాగ్రభూమికము కాగలదు. అందుల కాతడెల్ల పుడును చిత్తమును సమాపన్న మొనరింప జూచుచుండును: అపు డాచిత్తము విషయములను మరగెడి ధర్మమును విడిచి ఎల్లపుడును ఒకే ఒక విషయమునందు లయ మందు భావనను తాల్ప దొడగును ఇదియ సమాపత్తి ఈశ్వర ప్రణిధానాదిక మొనరించి చిత్తము నెల్లపుడును అభీష్ట విషయమునందు తనకు స్వాభావికమయిన చందమున నిశ్చలముగా ఉంచగలుగు నెడల ఆ చిత్తము నిలుకడ చెందిన దని చెప్పుదురు నిలకడ చెందిన చిత్తమున గలుగు సమాధియే సమాపత్తి. కేవల సమాధికిని సమాపత్తికిని ఇదియే భేదము సమాపత్తి రూపప్రజ్ఞయే సంప్రజ్ఞాత యోగము దీనిని సంప్రజ్ఞానమనియు నందురు

ఏకాగ్రత సమాహితతత ఏకాగ్రతాపరిణతి సమాపత్తి ఇవి అన్నియు ఏకాగ్రతాభివృద్ధి క్రమము మరియు ఈ సమాపత్తి సమాధి పరిణామమే

నిరోధ పరిణామము

సమాధి పరిణామమునందు చిత్తమునకు పరిపూర్ణమగు నిరోధము కలుగదు. అది వివేకఖ్యాతిసాపేక్షము వివేక ఖ్యాతి పూర్వకమగు పరవైరాగ్యముచే చిత్తాధికారము కడముట్టును ఇట్టి యోగ్యత నిరోధభూమికలో.

సంప్రజ్ఞాత సంస్కారము లడగి నిరోధ సంస్కారములు పొడముట నిరోధ పరిణామము ఈ సంస్కారములు ప్రత్యయముల సూక్ష్మావస్థలేకాని ప్రత్యయములు కావు సంస్కారము లెట్టివో అట్టి ప్రత్యయములు నిరోధింపబడిన యెడలనే సంస్కార నిరోధ మగునని అనజెల్లదు బాల్యాద్యవస్థలలో నెన్నియో ప్రత్యయము లడగి యుండును గాని సంస్కారములు మాత్రము పోవు, ఆ సంస్కారములవల్ల యావ నాద్యవస్థలందు ఆ సంస్కారముల కనురూపములగు ప్రత్యయములు చూపట్టు

చుండును. రాగ మున్న తరిలో క్రోధప్రత్యయము లడగియుండినంతమాత్రము ననే క్రోధ సంస్కారము లస్తమింౘువా? సంస్కారములు సంస్కారముల వలననే అడగును సంప్రజ్ఞాత సంస్కారములు నిరోధసంస్కారముల వలననే అడగును. ఎటు లనగా క్రోధప్రత్యయోత్థాన సంస్కారములు క్రోధనిరోధసంస్కారముల వలననే అడగును క్రోధము నక్రోధముచే జయించుటనగా నిదియే.

పరిణామత్రయమున విశేషము

ఏకాగ్రతాపరిణామమున చిత్తమునకు సమాధి సమాధి పరిణామమున సంప్రజ్ఞాత యోగము నిరోధపరిణామమున అసంప్రజ్ఞాత యోగము

ఏకాగ్రతా పరిణామమున సదృశవృత్తి ప్రవాహము సమాధి పరిణామమున ఒకే ఒక విషయమున చిత్తమునకు లయము నిరోధ పరిణామమునందు చిత్తమునకు అవసితి.

సమాధివల్ల ప్రజ్ఞోత్పత్తి ప్రజ్ఞవల్ల ప్రజ్ఞాసంస్కారోత్పత్తి ప్రజ్ఞాసంస్కారమువల్ల అవిద్యాసంస్కారవిలయము. దాన వివేక ఖ్యాతి అటు పిదప పురుషప్రజ్ఞ.

నిరుద్ధమగు పిదప చిత్తమునకు పని యుండదు ఆత్మకును గుణములకును వేరిమి తెలిసినందు వలన పరవైరాగ్యము కలిగి చిత్తము లీన మగును. ఇది కేవల స్థితి ఈ స్థితి కలుగగనే గుణపరిణామము ఉండదు చిత్తమున ప్రత్యయముతో పాటు సంస్కార మిగిరిపోవును చిత్తమే యిక నుండదు నిరోధాభ్యాసము గట్టి పడినకొలది నిరోధసంస్కారముల కుపచయము కలుగును. ఈ సంస్కార దార్ఢ్యమే నిరోధభూమికాస్థైర్యము. ఈ సంస్కారము సంప్రజ్ఞాతసమాధిలో కలిగిన ప్రత్యయమునకును సంస్కారమునకును విలయము కలిగించును దానితో చిత్తము నిర్బీజ మగును. అసంప్రజ్ఞాతరూప మగు నిరోధము నిరోధసంస్కారములను పొడమ జేయును ఈ సంస్కారముచే పరవైరాగ్యము కలుగును. చిత్తమిక మొలకెత్తదు.

యోగైశ్వర్యము

సంప్రజ్ఞాత యోగమున భాసింపని దేదియు నుండదు. ఈ సమాధికతన బుద్ధితత్త్వము మొదలుకొని భూత తత్త్వమువఱకునుగల తత్త్వము లన్నియు ఎరుక పడును. ఈ యోగమున గలిగిన జ్ఞానము సంప్రజ్ఞానము దీనిచే స్థూల సూక్ష్మ కారణము లన్నియు తెలియును దీనికి కనబడని విషయ మని ఒకటి ఉండుటకు వీలులేదు ఇది సమాధి వలన బొడమిన జ్ఞానము సంశయమేని ఆవరణమేని దీని ముందు నిలువ జాలదు ఈ సంప్రజ్ఞాత యోగము సృష్టిలోని సోపానముల నన్నిటిని బహిరంగపరచును సంప్రజ్ఞాత యోగము సృష్టిరహస్యమును ప్రకాశింపజేసి క్లేశములను పోకార్చి కర్మబంధమును సడలించి చిత్తమును నిరోధమున కభిముఖ మొనరించును.

గుణవృత్తము చంచల మని తెలిసికొంటిమికదా! ప్రఖ్యారూపమగు చిత్త సత్త్వము తమోగుణ యుక్తమగునేని అది అధర్మ - అజ్ఞాన - అవైరాగ్య - అనైశ్వర్యముల కాశ్రియ మగును రజస్తమో గుణయుక్తమాయెనేని అది విషయ - ఐశ్వర్య ప్రియ మగును. మోహావరణము లేని రజోలేశముతో కూడెనేని అది ధర్మ-జ్ఞాన - వైరాగ్య - ఐశ్వర్యముల కాలవాల మగును ఆ లేశముగూడ లేనియెడల ఆ చిత్తమున కపుడు స్వరూప ప్రతిష్ఠ. అపుడు బుద్ధితత్త్వమునకును పురుషతత్త్వమునకును గల భేదము తెలిసిపోవును రజస్తమోను విద్ధమై ప్రఖ్యారూపమగు చిత్తసత్త్వమునందు క్రియ సూక్ష్మ మగుటవలన ఐశ్వర్యము ఖాన మగును విషయ-ఐశ్వర్య - పరత్వము రజోభిభూతమగు చిత్తక్రియ. తమోభిభూతమగు చిత్తమున ప్రకాశ మించుకయు లేమి అధర్మ - అజ్ఞాన - అవైరాగ్య - అనైశ్వర్యముల కుద్రేకము ఇవి జ్ఞానమునకును శుద్ధ సత్త్వమునకును విరుద్ధ ధర్మములు. తమస్స్పర్శ లేని రజస్సుతో గూడిన చిత్తమున ధర్మజ్ఞాన వైరాగ్యైశ్వర్యములకు ప్రకాస్తి ఇచట రజఃప్రధానమగు సత్త్వమునకు క్రియాశీలత. దీనివలన చిత్తమున ఉత్తమమగు జ్ఞానమునకు వికాసము ఈ జ్ఞానదర్పణమున నన్నియు ప్రతిఫలించును. మరియు ఈజ్ఞానమున వివేక వైరాగ్యముల కలిమి స్వాభావికము.అట్టియెడ పదార్థ జ్ఞానము సునిశ్చితము విశుద్ధమగు నీవిజ్ఞానమున సూక్ష్మతమమగు శక్తితో పరిచితియు దానిమీద కర్తృత్వముమ ఒదవును ఇదియ యోగైశ్వర్యము. యోగుల కిది విశుద్ధ విజ్ఞానమువలన గలుగు ఫలము ఇది స్వాభావికము యోగుల ఇచ్ఛకు ప్రతిఘాత ముండదు తమోగుణాపచయముచే చిత్తమునకు వెలుగును స్ఫురణమును కలుగును. ఈస్ఫురణమువలననే యోగులకు సహజముగనే సూక్ష్మవిషయముల మూలమూలలు తెలియును ఇట్టి శక్తి విస్తృతియు స్వాభావికముగనే పొందుపడును. ఇక రజోగుణము క్షీణించి శుద్ధసత్త్వ ముదయింపగనే యోగి ప్రసంఖ్యానమునందును వివేకమునందును ప్రతిష్ఠితుడగును యోగి అటుమీద శక్తిని ఐశ్వర్యమును వికసింప జేయడు ఏలయనగా అందుల ప్రకృతి స్పర్శ యుండక తక్కదు. వశిత్వము కామావసాయిత్వము మొదలగు సిద్ధు లన్నియు రజోగుణాశ్రియములు. శుద్ధ సత్త్వముచే జ్ఞానమునకు పెంపు, అవిద్యకు తెంపు

చిత్తమునకు గలుగు పరిణామ స్వరూపమును తెలిపి భాష్యము వేరువేరు సోపానముల నధిరోహించిన యోగులతో మనకు పరిచయ మొనరించినది. శక్తి వికాసము జ్ఞానసోపానమునకు దిగువ శక్తివికాసము రజః ప్రధానము. జ్ఞాన-వివేక-వికాసము సత్త్వప్రధానము శక్తివికాసముచే ఈశ్వరాధికారమువంటి అధికారము. జ్ఞానము వికసించు నెడల ఆ అధికారమునందలి మోహము తొలగిపోవును. ఆ వ్యామోహము తొలగ జారుటయ తడవుగా ప్రసంఖ్యానమును వివేకమును ఉదయించును. అంతట ముక్తికి రాదారి యేర్పడును.

శ్రీ మద్రామాయణ కల్పవృక్షము - శిల్పదృష్టి

అ వ తా ర ఖం డ ము

౨

ఉ. వచ్చిన శౌరి దేవతలు వాఁగులు చుట్టి ప్రదక్షిణించి
పచ్చని వెల్గు మా నయనవారిజ కేసర దీప్తి రొమ్ముపై
మచ్చ చరన్మధు వ్రతము మా హృదయేశ్వర! కెంపు గంటమౌ
విచ్చెఁటవిల్లు తేనియలు జిమ్మిన లేచిన ధారయున్ ప్రభూ!

దేవతలు విష్ణుమూర్తిని ప్రదక్షించిరి ఇట్లు స్తోత్రము చేసిరి· భగవంతుని శరీరము నందలి పచ్చని కాంతి - వారి కన్నుల వెలుగు, ఆయన రొమ్ముపై గలమచ్చ - కదలుచున్న తుమ్మెద, ఆయన బుజమున నున్న యగ్ని వంటి ధనుస్సు జిమ్మిన లేచిన తేనియలధార ఇది పద్యము యొక్క అర్థము చమత్కారము చూడవలయును - తామర పువ్వులు, తుమ్మెద, తేనెధార. తామర పువ్వులు దేవతల కన్నులు తామర పువ్వునుండి వచ్చుకాంతి భగవంతుని శరీర కాంతి, ఆయన ధనుస్సు తేనెధార. ఆతని రొమ్ము మీది మచ్చ, వ్రాలుతున్న తుమ్మెద. తామరపూవు యని యొక టుండగా, దానినుండి వెలుగు వచ్చును దానినుండి తేనె ధారవచ్చును తామర పువ్వునకు ప్రాధాన్యము ప్రధాన వస్తువది అదియుండగా రేకల కాంతి యుండును. తేనె యుండును, ఇచ్చట ప్రధానమైన వస్తువేది? - దేవతల కన్నులు - అవి తామర పువ్వులు. వాని నుండి సముద్భవించినది భగవచ్ఛరీర కాంతి, తక్కిన రెండును కూడ నింతియే. అనగా - విష్ణు మూర్తి దేవతా సమూహము యొక్క భావనా మూర్తియని యర్ధము. వారు భావించినచో భగ వంతు డున్నాడు భావించనచో లేడు. ఇది అద్వైతమతము ఈ భావనయొక్క స్వరూపము భగ వత్సంబంధమైన మధుర భావనా సంజనితము - ఆయన విల్లు, తేనెధార కట్టిన స్తంభము. పుష్పమునందు పరమ ప్రధానమైనది, తేనియ వారు శౌరియొక్క ధనుస్సు నుండి, కాబోవు రావణవధయందు కోరికచేత - ధనుస్సునకు ప్రాముఖ్యము చెప్పినారు దానిని తేనె జల్లు యొక్క కంబముగా వర్ణించినారు!

సీ. ఓయి హృషీకేశ! దోయిలింతుము నీకు
శార్ఙ్గ ధనూరాజ! స్వాగతంబు
అనిరుద్ధ! నీకు బాదాభి వందనములు
హరివింటి మన్నీఁడ! యంజలియిది
సంకర్షణా! సమర్చలు నమస్సులు నీకుఁ
గార్ముకోత్తమ! నీకుఁ గైమొగుడ్పు
మధుసూదనా! నీకు మంత్రపుష్పము లివ్వి
యద్భుతధనువ! జోహారునీకు

గీ. ఎన్నడెఱుఁగని దర్శనం బిచ్చినారు
తొలిముని బుజమ్ముపై నొప్పు తొలిధనుస్సు

తొలిమహా సుకృతంబులుఁదోఁచి నట్లు
మరకత శలాక యిది యిద్ది మణిశలాక!

ఈ పద్యమునందు పూర్వ పద్యము నందలి భావన కంటె - విలక్షణమైన యింకొక భావన గలదు. హృషీకేశుడు, అనిరుద్ధుడు సంకర్షణుడు, మధుసూదనుడు, - అన్న నాలుగు సంబోధన లున్నవి. ఇవి విష్ణువును గూర్చిన సంబోధనలు ఇందులో ననిరుద్ధ, సంకర్షణ శబ్దములు కలవు వెనుకటి పద్యములో నద్వైతమును బోధించి రెండవ పద్యములో - నీసంబోధనల చేత కవి . విశిష్టాద్వైతమును స్ఫురించుచున్నాడు. విశిష్టాద్వైతమునందలి వ్యూహము లలోని నామములు - సంకర్షణ, అనిరుద్ధ శబ్దములు అద్వైతము భావనా మయమైనది, క్రియా జగత్తునకు వచ్చునప్పటికి ప్రథమ దశలో - నీ వ్యూహములు భాసించును. ఇది కవి యొక్క అద్వైత, విశిష్టాద్వైత మతముల యందలి సమాన భావము.

ఈ పద్యమందు - సీసపద్యము యొక్క నాలుగు చరణముల యందు - మొదటి సగము, విష్ణువును సంబోధించుట, రెండవ సగము ధనుస్సును సంబోధించుట, - విష్ణువున కెంత ప్రాధాన్యమో ధనుస్సున కంత ప్రాధాన్యము ఇది రామకథా రహస్యము.

- 'తొలిముని బుజమ్ముపై నొప్పె తొలి ధనుస్సు' — ఇది శ్రీరామ చంద్రుని యరణ్యవాసము నందలి మూర్తి' మునికి ధనుస్సునకు సంబంధములేదు, రామావతారములోని రహస్యమిది, శాంతమైన ప్రకృతితో దుష్ట శిక్షణకు కావలసిన రజః ప్రకృతి కలిసి యుండుట రెండును విడివిడిగా నుండుట - సత్వరజో గుణముల కలయిక రాముడిట్టి వాడేకదా' పరమ శాంతుడు, పరమ ధర్మ స్వరూపుడు దైత్య సంహరణ శీలుడు - 'మరకత శలాక యిది, యిద్ది మణి శలాక!' — ఈ యుపమాలంకారము రమణీయమైనది పద్యాంతమున నుండి పాఠకుని బుద్ధికి చమత్కారాతిశయమును కలిగించును

సీ. యాగ సంరక్ష దీక్షాగురుమూర్తి యీ
  తొలిబ్రహ్మచారి యుద్ధురత వచ్చె
మునిరూపమంది యీ మొదటివేలుపు దిట్ట
  వైకుంఠ రాజ్యమ్ము వదలివచ్చె
ఈ శ్రీశమూర్తి యాద్భుత శివాకృతిమౌని
  పరమహాలంకారి యరుగుదెంచె
ధర్మంబునే చంకతాళిగాఁ గొనిస్వామి
  యెడఁద మహాలక్ష్మి నడుపుఁగాంచె

గీ. శ్రీవికుంఠ మహానగరీ మరకత
నిభృతకుడ్యాంశుపుంజ దననీడఁజూచి
యిప్పుడీ స్వామి తన్నుఁదా నెఱుఁగఁగలఁడొ!
యెఱుఁగఁజాలఁడొ యనురూపి మెసక మెసఁగె.

ఈ పద్యమందు రామావతార కథలో రాముని చరితము వరుసగా సూచింప బడినది. ఉన్న ణము లున్నట్లుగా భగవంతునికి సమన్వయ పడుచు, రామకథను సూచించును. యాగ

సంరక్ష దీక్షా గురుమూర్తి - భగవంతుడు సర్వయాగ సంరక్షకుడు రాముడు విశ్వామిత్ర యాగ సంరక్షకుడు ఆ సమయమునందు రాముడు బ్రహ్మచారి. భగవంతుని విషయములో బ్రహ్మ నిష్ఠుడని యర్థము బ్రహ్మ బ్రాహ్మణుడని యర్థము తొలి బ్రహ్మ చారి యనగా - నిచట తొలి శబ్దమునకు సనాతన తత్వము యర్థము. రామచంద్రుని విషయములో - రామావతార ప్రథమ దశయని యర్థము

రెండవ చరణములో యీ మొదటి వేలుపు మునిరూపము నంది వైకుంఠ రాజ్యమును వదలి వచ్చె - నని యున్నది భగవంతుడైన విష్ణువు వైకుంఠము నందు శంఖ చక్రగదా ద్యాయుధ ధారియైన విరాణ్మూర్తిగా నుండును వదలి వచ్చినపుడు మహా తేజస్సుగానుండును తదంశయే లోకము నందవతరించును, ఆయంశ యొక్క స్వరూప మేమి? ముని రూపము ఇది యిట్లుండగా— రాముడు ముని రూపమును పూని వైకుంఠము వంటి తన రాజ్యమును వదలిపెట్టి వచ్చెనని రామచరిత్రలోని రెండవ ప్రధానదశ సూచింప బడు చున్నది

మూడవచరణమున — రావణవధ సూచింప బడుచున్నది. ఆయన శ్రీశమూర్తి శ్రీ + ఈశ - శ్రీశ. సంపత్తునకు ప్రభువు లక్ష్మీదేవి భర్త ఈ శబ్దము చేత సీత, లక్ష్మీదేవి యొక్క అవతారమనియు, నతడు సీతాపతి యనియు సీత కొఱకు రావణ వధ చేసెననియు-నర్థము ఆయన ఆద్రుత శివాకృతి - ఆదరింప బడిన శుభమైన యాకారము కలవాడు లేదా ఆదరింపబడిన శివునియొక్క ఆకారము కలవాడు శివుడు మున్యాకృతి కలవాడు, ఈయనయు నట్టి వాడే మరియు సీతదెట్టివాడు? — మౌనివర మహాలంకారి - మునిశ్రేష్ఠుల యొక్క గొప్ప వైన అలంకారములు కలవాడు - అనగా జటలు మొదలయినవి రెండవ యర్థములో మౌని వరుడును, మహాలంకారియును - లంకాపట్టణ విరోధియని యర్థము. (మౌని వరశ్చ అసౌ మహాలంకారిశ్చః) ఇట్లుండగా - మొదటి యర్థమున యలంకార శబ్దముగా వాడినపుడు, ఇన్ ప్రత్యయము సామాన్యముగా చేయరాదు. మహాలంకారుడు - అని యుండ వలయును కాని ఒకటి - శ్లేషయగుట చేత - రెండవది మహా భాష్యమునందలి మహాధని, మొదలైన ప్రయోగ ములచేత నిది సాధువగు చున్నది ఈ మూడవ చరణమున రావణ వధ సూచింప బడినది.

నాల్గవ చరణమున రామావతారము నందలి సీతా పరిత్యాగము సూచింపబడినది ఈయన ధర్మము చంక తాళిగా గొని - హృదయము నందలి మహాలక్ష్మి యొక్క విడుపును పొందెను-లక్ష్మీదేవి విష్ణువు యొక్క నిత్య వక్షస్థిత ధర్మమనగా ధనుస్సు (ధర్మమునకు ధనుస్సుయని వేరే యర్థము కలదు) ధర్మ శబ్దము, యీ శ్లేషతో కాసుల పురుషోత్తముగారు కూడ వాడిరి. ధనుస్సును చంక బెట్టుకొని లక్ష్మిని వదలి వచ్చినాడని యర్థము. ఇది అపుడు యజ్ఞమునకు వచ్చిన విష్ణువుయొక్క వర్ణనము రామావతారమునకు సంబంధించి - రాజ ధర్మమును చంక తాళిగా కట్టుకొని సీతా పరిత్యాగము చేసినాడని సూచన' చంకతాళి యన్న శబ్దములో - నీయర్థ ములో - సీతా పరిత్యాగము చేయుట యందలి కార్యమునందు కవికి రామచంద్రుని యందుగల కోపము సూచింప బడుచున్నది ఈ చంకతాళి - యన్న మాట లోకము నందుపయోగింతురు ఆక్షేపోక్తి యందే యుప యోగింతురు అనిష్టమైన దాని నొకడు సర్వదా యాచరించుచున్నచో. వాని కదియొక చంక తాళియైనది-. అని లోకము నందలి వాడుక

ఇక గీత పద్యమునందు శ్రీరామ చంద్రుని యొక్క మాయామానుష విగ్రహలక్షణము చెప్పబడినది, శ్రీకృష్ణుడు లీలామానుషవిగ్రహుడు శ్రీరామచంద్రుడు మాయామానుష

విగ్రహుండు - నన్నది జగత్ప్రసిద్ధమైన విషయమే. ఈయన వైకుంఠ పట్టణము నందలి మరకతపు ప్రాకారపు గోడలలో తననీడ చూచుకొని, తన్ను తానెరుగ గలడో, నెరుగలేడో యనియర్థము. ఆగోడలు మరకతపు రాళ్ళవి. ఈయన శరీరము మరకతచ్ఛాయ అందులో నిదికన్పించదు కలిసి పోవును ఇది భగవంతునియొక్క స్వరూపము. విరాణ్మూర్తి, నవతారమూర్తి భేదము లేదని చెప్పుట

సీ. అసురమారీకేళి పిశునమై యేపారెఁ
గర్తృక్రియలు రెండుఁగలిసినట్లు
అభయహస్త ప్రదానాకృతిం జనెధను
స్సధికహస్తము వోలె నందగించి
బ్రాహ్మణక్షత్రధర్మ పరస్పరాశ్రయ
క్రమ మొప్పె ముని భుజాగత ధనుస్సు
సంకల్ప సహిత భాస్వత్సచ్చిదానంద
మధుబోధ కళవోలె మలఁగెమూర్తి

గీ. హరిధనుఃఖండ సహితమై యవనికిడిగె
నవశబలరోచి ప్రాగ్గగనంపుముక్క
యని సహస్రధా దివిషత్సహస్రములన
వీననుతి సహస్రంబు లావిర్భవించె.

ఈపద్యమునందు రావణవధ ప్రధానమైన రామావతారము వర్ణింపబడినది. రామావతారము యొక్క ప్రయోజనమదియొక్కటియే, అదియెట్లున్నదనగా- కర్తృక్రియలు రెండుకలసినట్లున్నది. కర్తయున్నాడు. అతడు క్రియచేయును క్రియాదశయందు రెండును రెండే వృక్షము బీజమునందిమిడియున్నట్లు క్రియయందు కర్తయిమిడియున్నాడు కర్తయందు క్రియయున్నది. ఇప్పుడు మునిరూపమున నున్న శౌరిబుజమునందున్న శార్ఙ్గమట్లున్నది రెండును కలిసియున్నవి—కారణమునందు కార్యమిమిడి యున్నట్లు! ఇదికొంత తర్కము ఈశౌరి శార్ఙ్గసంయోజనమెట్లున్నదనగా—అసురమారీకేళిపిశునముగా—నున్నది రాక్షసులను సంహరించుట యను క్రీడను సూచించుచున్నది—ఇందు రావణకథ సూచితము. రెండవచరణములో ధనుస్సు యధికహస్తము వలెనున్నదని—అభయహస్తప్రదానము వలెనున్నదని. అభయహస్తము దేవతావిగ్రహములు యొక్క శిల్పపుచేతలోని యొకవాస్తుశాస్త్ర గతవిషయము. అందుచేత రామునియందు దేవతాత్వ నిరూపణము ఇందులో విభీషణశరణాగతి సూచితము రావణుని వధించుటయు, విభీషణుని కథయు మొసగుటయు—రెండుచరణముల యందుకలసి—చెప్పబడినట్లున్నది మూడవచరణమునందు మునియొక్క బుజమును పొందిన ధనుస్సు బ్రాహ్మణధర్మమును, క్షత్రియధర్మమును—ఒకదానినొకటి యాశ్రయించి నట్లున్నదనియర్థము. బ్రాహ్మణధర్మము—క్షత్రియధర్మమును పాలించవలయును క్షత్రియధర్మము బ్రాహ్మణదర్మమునురక్షించవలయును యిదికృతయుగము నాటిస్థితి రావణవధ యైన తరువాత రాముడు పదివేల యేండ్లు రాజ్యము చేసెను ఆస్థితి దీని యందుసూచితము నాల్గవ చరణమునందు సంకల్పముతో కూడిన సచ్చిదానంద రూపమని-జ్ఞానము వలె నాశౌరి మూర్తియున్నదని యర్థము సచ్చిదానందమయమైన చైతన్యము బ్రహ్మపదార్థము

వంటిది బ్రహ్మ పదార్థమే మూడులక్షణములుకలది. ఇట్లుండగా సంకల్పముచేత సృష్టిజరుగుచున్నది సచ్చిదానందమయబోధకళ - శౌరిసంకల్పము ధనుస్సు. ఆరెండును కలసినట్లున్నదనుట-రామావతారాభిముఖ్యము దీనియందుస్ఫూర్తి

గీతపద్యములో క్రొత్తచిత్రమైన రంగులుగల తూర్పుటాకాశఖండము-ఇంద్రధనుస్సహితమై నేలకుదిగినట్లున్నదని యర్థము ఆకాశమే ఇంద్రధనుస్సుతో కలిసి నేలకు దిగివచ్చినదని యర్థము, గగనమునల్లగానుండును విష్ణువుయొక్క శరీరచ్ఛాయనలుపు పరమేశ్వరుడనంతుడు. అందుచేత కొంతసామ్యము ఆయాకాశపుముక్క నేలకుదిగి వచ్చెనని యుత్ప్రేక్ష. ఇదికాక, ఆకాశపుముక్క కర్తయైనప్పుడు హరిధనుఃఖండమన్నమాటకు-ఇంద్రధనుస్సు అనియర్థము మొదటిచరణము మొదటిచరణముగా చూచుకొన్నచో-హరి-విష్ణువుకు, ధనుఃఖండసహితమై, శార్ఙ్గమును చేతబూని నేలకుదిగివచ్చినాడని యర్థము. అప్పుడుధనుఃఖండ సహితుడై అని యుండవలెను. కానిదాని నవ్యయీభావసమాసము చేసినచో నర్థముకుదురును.

పంచవటి

శ్రీ కే. వేం. నృ. అప్పారావు

"ధారుణి మిన్న ధ్వస్త సముదాయమునందల దక్షునిష్టి త
త్కారణ జాతమందతఁడె గణ్యత గాంచును; యజ్ఞకర్తయై
నేరక యజ్ఞమూర్తి శివునిం ద్యజియించి తదీయ సత్కృపా
ధారిత వైభవాస్పదులఁదత్పరిచారకులన్ భజించెఁదాన్

"కాపురమా స్మశానమునఁ, గట్టఁగఁ బట్టము లేదు, భైక్షమున్
సాపడునంచు లోకపతి శంకరు దక్షుఁ డవజ్ఞ సేయఁ ద
త్కోపము రూపుదాల్చి యటఁ దోఁచె మహోగ్రత వీరభద్రుఁడై
పాపము నుండి హింసప్రభవంబగు, నయ్యది పాపహేతువౌ.

"ఆవిరోధ్యున్నతు, వీరభద్రుని, మహాహంకారు శాంతాత్మకున్
గావించెన్నది శీతపూత జలసేకంబంతటన్ జేయుచున్,
గోపూర్ణాత్మక గౌతమాశ్రమమునన్ గోరూపమౌ యజ్ఞము
జ్జీవంబొందెఁ దనంత నిష్కృతిని దాఁజేరంగఁ దత్ స్థానమున్.

"అప్పటినుండి 'గోద' యనునాఖ్యవహించె నదీలలామ దా
నిప్పుడమిన్ దదాశ్రమము నెన్నికగాంచెను గోష్పదాఖ్యమై
ఇప్పుడు కూడఁ గాననగు నీ నది పూత తరంగపంక్తిత
మ్మెప్పుడుఁ దద్దుచుండనట నిమ్మగ నా గవిపాదచిహ్నముల్.

"క్రమనిర్వ్యాఘత గాంచియున్ జెడెను యాగంబే కలింగాప చా
రముచేనంచునో యీమె నూల్కొనెనౌనర్పన్ గోటిలింగాభిషే
కముదానన్ బరమేశ్వరుండలరి యజ్ఞస్తోమమున్ బ్రోచె, వి
శ్వము పాలించు విభుండు తుష్టుఁడగు విశ్వప్రీతి యైనప్పుడే!

"ఈశావాస్యము సర్వమంచు మదిలో నేవేళ భావించి,స
ర్వాశల్గోసి, స్వధర్మమున్ విడక సత్యాహింసలన్ బూని, హృ
త్కోశారూఢతమో గుణాత్మ పశువున్ ద్రుంగించువాఁడే భువిన్
రాశీభూత యశస్కుఁడౌఁ బశువధన్ స్వర్గార్థి నింద్యుండగున్.

"యజ్ఞము దానమున్ దపమునన్ త్రితయంబు త్రివేణి తుల్యమౌ
విజ్ఞతనింపు మున్కలిడి విశ్వజనుల్ సమయింత్రుపాపముల్
అజ్ఞత నెంత చేసినను నబ్బదుసూ! ఫలమింత యేని, సా
వజ్ఞత గంగలో నెపుడు వర్తిలుచుండవె నక్రసంతతుల్.

"ఏవిధినైన నన్నమును వృద్ధియొనర్చుట యజ్ఞమౌఁ జుమీ
ఈ వసుధన్ బదార్థతతి నెల్లరుఁ జక్కఁగఁ బంచుకొంట సం
భావితమౌను దానమున, వాఙ్మనసాంగములన్ సదా జగ
త్సేవ మొనర్చుటే తపము, శ్రీశుని బ్రీతుని జేయు నివ్వియే!

"గౌతమి నీరముల్లలుగఁ గర్షకులొందిరి ధాన్యరాసులన్
హోతృగణంబు వహ్నులను హోమముచేసిరి హవ్యరాసులన్
ఛాత్రులఁగూడి శ్రోత్రియులు చక్క బఠించిరి వేదరాసులన్
దాతలు స్వర్గభూని గడనం బొనరించిరి పుణ్యరాసులన్.

"ధర స్వర్గాభము గాఁగఁజూచి యిట సప్తర్షుల్ స్వకీయంబులౌ
సిరవుల్ జామవరీతముల్ విడిచి వేయేలెంచి గోదావరిన్
దరియంగా, భవశేశ్వరంబు కడ సత్కారంబుతో నేడుగా
విభయంబాటి యొసంగె బాయలు మునుల్ స్వీయాభిధన్ జేకొనన్.

"ఈవిధిఁ గౌశికి ప్రముఖ ఋష్యభిధల్ వహియించి సప్తగో
దావరమన్నభిధన్ దనరు దాని మునుల్ దగనబ్ధి జేర్చి ర
త్నాకరు జేరుల్లోపలనె తద్గతభేదములొప్పఁగాని యా
పై విలసిల్లు నెల్లపుడు వారిధి సంగతి నిత్యపూర్ణయై

"కోరిన భుక్తిముక్తు లిడు కొంగున బంగరు మానవాళికిన్,
భారతమాత నెన్నడుమునన్ ధరియించిన హేమకాంచి, భా
గీరథియక్క, యీశ్వరునికిన్ బ్రియురాలు, ఋషీంద్రసప్తకం
బారతి పట్టినట్టి విమలాశయ, గౌతమి, మ్రొక్కుమో ప్రియా!"

ఉపనిషద్వాక్యములు

శ్రీ ధూళిపాళ రామచంద్రశాస్త్రి

శ్లో॥ "యజ్ఞ ఇతియజ్ఞో నహి దేవా దివంగతాః
యజ్ఞే న్వాఽసురానపానుదంత యజ్ఞేన
ద్విషంతో మిత్రాభవంతి యజ్ఞే సర్వం
ప్రతిష్ఠితంతస్మా ద్యజ్ఞం పరమం వదన్తి"

మోక్షసాధన ప్రకరణమున యజ్ఞము పదవ సాధనముగ నిరూపింప బడినది "యజ్ఞోహి దేవానాం ప్రియః" అనుటచే యజ్ఞము దేవతలకు ప్రియమైనదని తెలుపుచున్నది, దేవతలు పూర్వ జన్మయందు యజ్ఞము నాచరించియే స్వర్గమునుబొంది దేవత్వము కలవారై యున్నారు మరియు, వారు అప్పుడప్పుడు యజ్ఞములనుజేసి తత్సహకారమున రాక్షసుల బలమును నశింపజేసి స్వకీయములగు స్థానములకు భంగములేకుండ రక్షణ కృత్యమును నిర్వహించుచున్నారు ఈ విషయము వేదమునందచ్చటచ్చట బాగుగ నిరూపింప బడినది మరియు, సకలమనోరథ సాధకములగు జ్యోతిష్టోమాది యాగములు ద్వేషభావమును తొలిగించి శత్రువులను మిత్రులుగాజేయు మహిమకలవైయున్నవి గనుక ఈ విధముగ సకల శ్రేయో మార్గములు యజ్ఞమందు సుప్రతిష్ఠితములైయున్నవి ఈ కారణములనుబట్టి యజ్ఞము ఉత్తమమైన శ్రేయస్సాధనమని భావము

కాబట్టి అధికారియగు ప్రతిమనుజుడును సత్కర్మానుష్ఠానము చేయవలెనని భగవద్గీత యందుకూడ ఈ విధముగా బోధింప బడినది

శ్లో॥ సహయజ్ఞాః ప్రజాస్సృష్ట్వా పురోవాచ
ప్రజాపతిః । అనేనప్ర సవిష్యధ్వ మేషవోస్త్విష్ట కామధుక్॥

భావము - సృష్ట్యాదియందు హిరణ్యగర్భుడు ప్రజలను యజ్ఞ సహితముగనే సృజించి ఈ యజ్ఞము లచే మీరు వృద్ధి నొందుదురుగాక ఈయజ్ఞములు మీకుఅభీష్టములగు ఫల విశేషములను ఇచ్చునవి యగుగాక యని పలికెను విహిత కర్మల నాచరించు మానవులు సహయజ్ఞులని చెప్పబడుదురు అనగా కర్మాధి కారులని భావము కర్మాధి కృతులగు ప్రజలను కల్పాదియందు సృష్టించి సృష్టికర్త ఈ విధముగా పలికెను స్వాశ్రమోచితమగు ధర్మమును యథా శాస్త్రముగ ఆచరించి మీరు ఉత్తరోత్తరాభి వృద్ధిని పొందుడు, అట్లు చేసినచో ఈ ధర్మము అభీష్టములగు ఫలములను మీకు ప్రసాదించును విహితములగు కర్మలనాచరించని యడల ప్రత్యవాయము సంభవించునని ముందు నిరూపింపబడుచున్నందున ఇచట 'యజ్ఞశబ్దము ఆవశ్యకములు, విహితములు నగు కర్మలకు ఉపలక్షకమైనది

మరియు, "ధర్మజ్ఞ సమయః ప్రమాణమ్" అనుసూత్రముచే వివరింపబడిన ప్రకారము ధర్మవేత్తలలో శ్రేష్ఠులగు వారిచే నీధర్మము బోధింపబడి యుండుట వలన ప్రమాణ సిద్ధమైయున్నది కావున నిరతి శయ సుఖమును కోరువారు దేవతానుగ్రహముకొరకు ఈ యజ్ఞరూపమగు ధర్మమును అవశ్యము, ఆచరించ వలెనని "సహయజ్ఞాః"అను శ్లోకముచేతగూడ వివరింపబడుచున్నది గనుక ఇందుసారాంశమేమనగా సృష్ట్యాది యందు బ్రహ్మ వేదవిహితములగు ధర్మములతోగూడ ప్రజలను సృజించి శ్రౌతస్మార్తములగు కర్మల నాచరించి హవిర్భాగాదులచే దేవతల కానందమును కలుగ చేయుడు దేవతలనుద్దేశించి చేయబడు ధర్మములన్నియు అభీష్టములగుఫలములను సాధించగలవు అని ఉపదేశించెను కాబట్టి శాస్త్రవిధానము ననుసరించి చేయబడినధర్మము నిష్కామములకు జ్ఞానప్రతిబంధకమైన పాపమును బోగొట్టి జ్ఞానోత్పత్తికి సాధనమగుననియు, సకాములకు స్వర్గాది భోగములను సమకూర్చి మానవానందముకన్న విశిష్టమైన సుఖమునకు సాధకము కాగలదనియు భావము

కనుకఅధికారముకలవారు తమకు విహితము లగుధర్మముల నాచరించి అభీష్టములగు సమస్తఫలము లను బొందుదురను భావము ఇందుసూచింపబడుచున్నది

శ్రీ భరతముని ప్రణీత
నాట్యశాస్త్రమ్

ఆంధ్రభారతి

డాక్టర్, శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి, ఎం. ఏ., ఎం. లిట్., పిహెచ్. డి.

పంచమోఽధ్యాయః

పూర్వరంగ విధానము

జర్జరం సమయిత్వాతు తత శ్చారీం ప్రయోజయేత్
పారిపార్శ్వకయోశ్చ స్యాత్ పశ్చిమే నాపసర్పణమ్ ౧౧౩
అడ్డితా చాత్ర కర్తవ్యా ధ్రువా మధ్యలయాన్వితా ౧౧౪
చతుర్భిః సన్నిపాతైశ్చ చతురశ్రా ప్రమాణతః
ఆద్యమంత్యం చతుర్థంచ పంచమంచ తథా గురు ౧౧౫
యస్యాం హ్రస్వాని శేషాణి సా జ్ఞేయా త్వడ్డితా బుధైః
అస్యాః ప్రయోగం వక్ష్యామి యథాపూర్వం మహేశ్వరః
సహోమయా క్రీడితావా న్నానాభావ విచేష్టితైః ౧౧౬

ధ్వజమునకు నమస్కరించి చారీ ప్రయోగము చేయుచుండగా తూర్పు దిక్కున కభిముఖులై పశ్చిమముగా అడుగులను వేయుచు పారిపార్శ్వకులు నిష్క్రమించవలెను. అనగా చారీ మహాచారీ ప్రయోగములు కేవలము సూత్రధారునిచే ప్రయోగింప బడవలసినవని యర్థము.

అప్పుడు మధ్యలయలో అడ్డితాధ్రువాగానము వినియోగింపబడవలెను. చంచత్పుట తాళమున నాలుగు పాదములతో నున్నదీ ధ్రువ. ఇందు ఆద్యక్షరము, అంత్యాక్షరము, నాల్గైదక్షరములు గురువులు, శేషించినవి లఘువులు, ఇచట పాదమునకు ఏడు నుండి పదివరకు అక్షరము లుండవచ్చును. కాని ప్రతిపాదమున అక్షర సంఖ్య ఒకే విధముగా నుండవలెను. పూర్వము శివుడుమాదేవితో నాట్యము చేసిన వేళ అడ్డితాచారీ విధానము ప్రయోగించబడినది ఆ ప్రయోగము ననుసరించి దీని లక్షణము చెప్పబడుచున్నది.

కృత్వా వహిత్థం స్థానంతు వామం చాధోముఖం భుజమ్
చతురశ్ర మురఃకార్య మఞ్చితశ్చాపి మస్తకః ౧౧౭
నాభిప్రదేశే విన్యస్య జర్జరంచ తులాధృతమ్
వామపల్లవహస్తేన పాదై స్తాలాంతరోత్థితైః ౧౨౦
గచ్ఛేత్ పఞ్చపదీంచైవ సలిలాసజ్జచేష్టితైః ౧౨౧

మొదట అవహిత్థస్థానకమును ప్రయోగించవలెను. ఇది స్త్రీ స్థానకము. కుడి పాదమును త్రికోణాకారముగా నుంచి, ఎడమ పాదమును సమముగా నుండునట్లు అపసృతముచేసి, రెండు పాదములకు మధ్య తొమ్మిది అంగుళముల దూరము

నుంచవలెను. త్రికోణాకృతితో నున్న పాదమును కొంచెముగా పైకి ఎత్తి యుంచవలెను. అప్పుడు కుడిచేతిని లతా హస్తముగా పట్టి, ఎడమ చేతిని నితంబమున నుంచినచో అవహిత్థస్థానక మగును. రొమ్మును చతురశ్రమముగా నుంచి, వంగిన మస్తకముతో నుండగా కుడిచేతిని కటకా ముఖముగాపట్టి నాభిప్రదేశమున త్రాసువలె జర్జరమును చూపవలెను. పతాక రూపమున నెడమ చేతిని పల్లవింపజేసి, రెండు పాదములు తాళగతులకు లోబడునట్లు విలాసముతో కూడిన అవయవ చేష్టలతో ఐదడుగులు వేయవలయును

వామవేధస్తు కర్తవ్యో విక్షేపో దక్షిణస్యచ
శృఙ్గార రస సంయుక్తాం పఠే దార్యాం విచక్షణః ౧౨౨
చారీశ్లోకం గధిత్వాతు కృత్వాచ పరివర్తనమ్
త్రైరేవచ పదైః కార్యం పశ్చిమే నాపసర్పణమ్ ౧౨౩
పారిపార్శ్వకహస్తేతు న్యస్య జర్జర ముత్తమమ్
మహాచారీం తతశ్చైవ ప్రయుఞ్జీత యథావిధి ౧౨౪

ఆ తర్వాత ఎడమ పాదమును సూచీవిద్ధముగాచేసి కుడిపాదమును విక్షేపించవలెను పార్వతీ ప్రియుడగు పరమేశ్వరుని ప్రణయ కోపాదికమును వర్ణించు శృంగార రసపూరితమైన ఆర్యా శ్లోకము నపుడు విచక్షణుడగు నటుడు పఠించ వలెను. చారీ శ్లోకము నుచ్చరించి, పరివర్తనచేసి, తూర్పుదిక్కున కభిముఖుడై పశ్చిమమున కదే పదములతో నేగవలెను. అప్పుడుత్తమమగు జర్జరమును పారిపార్శ్వకుని చేతిలోనుంచి, విధ్యనుసారము మహా చారిని ప్రయోగించవలెను.

చతురశ్రా ధ్రువా తత్ర తథా ద్రుతలయాన్వితా
చతుర్భి స్సన్నిపాతైశ్చ కలా హ్యష్టా ప్రమాణతః ౧౨౫
అద్యం చతుర్థ మంత్యంచ సప్తమం దశమం గురు
లఘుశేషం ధ్రువాపాదె చతుర్వింశతికేభవేత్ ౧౨౬

యథా— "పాద తలాహతి పాతిత శైలం
క్షోభిత భూత సమగ్ర సముద్రమ్
తాండవ నృత్త మిదం ప్రలయాంతే
పాతు జగత్సుఖదాయి హరస్య" ౧౨౭

ద్వికళతో చంచత్పుటమున, అష్టకలా ప్రమాణాత్మకముగా, నాలుగు సన్నిపాతలతో, ద్రుతలయాన్వితమై ఈ ధ్రువ ఉండవలెను. ఈ ధ్రువా పాదమునకు పదకొండు అక్షరములుండును. ఇందు ఒకటి, నాలుగు, ఏడు, పది, పదకొండు అక్షరములు గురువులు. శేషించినవి లఘువులు. పంక్తికి మూడు భగణములు, రెండు గురువులు ఉండును. ఈ లక్షణములతో కూడిన ఉదాహరణ ఇవ్వబడినది "పాద తలపు దెబ్బచే పడిన కొండయు, క్షోభిల్లిన భూతము లన్నిటితో కూడిన సముద్రమును కలిగి, జగత్తునకు సుఖము నొసగు హరుని తాండవ నృత్తము ప్రళయాంతమున రక్షించుగాక !" అని ఉదాహర శ్లోకములోని భావము.

ఛాందోన్ముఖేన కర్తవ్యం పాదవిక్షేపణం తతః
సూచీంకృత్వా పునః కుర్యా ద్విక్షేప పరివర్తనమ్ ౧౨౮
అతిక్రాంతైః సలలితైః పాదై ర్ధ్రుతలయాన్వితైః
త్రితాలాంతర ముత్క్షిప్తై ర్గచ్ఛే త్పఞ్చపదీం తతః ౧౨౯
తత్రాపి వామవేధస్తు విక్షేపో దక్షిణస్యచ
తైరేవచ పదైః కార్యం ప్రాఙ్ముఖే నాపసర్పణమ్ ౧౩౦

తర్వాత ఛాందోన్ముఖుడై పాదవిక్షేపణమును చేయవలెను. సూచీవిద్ధముగా ఎడమ పాదమును ప్రయోగించి, కుడిపాదమున విక్షేప పూర్వకమగు పరివర్తనమును చేయవలెను. సుందరములై, లలితాత్మకములైన అతిక్రాంత చారీ పాదములను ధ్రుతలయ సహితములుగా ప్రయోగించి, మిశ్రజాతి తాళమున ఐదడుగులు వేయవలయును. అప్పుడు ఎడమకాలిని సూచీ విద్ధముగను, కుడి కాలితో విక్షేపమును మరల ప్రయోగించి అదే అడుగులతో తూర్పున కభిముఖుడై వెనుకకేగవలెను.

పునః పదాని త్రీణ్యేవ గచ్ఛేత్ ప్రాఙ్ముఖ ఏవతు
తతశ్చ వామవేధః స్యా ద్విక్షేపో దక్షిణ స్యచ ౧౩౧
తతో రౌద్రరసంశ్లోకం పాదసంహరణం పఠేత్
తస్యాం తేతు త్రిపద్యాథవ్యాహరేత్ పారిపార్శ్వకౌ ౧౩౨

అప్పుడు తూర్పు దిక్కుగా మూడడుగులను వేసి, ఎడమ పాదమును సూచీ విద్ధముగా నుంచి కుడిపాదముతో విక్షేపమును ప్రయోగించవలెను. ఆపై మహాచారీ ప్రయోగము జరుగవలెను. సమాసయోజనతో ఓజోగుణో పేతమగు రౌద్ర రస పూరితమైన శ్లోకమును పఠించవలెను. ఈ శ్లోకానంతరము పారిపార్శ్వకులు పుంస్త్రీ నపుంసక విభేదముగల త్రిపదీ గమనముతో పరిక్రమించవలెను. ఇచట నే ధ్రువ విహితమో చెప్పబడకపోనటచే వెనుక చెప్పిన అడ్డితాధ్రువనే గ్రహించవలసి యున్నది.

తయో రాగమనం కార్యం గానం నర్కుటకం బుధైః
తథాచ భారతీ భేదే త్రిగతం సంప్రయోజయేత్ ౧౩౩

పారిపార్శ్వకుల ఆగమనమును నర్కుటక ధ్రువాగానముతో ప్రయోగించవలెను. అప్పుడు భారతీ వృత్తి భేదమగు త్రిగతము ప్రయోగించబడును.

విదూషక స్త్వేకపదాం సూత్రధార స్మితావహామ్
అసంబద్ధ కథాప్రాయాం కుర్యాత్కథనికాంతతః ౧౩౪
ప్రరోచనాచ కర్తవ్యా సిద్ధేనోప నిమంత్రణమ్
రఙ్గసిద్ధౌ పునః కార్యం కావ్యవస్తు నిరూపణమ్ ౧౩౫
సర్వమేవ విధిం కృత్వా సూచీవేధకృతై రథ
పాదైరనావిద్ధగతై ర్నిష్క్రామేయుః సమం త్రయః ౧౩౬
ఏవమేష ప్రయోక్తవ్యః పూర్వరఙ్గో యథావిధి
చతురశ్రో ద్విజశ్రేష్ఠా త్ర్యశ్రంవాపి నిబోధత ౧౩౭

విదూషకుడుగూడ నొక పాత్రయై సంభాషించుచుండగా సూత్రధారునకు స్మితము కలుగజేయునట్టి ఒకానొక అసంబద్ధ కథానికను ప్రయోగించవలెను. సిద్ధమైన అర్ధముతో ప్రరోచననుకూడ ప్రయోగించవలెను. ఆపై రంగము సిద్ధించగా కావ్యవస్తువును నిరూపించవలెను. ఈ విధముగా చేసి సూచీ విద్ధముగా పాదములను ప్రయోగించి, అనావిద్ధగతులతో ముగ్గురును నిష్క్రమించవలెను ఈ రీతిగా ప్రయోగించబడిన పూర్వ రంగమును చతురశ్రమందురు

చతురశ్రము, త్ర్యశ్రము, శుద్ధము, చిత్రము అని పూర్వ రంగము నాలుగు విధములు. ఇక త్ర్యశ్ర పూర్వరంగమును గురించి చెప్పబోవు చున్నాడు.

అయమేవ ప్రయోగః స్యా దఙ్గా న్యేతాని చైవహి
తాలప్రమాణం నిక్షిప్తం కేవలంతు విశేషకృత్ ౧౩౮
శమ్యాతు ద్వికలా కార్యా తాలో హ్యేకకలస్తథా
పునశ్చైక కలా శమ్యా సన్నిపాతః కలాద్వయమ్ ౧౩౯
అనేనహి ప్రమాణేన కలా తాల లయాన్వితః
కర్తవ్యః పూర్వరఙ్గస్తు త్ర్యశ్రోఽ ప్యుత్థాపనాదికః ౧౪౦

• త్ర్యశ్ర పూర్వరంగమున కూడ చతురశ్రమునచెప్పబడిన అంగములు ప్రయోగించబడవలెను. కాని ఇచ్చట విక్షేపమును చేయునపుడు రెండుపాదముల మధ్య దూరము తొమ్మిది అంగుళములే ఉండును మొదట శమ్యా అను తాళమును ద్వి కళగా చేసి, తర్వాత ఏక కళాత్మకముగా తాళమునువేసి, ఆపై ఏక కళాత్మకమైన శమ్యాతాళమును ప్రయోగించగా ద్వికళాత్మకమైన సన్నిపాతము వచ్చును. ఈ ప్రమాణము ననుసరించి ఇచ్చట కళ తాళ, లయములను కూర్చవలెను. ఉత్థాపనాది ధ్రువాగానములను కూడ నిట ప్రయోగించవలెను

ఆద్యం చతుర్థం దశమ మష్టమం నైధనం గురు
యస్యాస్తు జాగతే పాదే సా త్ర్యశ్రోత్థాపనీ ధ్రువా ౧౪౧

పాదమునకు పన్నెండక్షరములుండ, అందు ఒకటి, నాలుగు, ఎనిమిది, పది, పన్నెండు అక్షరములు గురువులై మిగిలినవి లఘువులైన దానిని త్ర్యశ్రపూర్వ రంగమందలి ఉత్థాపనీ ధ్రువ యందురు

వాద్యం గతిప్రచారశ్చ ధ్రువా తాలస్తథైవచ
సంక్షిప్తా ప్యేవ కార్యాణి త్ర్యశ్ర నృత్త ప్రవేదిభిః ౧౪౨
వాద్య గీతప్రమాణేన కుర్యా దఙ్గవిచేష్టితమ్
విస్తీర్ణమథ సంక్షిప్తం ద్విప్రమాణ వినిర్మితమ్ ౦౪౩
హస్త పాద ప్రచారస్తు ద్వికలః పరికీర్తితః
చతురశ్రే పరిక్రాంతే పాతాః స్యుః షోడశైవతు ౧౪౪
త్ర్యశ్రే ద్వాదశ పాతాస్తు భవంతి కరపాదయోః
ఏతత్ప్రమాణం విజ్ఞేయ ముభయోః పూర్వరఙ్గయోః ౧౪౫

వాద్యము, గతి ప్రచారము, ధ్రువా, తాళము అను వానిని త్ర్యశ్ర పూర్వ రంగమున సంక్షిప్తముగా ప్రయోగించవలెను వాద్య గీతములు తీసికొని కాల

పరిమితి ననుసరించి అంగవిన్యాసము నొనర్పవలెను. ద్వికళా పరిమాణముతో వీటి అన్నిటి విస్తీర్ణము సంక్షేపించబడును. హస్త పాద ప్రచారము రెండు కళలలో పూర్తి కావలెను పరావర్తన క్రియలో చతురశ్రమందు కరపాదముల పతనములు పదునారుండగా, త్ర్యశ్రమందు పన్నెండు మాత్రమేగలవు. ఈప్రమాణమున నీ రెంటికిగల భేదమును మరచిపోరాదు,

కేవలంపరి వర్తేతు గమనేత్రి పదేభవేత్
దిగ్వందనే పఞ్చపదే చతురశ్రే విధే యతే ౧౪౬
ఆచార్య బుద్ధ్యా కర్తవ్యత్ర్య శ్రసజ్ఞైః ప్రమాణతః
తస్మాన్న లక్షణం ప్రోక్తంపునరుక్తం భవేద్యతః ౧౪౭

దిగ్వందనమును చేయువేళ చతురశ్ర పూర్వ రంగమున ఐదడుగులను వేయవలెను. కాని త్ర్యశ్రిమును మూడడుగులే విధించబడినవి. గురుముఖమున చతురశ్రమునకు త్ర్యశ్రమునకు గల భేదమును తెలిసికొని పైన చెప్పబడిన విధుల నన్నిటిని సక్రమముగా ప్రయోగించవలెను. ఈ రెంటియందును క్రమము, విధులు ఒకే రీతిగా నుండుటచే, పునరుక్తిని నివారించుటకై మరల లక్షణము నిచట చెప్పుట లేదని గ్రహించవలెను.

ఏవ మేష ప్రయోక్తవ్యః పూర్వరఙ్గో ద్విజోత్తమాః
త్ర్యశ్రిశ్చ చతురశ్రశ్చ శుద్ధో భారత్యుపాశ్రయః ౧౪౮
ఏవం తావ దయం శుద్ధః పూర్వరఙ్గో మయోదితః
చిత్రత్వమస్య వక్ష్యామి యథా కార్యం ప్రయోక్తృభిః ౧౪౯

భారతీ వృత్తికి అంగములుగా నున్న నాలుగు విధముల పూర్వ రంగములలో చతురశ్ర, త్ర్యశ్ర, శుద్ధములను పైన చెప్పబడిన రీతిగా ప్రయోగించవలెను. ఇక చిత్ర పూర్వ రంగ లక్షణము చెప్పబడుచున్నది

ఈ నాల్గింటిలోను విశిష్టమైనది చిత్ర పూర్వరంగము ఈ చిత్ర పూర్వ రంగమున నాల్గవ అధ్యాయమున చెప్పబడిన కరణాంగహారములు వినియోగింపబడుచున్నవి. అంగహారములతో సమన్వితమై శుష్కావకృష్ట మొదలుగాగల ప్రరోచనాంతప్రక్రియ ప్రయోగింపబడవలసి యున్నది. అందువలననే నీ చిత్ర పూర్వరంగము నాట్యమునకు శ్రేష్ఠమైన దగుచున్నది

వృత్తే హ్యుత్థాపనే విప్రాః కృతేచ పరివర్తనే
చతుర్థకారదత్తాభిః సుమనోభిరలఙ్కృతే ౧౫౦
ఉదాత్తగానై ర్గంధర్వైః పరిగీతే ప్రమాణతః
దేవదుందుభయశ్చైవ నినదేయు ర్భృశం తతః ౧౫౧

ఉత్థాపనీ ధ్రువతో ప్రయోగమైన తర్వాత, పరివర్తన జరుగగా, నాల్గవ నటుడువచ్చి చక్కని పూవులతో రంగము నలంకరింప జేయును అప్పుడు గాయ

కులు ఉదాత్త గానములను తాళలయాన్వితములుగా నాలాపించ, మాటిమాటికి దేవదుందుభులు మోగగలవు.

సిద్ధాః కుసుమమాలాభి ర్వికిరేయుః సమంతతః
అఙ్గహారైశ్చ దేవ్యస్తా ఉపనృత్యేయు రగ్రతః ౧౫౨
య స్తాండవ విధిః ప్రోక్తో నృత్తే పిండీ సమన్వితః
రేచకై రంగహారైశ్చ న్యాసోపన్యాస సంయుతః ౧౫౩
నాందీ పదానాం మధ్యేతు ఏకైకస్మిన్ పృథక్పృథక్
ప్రయోక్తవ్యో బుధైః సమ్య క్చిత్ర భావ మభీప్సుభిః ౧౫౪

దివ్య స్త్రీ పురుషులు పూల మాలలను వెదజల్లుచు, అంగ హారములను ప్రయోగించుచు రంగస్థలమున అగ్రభాగమున నృత్యము చేయుదురు రేచకాంగ హారములతో, న్యాసోపన్యాసములతో కలసి యున్న యే ఆకృతి విశేషములు తాండవ విధిలో చెప్పబడినవో వాటి నన్నిటిని నాందీ పదముల మధ్య ఒక దాని తర్వాత నొకదానిని చక్కగా ప్రయోగించవలెను. అప్పుడు చిత్ర పూర్వ రంగము సిద్ధించగలదు.

ఏవంకృత్వా యథాన్యాయం శుద్ధం చిత్రం ప్రయత్నతః
తతఃపరం ప్రయుఞ్జీత నాటకం లక్షణాన్వితమ్. ౧౫౫
తత స్త్వంతర్హితాః సర్వా భవేయు ర్దివ్యయోషితః
నిష్క్రాంతాసుచ సర్వాసు నర్తకీషు తతః పరమ్ ౧౫౬
పూర్వఙ్గే ప్రయోక్తవ్య మఙ్గజాత మతఃపరమ్
ఏవం శుద్ధో భవే చ్చిత్రః పూర్వరఙ్గో విధానతః ౧౫౭

ఈ ప్రకారము శాస్త్ర మర్యాద ననుసరించి శుద్ధ చిత్ర, పూర్వ రంగములు ప్రయోగింపబడిన తర్వాత లక్షణాన్వితమైన నాటకమును ప్రదర్శించవలెను, అంగ హారాదులతో వ్యామిశ్రితముగాని పూర్వరంగమును శుద్ధ మందురు.

దివ్య స్త్రీ లందరు తర్వాత నంతర్హితులు కావలెను రంగము నుండి నర్తకు రాండ్రు నిష్క్రమించన తర్వాత పూర్వరంగమున అంగములనన్నిటిని ప్రయోగించగా చిత్ర పూర్వ రంగము బూర్తి కాగలదు.

కార్యో నాతిప్రసఙ్గోఽత్ర నృత్తగీత విధింప్రతి
గీతవాద్యేచ నృత్తేచ ప్రవృత్తేఽతి ప్రసఙ్గతః ౧౫౮
ఖేదో భవేత్ ప్రయోక్తౄణాం ప్రేక్షకాణాం తథైవచ
ఖిన్నానాం రసభావేషు స్పష్టతా నోపజాయతే ౧౫౯
తతః శేషప్రయోగస్తు న రాగ జనకో భవత్.

నృత్త గీత విధిలో ఒకే ఒక అంగహారమునే బ్రయోగించవలెను. కాగా ఉత్థాపనము పరివర్తనము, అవకృష్టా గానము, నాందీపారము, శుష్కావకృష్టా, జర్జర శ్లోకము, ధ్రువా, రంగద్వారము, అడ్డితా. ఆర్యాశ్లోకము, ధ్రువా, రౌద్రశ్లోక

పరనము, నర్కుటకము, త్రిగతము, ప్రరోచన అను పదునేనింటితో నీ అంగహారమును కలుపగా పదునారంగహారములు చతురశ్ర పూర్వరంగమున, త్ర్యశ్ర పూర్వరంగమున కూడ రాగలవు. నాందీశ్లోకమున పఠించుచో నృత్తము విధింపబడినది ఇంతకు మించిన అంగహారములు నృత్తమునగాని, గీతమునగాని వాద్యవిషయమునగాని ప్రయోగించిన ప్రేక్షకులకు, నటీనటులకు ఖేదము వాటిల్లగలదు, నటవ్యాపారము పూర్వరంగమున స్ఫుటముగానుండి, సంశయరహితము గావలెనని ఇంతకు మించిన ప్రయోగవైచిత్ర్యము కూడదు. నటులు, సామాజికులు కూడ విసుపు చెందిరేని, రసభావము అస్పష్టములై రసప్రతీతికి వ్యాఘాతము కల్గును. దీనితో శేషించిన నాట్యప్రయోగము ప్రీతిని కల్గించ జాలదు ప్రీతిని కల్గించనిది వ్యుత్పత్తి ప్రదము కూడ కాలేదు.

త్ర్యశ్రం వా చతురశ్రం వా శుద్ధం చిత్ర మథాపి వా
ప్రయుజ్య రఙ్గా న్నిష్క్రామే త్సూత్రధారః సహానుగః ౧౬౦

నాట్యము లోకవ్యవహారమును, శాస్త్ర విధిని అనుసరించియుండుటచే తద్భిన్న క్రమము నవలంబించలేదు త్ర్యశ్రము, చతురశ్రము, శుద్ధము, చిత్రము అను పూర్వరంగములలో నొకదానిని ప్రయోగించి పారిపార్శ్వకులతో గలసి సూత్రధారుడు రంగస్థలమునుంచి నిష్క్రమించవలెను.

ప్రయుజ్య విధినైవం తు పూర్వరఙ్గం ప్రయోగతః
స్థాపకః ప్రవిశేత్తత్ర సూత్రధార గుణాకృతిః ౧౬౧
స్థానం తు వైష్ణవం కృత్వా సౌష్ఠవాఙ్గ పురస్కృతమ్
ప్రవిశ్య రఙ్గం తైరేవ సూత్రధారపదై ర్వ్రజేత్. ౧౬౨

నాట్యప్రయోగవశమున విధిపూర్వకముగా పూర్వరంగమైన తర్వాత స్థాపకుడు ప్రవేశించవలెను. సకల రూపకవృత్తిని స్థాపింపజేయువాడు స్థాపకుడు. సౌమనస్యము, విస్మయము, అద్భుతదృష్టి, ఆకృతివిశేషము అను సూత్రధారుని గుణములు మాత్రమే స్థాపకునకుండును. ఈస్థాపకుడే సూత్రధారుడు. వెనుక చెప్పబడిన వైష్ణవ స్థానకమును చక్కని అవయవ సన్నివేశముతో ప్రయోగించుచు రంగమును ప్రవేశించి, సూత్రధారగమనమునకు చెప్పిన పదలక్షణములతో నేగవలెను.

స్థాపకస్య ప్రవేశే తు కర్తవ్యా ర్థానుగా ధ్రువా
త్ర్యశ్రా వా చతురశ్రా వా తజ్జై ర్మధ్యలయాన్వితా ౧౬౩

కుర్యా దనంతరం చారీం దేవబ్రాహ్మణ శంసినీమ్
సువాక్యమధురైః శ్లోకై ర్నానా భావ రసాన్వితైః ౧౬౪

ప్రసాద్య రఙ్గం విధివ త్కవే ర్నామచ కీర్తయేత్. ౧౬౫

స్థాపకుడు ప్రవేశించి త్ర్యశ్రపూర్వరంగమునకుగాని చతురశ్రపూర్వరంగమునకుగాని సంబంధించియుండి అర్థవంతమైన ఉత్థాపనాది ధ్రువాగానమును మధ్య

లయలో నొనర్చవలెను. దేవబ్రాహ్మణులను ప్రశంసించుచారీని తర్వాత ప్రయోగించవలెను. చక్కని వాక్యములతో మధురములైన శ్లోకములను వివిధ రసభావములతోను విధియుతముగా రంగము నలంకరించి, సభాసదుల అనుగ్రహమునకు మన్ననయగునట్లు చేసికొని, కవియొక్క నామసంకీర్తనము చేయవలెను

మధ్యలయలోగాని విలంబితలయలోగాని ద్రుతచక్రలయలోగాని ప్రయోగించిననే సముచితమైన రసాస్వాదనకు యోగ్యములగు సామాజిక హృదయములు సంస్కరింపబడగలవు. చారీప్రయోగముతో బాటు మహాచారీ ప్రయోగము కూడ కలదు గావున నిచట పఠించవలసిన శ్లోకము శృంగార వీర రసములలో నుండవలెను.

ప్రస్తావనాం తతః కుర్యాత్ కావ్యప్రఖ్యాపనాశ్రయామ్
ఉద్ఘాతకాదికర్తవ్యం కావ్యోపక్షేపణాశ్రయమ్ ౧౬౬

ప్రయోగించబడు రూపక విశేషమును వెలువరించు ప్రస్తావనను 'తర్వాత ప్రయోగించవలెను కావ్యవస్తువు నాశ్రయించుకొని, దానిని సూచించు ఉద్ఘాతకాదిమును చేయవలెను తద్ద్వార మొదటినుంచి సంక్షేపముగానైనను సామాజికులు సంస్కారము కలిగిన వారగుదురు

దివ్యే దివ్యాశ్రయో భూత్వా మానుషే మానుషాశ్రయః
దివ్యమానుష సంయోగే దివ్యోవా మానుషోఽపివా ౧౬౭
ముఖబీజా నుసదృశం నానామార్గ సమాశ్రయమ్
నానావిధై రుపక్షేపైః కావ్యోపక్షేపణం భవేత్ ౧౬౮

కావ్యార్థము దేవతా విషయకమైన తత్సదృశముగను, మానవ విషయకమైన మానవాశ్రయముగను, దివ్యమానవుడగు రామాది విషయమైన తదాశ్రియముగను కావ్యార్థమును సూచించవలెను కావ్యమందలి అర్థము ముఖ సంధికి అంగమగు బీజమనబడు అర్థప్రకృతిలో సూచింపబడుచున్నను, కావ్యార్థము నిచట స్వల్పముగా సంక్షిప్త రూపమున చెప్పవలెను. నానామార్గ సమాశ్రయమై, నానావిధములగు ఉపక్షేపములతో కావ్యార్థము సూచితమగును.

నటీ, విదూషక, పారిపార్శ్వకులు స్వకార్యమును నిరూపించు మిషతో వివిధ విధములుగా రూపకార్థమును సూచించుచు, సామాజికుల హృదయములను నావశము చేసికొనవలెను

ప్రస్తావ్యైవంతు నిష్క్రామేత్ కావ్యప్రస్తావక స్తతః
ఏవ మేష ప్రయోక్తవ్యః పూర్వరఙ్గో యథావిధి ౧౬౯

ఈరీతిగా కావ్యవస్తువును ప్రస్తావించి స్థాపకప్రస్తావకులు నిష్క్రమించవలెను. పూర్వరంగము నిట్లు విధిప్రకారము ప్రయోగించవలెను,

ప్రస్తావనలు రెండురకములు. పూర్వరంగమున కంగమైనది ఒకటి. దీనికి భిన్నమైనది రెండవది పూర్వరంగమున కంగమైన ప్రస్తావనలో కవి ఉదాసీనుడగును. స్థాపకుడు గాని, ధ్రువ గానములను వ్రాసిన కవిగాని స్వతంత్రముగా దీని నిర్మాతలగుదురు.

తత్త్వశాస్త్ర జ్ఞానము - దాని పరిమితులు

బెర్ట్రాండ్ రసెల్

అనువాదం జి. ఎస్. ఎస్.

౧౪

తత్త్వశాస్త్రమునకు సంబంధించి మనమిచ్చట పరికను చెప్పిన సర్వవిషయములోను. అనేక తత్త్వ చింతకుల రచనలలో నధికభాగమాక్రమించిన యనేకవిషయములను మనముస్పృశింపనైననులేదు ఏమైనను అనేకతత్త్వచింతకులు పూర్వసిద్ధమగు తాత్త్వికహేతుపద్ధతిచే మతమునకు సంబంధించిన మూలసూత్రములు ప్రపంచ హేతుబద్ధత - ద్రవ్యమిథ్యాత్వము మొదలగు మహా విషయములను నిరూపింపగల్గుదుమని చెప్పుచున్నారు ఇట్టివారిని విశ్వసించుటకనువగు హేతువులను పరిశోధింప వలయునను నాశయే జీవితాంతము వఱకును తత్త్వచింతనలో కాలమును వెడలబుచ్చిన యనేక జిజ్ఞాసువుల యాశయము. కాని యీయాస యడియాసయని నావిశ్వాసము మొత్తముమీద ప్రపంచమంతటిని గూర్చినజ్ఞానము తత్త్వశాస్త్రము వలనలభించునది కాదనియనిపించును. అంతియకాక ఇది యగును, ఇదికాదు అని నిర్ణయించుటకు వారు ప్రసాదించిన హేతువులు, హేతుశాస్త్ర సిద్ధాంతముల దృష్ట్యా, పరిశీలనకు నిలుచునవి కావని యనిపించును ఈ, యధ్యాయమున నట్టిహేతువుల నుపపాదించుట కవలంబించు మార్గమును. ఆహేతు పద్ధతి సఫలముగునను నాశతోనే. సంగ్రహముగా, పరామర్శింతము

మనము పరామర్శింప దలచుకొన్న యభిప్రాయమునకు ప్రతినిధి హెగెల్ అనుఆధునిక తత్త్వచింతకుడు హెగెల్ తాత్త్విక విషయ విచారణ చాలక్లిష్టమైనది దానినిగూర్చి వ్యాఖ్యాతలు వేర్వేఱు విధములుగా వివరణములను వెలువఱచిరి నేనువివరించు వ్యాఖ్యానము ప్రకారము- అసంపూర్ణమైన దెల్లను ఆంశికమేయని యును, మిగిలిన ప్రపంచము సమకూర్చిన పూరకము లేనిదే నాయసంపూర్ణమైనదే స్వతంత్రముగా నిలుచుటకు వీలులేదని యాయన (హెగెల్) వాదము తులనాత్మకముగ శరీర తత్త్వమును పర్యాలోచనము సేయు శాస్త్రవేత్త ఒక్కఎముక నాధారముగా నది యేజంతువో నిర్ణయింపగల్గునట్లు, సత్యమునకు సంబంధించిన ఒక యేకదేశమును బట్టి- సంపూర్ణసత్యమును- స్థూలముగ నిట్లుండునని తత్త్వచింతకుడు నిర్ణయింపగల్గును ప్రపంచ మంతటికిని సంబంధించిన సత్యమొక గొలుసువంటిది. విడివిడిగానున్న సత్యైకదేశము లనబడు శృంఖలాఖండములు పరస్పరమును కలసి సమగ్ర సత్యముగా వ్యక్తమగును. ప్రధానమగునీయ సంపూర్ణత- (హెగెల్ వాదమునను సరించి) భావమయ ప్రపంచమునందును, ద్రవ్యమయమగు వస్తు ప్రపంచమునందును గోచరించును. భావమయ ప్రపంచమున, మనమొక యసంపూర్ణమగు భావమును దీసికొన్నచో, దాని యసంపూర్ణతను మరచి పోయినచో, మన మనేక పరస్పరవైరుద్ధ్యములకు లోనగుదుమని, కొంతపరిశీలన చేసిన మీదట మనము తెలిసి కొనగలము ఈ పరస్పరవైరుధ్యమే ఆ భావమును ప్రతియోగిగా మార్చును. ఈ వైరుద్ధ్యమును తప్పించుకొనుటకు, మొదటి భావమును, దాని ప్రతి యోగిని సమన్వయ పరచు తక్కువ యసంపూర్ణమైన భావమును మనమన్వేషింప వలయును. ఆదిలో బయలుదేరిన భావముకన్న నీక్రొత్తభావము తక్కువ యసంపూర్ణమైనను, దీనికి గూడ సంపూర్ణత యలవడినట్లు లెక్కగాదు సంపూర్ణమగు భావ

ము గోచరించునంత వఱకు నీయన్వేషణ సాగుచునే యుండును. ఈసంపూర్ణభావమునకు ప్రతియోగిగాని అసమగ్రతగాని లేదు. కావున నీ సంపూర్ణ భావమే సమగ్రమగు సత్యమును వర్ణింప సమర్థమైయుండును. కాని తక్కువ స్థాయిలోనున్న భావములన్నియును, సత్యమును పాక్షికదృక్పథమునకు కన్పించు రీతిగనే వర్ణించును కాని అంతను ఏకకాలమున పర్యవేక్షింపగల్గువానికి కన్పించు రీతిగ సత్యమును వర్ణింపవు. కావున హెగెల్, పరిపూర్ణసత్యము సంపూర్ణముగా హేతుబద్ధమును, నాధ్యాత్మికమునునైన, సమన్వయాత్మక మగు వ్యవస్థగా రూపొందునను విషయమును తేల్చిచెప్పెను ఈవ్యవస్థ ఒకప్రత్యేక దేశగతముగాని కాలగతము కాని కాదు మనమెరిగిన ప్రపంచములో నందులకు విరుద్ధముగ కాన్పించుటకు గల కారణము ప్రపంచమును మనము ఖండశః గ్రహింపగల్గుట వలన యని తార్కికముగా నిరూపించ వచ్చునని యాతని విశ్వాసము మనము ప్రపంచమును సమగ్రముగా చూచినచో (భగవంతునికట్టి శక్తి గలదని మనము నిస్సందేహముగా ననుకొనవచ్చును.) నందలి దేశకాలములు, ద్రవ్యము, సంఘర్షణము, చెడుగుసర్వమును మటుమాయమగును మనకు లోపరహితము, నిత్యమును నగు నాధ్యాత్మికైక్యము గోచరమగును

ఇట్టి భావనలో, నత్యుదాత్తమైనది, మనము నంగీకరింప వలెనని యనిపించునదేదో యొకటి గలదు. కాని దానిని (అట్టిభావనను) సమర్థించుటకు ప్రతిపాదించిన యుపపత్తులను జాగ్రత్తగా పరిశీలించినపుడు, అందుకో ఎక్కువ తికమకయును, నిరూపింప రానియనేక యభ్యుపగమములును నిమిడి యుండును ఈభావ వ్యవస్థ ఒకమూల ఘాతమగు సూత్రముపై నిర్మితమైనది ఆసూత్రమిది. సంపూర్ణము కాని దేదియైనను, తనకు తానై నిలువబడుటకు వీలు లేదు దానికి అస్తిత్వమేర్పడుటకు ముందు. ఇతరవస్తువుల యాధారమావశ్యకము బయటనున్న వస్తువులతో సంబంధము గలిగియున్నదేనియుండైనను, దాని స్వలక్షణమునకు (Nature) ననుగుణమైన బాహ్య వస్తువులను గూర్చిన ప్రశంస యుండవలెను ఈబాహ్య వస్తువులే లేనిచో నది స్వస్వరూపమున నుండుటకువీలులేదు. ఉదాహరణకు, మానవస్వభావము ఆతనిస్మృతులతోను, తక్కిన జ్ఞానవిశేషముతోను, రాగద్వేష రూపములతో నున్న మానసిక సంస్కారములతోను గూడుకొనియున్నది. అతనికి జ్ఞానవిషయములైన, రాగద్వేషాదులకు విషయములైన వస్తువులే లేనిచో, అతడిప్పటి తీరున నుండకనే పోయెడివాడు. ప్రధానముగా మానవుడొక యేకదేశము. మొత్తము మీద చూచినచో నతనినిగూర్చి స్వవచో వ్యాఘాతములు బయలుదేరును.

ఈదృక్పథమంతయు, వస్తుస్వరూపమునకు సంబంధించిన నిర్వచనముపై నిర్మింప బడుచున్నది వస్తువు స్వరూపమనగానేమి? వస్తువు స్వరూపమనగా నావస్తువును గూర్చి మనకు నవగతమగు సర్వయథార్థ విషయములు అని చెప్పవచ్చును ఒకవస్తువు వేఱొక వస్తువుతో ననుసంధించు సత్యమా యితర వస్తువు లేనిచో నుండుటకు వీలులేదనుటకద్దు ఒక వస్తువునకు సంబంధించిన సత్యమసలా వస్తువులో భాగముకాదు కానిపై యుపపత్తి ననుసరించి వస్తుసంబంధి యగు సత్యము వస్తుస్వభావములో భాగమై యుండవలెను ఒక వస్తువు స్వభావమనగా, నావస్తువును గూర్చి తెలియనగు సర్వసత్యములును అని మనము వ్యాఖ్యానించుచో ప్రపంచములోని సర్వవస్తువులతో నావస్తువునకు గల సంబంధమును మనము ఎరుగక పోయినచో నసలు వస్తుస్వభావమును గూర్చి మనకు తెలియనేరదు. కాని స్వభావమును పదము నీయర్థములో ప్రయోగించినచో, దానిస్వభావము అవగతము కానప్పుడు గాని లేక పూర్తిగా నవగతము కానప్పుడు గాని వస్తుస్వభావము మనకు జ్ఞాతము కావచ్చునని మనము చెప్పవలసి యుండును

వస్తుజ్ఞానమునకును, సత్యజ్ఞానమునకును గల భేదమువృష్ట్యా చూచి నపుడే స్వభావమను పదమును వ్యవహరించుటలోగల తికమక మనకర్థమగును. ఒకవస్తువును గూర్చి యెన్ని తక్కువ విషయములు మనకు దెలిసినను అనుభవముచే దానిని గూర్చిన జ్ఞానమును మనము సంపాదింప వచ్చును. సిద్ధాంత విషయముగ జూచిననో, దానిని గూర్చి యొక్క విషయము గుండ నెఱుక పడక పోవచ్చును. కావున ఒక వస్తువును గూర్చి కల్గిన ప్రత్యక్షానుభవజన్య జ్ఞానములో దానిస్వభావమును గూర్చిన జ్ఞానము ఇమిడి యుండదు. ఒకవస్తువును గూర్చిన ప్రత్యక్షానుభవ జన్యజ్ఞానములో ఆవస్తువును గూర్చి యేదోయొక విషయము తెలిసికొనుట ఇమిడి యున్నను, పైయర్థములో. దానిస్వభావమునుగూర్చిన జ్ఞానమిమిడియుండదు కావున ఒక వస్తువును గూర్చి గల్గిన ప్రత్యక్షానుభవము లో దాని సంబంధములను గూర్చిన జ్ఞానము ఇమిడి యుండదు. దాని సంబంధములలో కొన్నింటిని గూర్చి గల్గు జ్ఞానములో, దాని సంబంధము లన్నింటిని గూర్చిన జ్ఞానము గాని పైయర్థములో దాని స్వభావమునకు సంబంధించిన జ్ఞానము గాని ఇమిడి యుండదు ఉదాహరణకు, నాపంటిపోటును గూర్చిన అనుభవ సిద్ధకమగు జ్ఞానము, గలిగినదనుకొందము ప్రత్యక్షానుభవము వలన కలుగవలసిన జ్ఞానమంతయును కలుగుటచేత నీజ్ఞానము సంపూర్ణమైనదనియే చెప్పవచ్చును కాని అంత ఆ పంటిపోటుకు గల కారణమును గూర్చి దంతవైద్యుడు చెప్పగలిగినదంతయు నాకవగత మైనట్లుకాదు అనగా పైన వాడినయర్థములో దానిస్వభావము మనకెఱుక పడనట్లే కావున నొక వస్తువునకు సంబంధము లున్నవన్నంత మాత్రమున, నాసంబంధములు తార్కికముగా నావశ్యకములని యంగీకరింపవలసిన యవసరములేదు అది యథాతథముగా వస్తువేయన్న విషయము ననుసరించి దానికనేక సంబంధము లున్నవన మనము తేల్చిచెప్పలేము. (కాని వాస్తవముకాని వస్తువున కట్టి సంబంధము లున్నవి) ఇదియే తుదకు తేలిన విషయముగా గన్పట్టుచున్నది. ఏలన మనము దానిని ఇది వరకే ఎరుగుదుము

దీనినిబట్టి హెగెల్ విశ్వసించునట్లే ప్రపంచ మంతయును ఒక సమన్వయాత్మకమగు వ్యవస్థగా నేర్పడు చున్నదని మనమునిరూపింప జాలము.

దీనిని మనము నిరూపింపలేక పోయినచో దేశము, కాలము, ద్రవ్యము, చెడుగు మొదలగువాని, యథార్థతను నిరూపింపలేము. ఏలన వీనియొక్క ఖండత్వమును బట్టి యీ విషయము హెగెల్ తేల్చినాడు. కాబట్టి మనకు నీ ప్రపంచమునుగూర్చి ఖండజ్ఞానమే కలుగును. మన యనుభవమునకు వెలిగా నున్న ప్రపంచములో వేర్వేరు భాగము లెట్లుండునో మనము తెలిసికొనలేము.

ఈ ఫలితము చాలామంది జిజ్ఞాసువుల కాశాభంగమును కలిగించును. అయినను, మన కాలమునకు ప్రత్యేక లక్షణమైన వైజ్ఞానిక ప్రవృత్తికి నిది సరిపడును వెనుకటి యధ్యాయములలో మనము మానవ విజ్ఞానమునుగూర్చి చేసిన సమీక్ష గూడ నీ విషయమునే సమర్థించును. తత్త్వశాస్త్రజ్ఞుల మహాప్రయత్నములలో ననేకములు - యథార్థ ప్రపంచమునకు సంబంధించిన స్థూల లక్షణములు పరస్పర నిరుద్ధముగ నున్నవనియు, నందుచే నవి యథార్థములని నిరూపించు యత్నములో కొనసాగినవి ఆధునిక సమాలోచనా ప్రవృత్తి మాత్రమా స్వవచోవ్యాఘాతములు భ్రమమూలకములనియునూ, భవితవ్యమైన దానిని గూర్చిన సమాలోచనలను బట్టి పూర్వసిద్ధమైనదిగ నిరూపింపదగినది చాల కొలది యనియును నిర్ణయించు స్థితికి చాలవఱకు వచ్చినది. దీనికి దేశకాలములే సరియైన నిదర్శనమును సమకూర్చును. దేశకాలము లనంతముగా విభాజ్యములన్నట్లు కనిపించును. వ్యాపనములో గూడ నవియనంతమేమో యనిపించును. ఒక సరళరేఖ వెంబడి వెనుకకో ముందునకో పయనించుచో ఏమియు

అంతియకాక, ఒకసరళరేఖలో రెండు బిందువులను తీసికొన్నచో, వానినడుమ నితర బిందువులుగూడ నుండవలయుననుట పూర్తిగా స్పష్టమైనట్లు కన్పించును. రెండుబిందువుల మధ్యదూరమెంత యల్పమైనను, ఆ బిందువుల నడుమగల ప్రతివ్యవహిత ప్రదేశమును ద్విధాకరించుటకు వీలుగలదు. ఆసగమును తిరిగి సగము చేయవచ్చును ఇట్లెంతవరకైనను బోవచ్చును. అట్లే కాలము విషయములో జూచినచో, రెండు క్షణములమధ్య ఎంత యల్పకాలము గడచినను, వానిమధ్య నితరక్షణములుగూడ నుండుననుట స్పష్టమనిపించును. కావున దేశకాలములు నిరవధికముగా విభాజ్యము లన్నట్లు కన్పించును. ఇందుకు విరుద్ధముగా కొందరు తత్త్వశాస్త్రజ్ఞులు వస్తువుల సమూహములనంతముగా నుండుటకు వీలు లేదని- దేశకాలగతములగు బిందువుల సంఖ్య సావధికమేయని సోపపత్తికముగా నిరూపించిరి. కావున దేశకాలములకు సంబంధించి పైకి కన్పించు స్వభావమునకును, అనంతములగు వస్తుజాతములను గూర్చి తత్త్వశాస్త్రజ్ఞులు చెప్పిన యసంభవతకును నడుమగలవిరోధము బయల్పడెను ఈస్వవచోవ్యాఘాతమును ఆదిలోగుఱుతించిన కాంట్ దేశకాలముల కస్తిత్వము లేదనియును, నవి వ్యక్తియూహాజన్యములనియును తేల్చివైచెను. అప్పటినుండియు, ననేకతత్త్వశాస్త్రజ్ఞులు, దేశకాలములు కేవలమును పైకికన్పించునవేగాని, యథాతథముగానున్న ప్రపంచమునకు జెందిన లక్షణముకాదనిచెప్పిరి ఏదిఏట్లున్నను, జార్జికాంటర్ వంటి గణితశాస్త్రజ్ఞుల కృషిమూలముగా అనంతములైన వస్తుజాతముల యునికియ సంభవమన్న విషయములో నిజములేదని ప్రస్తుతము రూఢియైనది ఆవస్తుజాతకములు పరస్పరవిరుద్ధములుకావు కాని కొన్నిమానసికములగు దురభిప్రాయముల నవి విరుద్ధములే కావున దేశకాలముల నయథార్థములని భావించుటకుగల హేతువులలో నిజములేదు. దీనిని బట్టితత్త్వశాస్త్రజ్ఞుల కల్పనలకు ముఖ్యాధారములలో నొకటి యెంతిపోయినట్లే యనుకొనవచ్చును

కేవలము సాధారణముగా భావింపబడిన తీరున దేశము సుసాధ్యమని నిరూపించుటతోను గణితశాస్త్రజ్ఞులుతృప్తిపడలేదు. తర్కము నిరూపింప గల్గినంతవఱకు, దేశకాలములకు సంబంధించిన తదితర రూపములు గూడ సాధ్యములేయనిగూడ వారు నిరూపించిరి లోకజ్ఞానము దృష్టిలోను, ఒకప్పుడు తత్త్వశాస్త్రజ్ఞుల దృష్టిలోను నావశ్యకములుగా భావింపబడిన యూక్లీడ్ స్వతస్సిద్ధసత్యములలో (Axioms) కొన్ని యథార్థమగు దేశముతో నేర్పడిన పరిచయవిశేషమును బట్టి యావశ్యకతను యేర్పడినట్లు ప్రస్తుతము తెలియవచ్చుచున్నది కానివానికి పూర్వసిద్ధమైన తార్కికాధారమేమియును గోచరించుటలేదు ఈస్వతస్సిద్ధసత్యములు యథార్థములు కాదగిన ప్రపంచములను కొన్నింటినూహించి, గణితశాస్త్రవేత్తలు లోకజ్ఞానమునగల దురభిప్రాయములను సడలింపజేయుటకును మనము నివసించుటకు కారణభూతమైన దేశమునకు పూర్తిగా విభిన్నములగు ననేకదేశములుగూడ నుండుటకు గల యవకాశమును నిరూపించుటకును హేతుశాస్త్రము నూతగానొసగిరి. ఈదేశములలో కొన్నింటికిని, యూక్లిడ్ ఊహించిన దేశమునకును చాలస్వల్పమగు భేదముగలదు మనము కొలుచుటకు వీలైన దేశములకు సంబంధించినంతవఱకు, కేవలము పరిశీలనమునుబట్టి మన మనుభవమునకు అందుబాటులోనున్న వాస్తవమగుదేశము యూక్లిడ్దా, లేక తదితరప్రదేశములలో నొక్కటాయని పరిశోధింప వలనుపడదు. కావున పరిస్థితి తలక్రిందైనది. పూర్వమనుభవము హేతుశాస్త్రమున కొకేరకమైన దేశమును అందించినది. అప్పుడు హేతుశాస్త్రమది యసంభవమని నిరూపించినది ప్రస్తుతము హేతుశాస్త్రము అనుభవసిద్ధమైన దేశమునేకాక యనేకరకముల దేశములను సమకూర్చి

పెట్టుచున్నది.

అనుభవము వానివిషయమై కొంతవఱకే నిర్ణయించును కావున పూర్వమనుకొన్న దానికంటె ఇప్పుడున్న జ్ఞానముతక్కువైనను, భవిష్యత్తులో మనజ్ఞానము అపరిమితముగా విస్తరించు నవకాశములు గలవు. మారుమూలలగూడ పరిశోధన చేయుటకు వీలైన ఇఱుకుగోడలలో మ్రగ్గుటకు బదులు, స్వేచ్ఛావకాశములనేకములుగల బాహ్యప్రపంచముననే ఇక మనసంచారముసాగును ఇందుతెలియని సంగతియెంతయోకలదు ఏలనతెలిసికొనవలసిన దెంతయోకలదు

దేశకాలముల విషయమున నెట్లుజరిగినదో, తదితరమార్గములలో కొంతవరకునట్లేజరిగినది. పూర్వసిద్ధములగు సిద్ధాంతముల దృష్ట్యా ఈ ప్రపంచమును గూర్చి నిర్ణయము చేయుప్రయత్నము విఫలమైనది పూర్వమువలె హేతుశాస్త్రము అనేకావకాశములకు నిరోధకమగుటకు బదులు, తత్వజిజ్ఞాసువుల యూహలకు రెక్కలను సమకూర్చినది

అంతియేకాక మనసహజముకాని లౌకికజ్ఞానమునకు అందుబాటులోలేని యసంఖ్యాకములగు మార్గాంతరములను ఆధునిక హేతుశాస్త్రము సమకూర్చుచున్నది. మననిర్ణయము నిమిత్తమై హేతువాదము సమకూర్చిపెట్టుననేకప్రపంచములనడుమ నిశ్చయము చేసికొనుట యను మహాకార్యమునది యనుభవమునకే వదలివైచుచున్నది కావున వర్తమానమగు జ్ఞానము మనమనుభవముచే తెలిసికొనగలిగిన జ్ఞానమునకు (మనమువాస్తవముగా ననుభవగోచరము చేసికొనగలిగిన దానికిగాదు) పరిమితమగుచున్నది ఏలన యిదివఱకు మనము గమనించినట్లు, మనకు ప్రత్యక్షానుభవములో లేని వస్తువులను గూర్చిగాని విషయములనుగూర్చిగాని పరోక్షముగా తెలియవచ్చు జ్ఞానము చాల గలదు. పరోక్షజ్ఞానము కలుగు సందర్భములన్నింటిలోను, ఒకానొక యాధారభూతమగు విషయమునుబట్టి వేఱొకవిషయము ననుమానప్రమాణముచే సాధించుట కుపకరణమై సామాన్యసంబంధముల ననుసంధానపరచునదేదో యొకటి యుండవలయును. ఉదాహరణకు భౌతికవస్తువుల విషయమున, ఇంద్రియార్థములు భౌతికవస్తువులకు సంబంధించిన చిహ్నములను సిద్ధాంతమే సామాన్యసంబంధములననుసంధానపరచునట్టిది కేవలము. ఈసిద్ధాంతదృష్ట్యా, భౌతి వస్తువులకు సంబంధించిన జ్ఞానమును అనుభవము మనకుసమకూర్చుచున్నది అదే కార్యకారణసిద్ధాంతమునకును (కొంతతక్కువ సాధారణమగు సిద్ధాంతమునకుదిగినచో) గురుత్వాకర్షణ సిద్ధాంతమునకన్వయించును

గురుత్వాకర్షణసిద్ధాంతము వంటివి వ్యాప్తిసాధకసిద్ధాంతమువంటి పూర్వసిద్ధమగు సిద్ధాంతముతో ననుభవమును జోడించుటచే నిరూపితములగుచున్నవి లేకచాలవఱకు సంభవములుగా భావింపబడుచున్నవి కావున సత్యములను గూర్చిన మనసర్వజ్ఞానమునకును నాధారమగు నలౌకిక ప్రత్యక్షజ్ఞానము రెండువిధములు మనకుప్రత్యక్షగోచరములగు వస్తువుల యునికిని గూర్చియు, వానిధర్మములలో కొన్నింటిని గూర్చియు మనకుతెలుపు కేవలానుభవ సిద్ధజ్ఞానము. సామాన్యముల నడుమ సంబంధమును సమకూర్చి, అనుభవసిద్ధజ్ఞానముచే సమర్పితములగు ప్రత్యేకవిషయములనుబట్టి యనుమానముచే విషయములను సాధించుటకు తోడ్పడునట్టి వైకారికమగు మనజ్ఞానము, ఎల్లప్పుడును ఏదో యొక పూర్వసిద్ధజ్ఞానముపై నాధారపడియుండును ఒక్కొక్కప్పుడు అనుభవసిద్ధజ్ఞానముపై గూడ ఆధారపడియుండును

పైనచెప్పినది యధార్థమేయగుచో, తత్త్వశాస్త్రమునకు సంబంధించిన జ్ఞానమునకును విజ్ఞానశాస్త్రమునకు సంబంధించిన జ్ఞానమునకును ఏమార్గమున భేదములేదు. తత్త్వశాస్త్రమునకుప్రత్యేకముగా నందుబాటులోనుండి, విజ్ఞానశాస్త్రమునకు దరిదాపులోలేని జ్ఞానాధారమేమియునులేదు తత్త్వశాస్త్రముతేల్చిన విషయములకును, విజ్ఞానశాస్త్రము తెలిపినవిషయ

ములకును, వస్తుతః భేదములేదు. కాని విమర్శకమనునదియే తత్త్వశాస్త్రము విజ్ఞాన శాస్త్రమునుండి వేఱుచేయును తత్త్వశాస్త్రము, విజ్ఞానశాస్త్రమునందును, దైనిక జీవితమునందును వినియోగింపబడు సిద్ధాంతములను సవిమర్శముగా పరీక్షించును. ఈసిద్ధాంతములలో నున్న యసందర్భముల నన్నిటిని మూలమూలల వెదకును

సహేతుకమగు పరిశీలనకు నిలిచి, హేతువాదము తిరస్కరించుటకు హేతువేమియును కన్పింపని సిద్ధాంతములనే తత్త్వశాస్త్రము అంగీకరించును అనేకతత్త్వశాస్త్రజ్ఞులు నమ్మినట్లు, విజ్ఞానశాస్త్రములకు నాధారభూతములగు సూత్రములు, సందర్భమునకు సరిపడని యప్రధాన విషయములనన్నింటిని త్రోసిపుచ్చి, ప్రపంచమునంతను గూర్చి సమగ్రమగు జ్ఞానమును ప్రసాదింప గలిగినచో నట్టి జ్ఞానము, మన విశ్వాసముపై, విజ్ఞాన శాస్త్రసిద్ధముగు విజ్ఞానము వలె-సమానప్రాభవము జూపగల్గును. కాని మనమింతవఱకును చేసిన పరిశీలన బట్టి యట్టి జ్ఞానమున్నట్లు మనకు తెలియవచ్చుటలేదు. అందుచే మహాసాహసమును ప్రదర్శించిన తత్త్వశాస్త్రజ్ఞుల ప్రత్యేకసిద్ధాంతములకు విలువ లేకుండబోయెను అందరును సాధారణమగు జ్ఞానముగా నంగీకరించిన దాని విషయమై చెప్పవలెనన్న, ఆవిషయమున మన కృషిఫలించినదనియే చెప్పవలయును అట్టి సర్వజనాంగీకృత జ్ఞానమును తిరస్కరించుటకు మనకు హేతువేమియును గోచరింపలేదు ఇది మనము చేసిన విమర్శమును బట్టియే తేలినది. ఇట్టిజానము మానవున కుండుటకు వీలులేదని యనుటకేమియును హేతువుకన్పించుటలేదు

ఏదియెట్లున్నను, తత్త్వశాస్త్రమనగా జ్ఞానవిమర్శయనిచెప్పినచో, దానివిషయమై యొకపరిమితిని విధించుట మంచిది, సంశయవాదివలె, సర్వవిజ్ఞానమునకును పూర్తిగా వెలిగానుండి, యీజ్ఞానపరిధిములోనే గుడుగుడు గుంజములాడవలయునని పట్టుబట్టినచో, ఫలితము శూన్యమేయగును. ఏలన ఒక విషయమును ఖండించుటకుగూడ మనతో వివాదము చేయువారికిని మనకును ప్రమాణముగా నంగీకరింపదగిన వానినాధారముగా గొనియే చర్చ ప్రారంభము కావలెను. ప్రతి విషయమును శంకించినచో, నేయుపపత్తికిని స్థానముండదు. కావున తత్త్వశాస్త్రము ప్రతిపాదించిన జ్ఞానవిమర్శనమునకు సత్ఫలితము రావలయునన్నచో-నదికుతర్కభూయిష్ఠమైయుండరాదు. ఇట్టి సర్వసంశయవాదముదృష్ట్యా, హేతుబద్ధమగునేవాదమును నిలువదు. కాని యిట్టిసర్వసంశయవాదము నిర్హేతుకమని గ్రహించుట కష్టముకాదు డెకార్టె అవలంబించిన వ్యవస్థాత్మకమగు సందేహము (Methodical doubt) (ఇదియే ఆధునిక తత్త్వశాస్త్రమునకుపునాది)-ఇట్టిదికాదు. మనము తత్త్వశాస్త్రసారముగా మనము ఘాటించుచున్న విమర్శనమిట్టిదియే. సందేహాస్పదముగా కన్పించిన సర్వవిషయమును సందేహించుటలోనే నీవ్యవస్థాత్మకమగు సందేహమిమిడియున్నది. తనకులభించిన ప్రతిజ్ఞానఖండమును హేతువాదపరీక్షకు నిలుచునా లేదాయని డెకార్టే కదల్చి చూచెను తనకు నిశ్చితముగా యథార్థముగా తెలిసిన దానినే విశ్వసించెను తత్త్వశాస్త్రమునకిట్టి విమర్శనమే యంగభూతమైయుండవలెను. మనయింద్రియార్థముల యునికిని గూర్చిన జ్ఞానము వంటిజ్ఞానము మనమెంత జాగ్రత్తగా ప్రశాంతముగా పర్యాలోచన చేసినను అసందిగ్ధమనియే యనిపించును. అట్టిజ్ఞానమును తత్త్వశాస్త్రము విశ్వసింపరానిది యనిచెప్పదు కాని భౌతికవస్తువులు అచ్చముగా మనయింద్రియార్థములనే పోలియుండునను విశ్వాసము వంటి విశ్వాసములు, మనము వాని విషయమై పర్యాలోచనము ప్రారంభింపగానే కరిగిపోవును. అట్టి విశ్వాసములను అంగీకరించుటకు వీలులేదని తత్త్వశాస్త్రము చెప్పును కానిమనమెంత జాగ్రత్తగా పరిశీలించినను అవరోధములు కన్పింపని విశ్వాసములను తిరస్కరించుటలో హేతువేమియునులేదు ఈవిషయమే తత్త్వశాస్త్రముఘాటించుచున్నది.

తత్త్వశాస్త్రమున నుద్దిష్టమైన విమర్శనము ప్రతి విషయమును, నిర్హేతుకముగా ఖండింప బూనుకొనునట్టిదికాదు. కాని పైకిజ్ఞానముగా కన్పించు సర్వవిషయమును నిష్పక్షపాతముగ పరామర్శించి, ఈపరామర్శ పూర్తియగు నప్పటికి శేషించిన దానినే జ్ఞానముగా స్థిరపరచును ఇందులోకొంత భ్రమప్రమాదములకు తావు లేకపోలేదు ఏలన అవి మానవసహజములు. అట్టివానిని సాధ్యమైనంత తగ్గింపవచ్చునని తత్త్వశాస్త్రము ప్రతిజ్ఞచేయవచ్చును కొన్ని కొన్ని సందర్భములలో నీ భ్రమప్రమాదము లుపేక్షింపదగినంత తక్కువగా నుండును భ్రమప్రమాచములు సాధారణముగా జరుగుచుండు ప్రపంచములో నింతకంటె నధికమును సాధింపగలుట దుష్కరము. తత్త్వశాస్త్రమును జాగ్రత్తగా పర్యాలోచనము చేసినయెవ్వడైనను నింతకంటె నధికముగా సాధించినట్లు చెప్పుకొనజాలడు.

శ్రీమదాంధ్ర వేదాంత పంచదశి

[చిత్రప్రదీప ప్రకరణము]

పండిత, శ్రీ జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి

౧౨

మేఘమును బోలునది మాయ, మేఘ మందు
నుండు నుదక బిందువులుగ నుండు బుద్ధి
వాసనలు, వానియందునఁ బ్రతిఫలించు
జీవుఁడే చిదాభాసుఁడా జీవుఁడంబు
దంబులో నీటిలోఁ బ్రతి బింబ మొందు
నాకసము వంటి వాడని యరయ వలయు

మాయలోఁ బ్రతి బింబించి మాయి యైన
యా చిదా భాసుఁడే యీశుఁ డనియె శ్రుతియు
అట్టి వాఁడె యంతర్యామి, యతఁడె యఖిల
మైన వాఁడు జగద్యోని యైన వాడు

అధిక నిద్ర సంబంధ మైనట్టి మాయ
యందుఁ గల బుద్ధి వాసన లందుఁ బ్రతిఫ
లించు నానంద మయ కోశ మెంచి చూడ
నీశ్వరుండని శ్రుతివచి యించు చుఁడు

అట్టి యానంద మయ కోశ మందు సర్వ
మెఱుఁగు ధర్మ మెట్లుండు నంచెంచ రాదు,
మాయ యందేది యేని సంభవమె యగును
శ్రుతుల నాక్షేపణము సేయఁ జూడరాదు

అట్టి యానందము సృజించి నట్టి జగము
నెవని కేనియు మార్పగ నేమి కాదు
అందుచేత నానంద మయంబు సర్వ
మునకు నీశ్వరుండని శ్రుతియును వచించె

అట్టి యానంద మయ కోశ మందశేష
జీవ తతి బుద్ధి వాసనల్ చేరియుండు,
అట్టి వాసనా తతి జగమంత నిండె
అందుచేనది సర్వజ్ఞుఁ డంటి మేము,

బుద్ధి వాసనల్ ప్రత్యక్షములును గామి
నట్టి యానంద మయ కోశమందు నుండు
నట్టి సర్వజ్ఞ తయుఁ దెలియంగఁ బడదు
సకల బుద్ధుల యందుండు సకల మెఱుఁగు
శక్తిఁ బట్టియు బుద్ధి వాసనలఁ దెలియు
వస్త్ర మందుండు రంగులు వస్త్రమునకుఁ
గారణములైన దారాలఁ గలిగి నట్లు
కార్య మందలి ధర్మముల్ కారణమున
నుండుననియు నూహించుట యొప్పుగాదె

అఖిల కోశంబులందును నఖిల భూత
జాలముల యందులోన నీశ్వరుఁడు నుండి
ప్రేరణము చేయు చుంటచే వేద మందు
అఖిలమునకు నంతర్యామి యనఁగఁ బడియె.

బుద్ధియం దీశ్వరుండుండి బుద్ధియే యు
పాధియై బుద్ధిచేఁ జూడఁ బడని వాఁడు
నగుచు బుద్ధిని నియ మించు నంచు వేద
మందు మిగులుగ ఘోషిత మగుచు నుండు

వస్త్రమున నూలుపోగు నెప్పగిది గాగ
నయ్యుపాదానమైన వస్త్రమంత నిండు
అఖిల మునకు నుపాదాన మగుచు జగము
నంత నిండు నంతర్యామి యట్లు గానె

వస్త్రమునకు లోపల నూలు వరలు చుండు
నూలు పోగు లోపల నుండు నూలు తునక
అంత కంటె లోపల నుండు నట్టి కతన
కన్నగ వకు నంతర్యామి కానఁ బడఁడు

అంతమవు లెన్నియో యుండి నట్టి కతన
లోన నుండు నంతర్యామి కానఁ బడఁడు,
అందుచే శ్రుతిచే నుపాయంబు చేత
దెలిసి కొనఁగ నగునని పెద్దలు వచింత్రు.

వస్త్ర రూపంబుచే నుంట వలన దార
మునకు వస్త్రంబె తద్దేహము నయి నట్లు
అఖిల జగమె యాకారంబు నగుట వలన
ఆ జగమ్మె యంతర్యామి కగును దనువు.

నూలు ముడువగ దెఱవగ నూలు కొనిన
వస్త్రమును ముడ్వఁ బడి తెర్వఁ బడచు నుండు,
తంతువు ననుసరించి వస్త్రంబు నుండు
వస్త్రమునకు స్వాతంత్ర్య మెప్పటికి లేదు.

ఏ ప్రకార మంతర్యామి యీశ్వరుండు
ఎచట నెట్టి వాసన చేత నెవ్విధముగ
మాఱునో జగం బట్టుల మాఱుచుండు
కారణా ధీన మగుఁ గాదె కార్య మెందు
అర్జునా, యీ సమస్త భూతాళి యొక్క
హృదయములయందు నుండి యా యీశ్వరుండు

యంత్రముల నధిరోహించు నతనిఁ బోలెఁ
దనదు మాయచే వర్తింపఁగ ను నొనర్చు.

సకల భూత మూలములు విజ్ఞాన మయము
లవియు హృదయ ప్రదేశ మునందు నుండు
వానికిని నుపాదానము నైన యీశ్వ
రుండు విజ్ఞానముగ మాఱుచుండి హృదయ
దేశ మందు వికారము నొందు చుండు.

యంత్రమగు పంజరముఁ బోలి నట్టి తనువు
దాని యందభిమానమె దాని నెక్కి
టగును. ధర్మ మందు నధర్మ మందు దాఁ బ్ర
వర్తనము సేయుచుంటయే భ్రమణ మగును

ఈశ్వరుఁడు మాయచేతఁ దానెంత యేని
పరిణమించు విజ్ఞాన రూపముగఁ దత్ప్ర
వర్తనంపు నైజ స్వరూపంబు గాఁగ
నదియె మాయచే భ్రామణం బనఁగఁ బరగు

ఎల్ల యెడల లోపలనుండి యీశ్వరుండు
నియమ మొనరించునని చెప్పు నిగమ మెందు
నల్లె సర్వభూతంబుల యందు నుండి
నియమ మొనరించునని యెంచు నీవు నెపుడు

ఎఱుఁగుదును ధర్మ మందుఁ బ్రవృత్తి కల్గ
దెఱుఁగదు నధర్మమందు నివృత్తి కల్గ
దస్మ దీయ హృదయమున యందు నుండు
నంత రాత్మ ప్రేరణ చేసినట్లు చేతు

పురుష యత్న రూపముగ నీశ్వరుఁడు నుండు
నందుచే మనము ప్రయత్న మాచరింప
నేమి లాభము లేదని యెంచ రాదు
పురుష యత్నంబుననె ఫలంబు లొనఁగూడు

పురుష యత్నరూపమున నీశ్వరుఁడు నుండె
ననఁగ నతఁడు ప్రేరేపింపఁ డనుట కాదు.
ఈశ్వర స్వరూపంబును నెఱిఁగి కొనఁగ
తాను నిస్సంగుఁ డనెడి విజ్ఞాన మొదవు

ఆత్మ నిస్సంగుఁ డని తెలియఁగనె ముక్తి
కలుగు నని శ్రుతులు స్మృతులు పలుకు చుండె.
అఖిల శ్రుతులును స్మృతులు నాయాజ్ఞ లంచు
గీతలందుఁ జెప్పఁ బడె శ్రీకృష్ణు చేత

ఈశు వలన భయం బుదయించు ననఁగ
ఈశ్వరాజ్ఞచే భయ హేతు వెసఁగు చుండు.
ఆ భయంబు నంతర్యామి కన్యమైన
యట్టి సర్వేశ్వరుని భావ మం చెఱుంగు

మిందు చేత నంతర్యామి కీశ్వరునకు
భేద మున్నదని శ్రుతి తెల్పెనని తెలియు.

అక్షరుని యాజ్ఞ యందె యీ యఖిల జగము
అనవరతము వర్తించు చున్నది యటంచు
అఖి భూతాల హృదయాల యందుఁ జొచ్చి
యాజ్ఞ సేయు నీశ్వరుఁడును నన్య శ్రుతియు.

సృష్టిని స్థితిని లయమును జేయుచుండు
నీశ్వరుఁడె జగద్యోనియై యెసఁగు నవియు
కానఁ బడుటయె సృష్టియు. కనఁ బడ మియె
ప్రళయ మంచును వేదంబు పలుకు చుండె

వస్త్రము మడత విప్పిన పగిది గాగ
నీశ్వరుఁడు తన యందు లయించి నట్టి
యఖిల జగము జీవుల కర్మ మనుసరించి
ఉదయ మొందఁగఁ జేయుచు నున్నవాఁడు.

వస్త్రము మడత పెట్టిన పగిది గాగ
అఖిల జీవ కర్మక్షయ మనుసరించి
ఆ జగము నీశ్వరుఁడె స్వాత్మయందులయము
నెందఁ జేయు నటంచును జెప్పు శ్రుతియు

రాత్రియుఁ బవలు వలెను. జాగ్రతయు నిద్ర
వలె. నిమేష మున్మేషము వలెను. మిన్న
కుండు టయును సంకల్పించు చుండుట వలె
సర్గమును ప్రళయంబును జరుగు చుండు

సర్గమును ప్రళయము సేయు శక్తి కల్గు
హేతువునను నారంభ మంచెంచఁ బడెడు
నదియుఁ బరిణామ మని యెడు నదియుఁ బూర్వ
పక్షములు నీకు నెడ సంభములు కావు

[త్రాడు పాముగఁ దోచు విధంబు గాగ
అద్వయంబు జగ ద్రూపమైన యట్లు
దనఁబడు నవెడు మా వాదమునకు నిట్టి
పూర్వ పక్షముల్ బాధింపఁ బోవునుమ్మ]

జడమగు ప్రకృతి దేహాది జడములకును
హేతువగు, నీశ్వరుఁడు హేతు వేమి కాడు.

బ్రహ్మమో చిదాభాస రూపంబు చేత
నఖిల జీవులకును హేతు వగుచునుండు

మాయయె యుపాధియైన బ్రహ్మము. జడమ్ము
లైన దేహమ్ములకు, చిత్ప్రధానుఁడైన
బ్రహ్మ మాచేతనులగు జీవతతులకును
సంస్కృతులఁ గర్మముల నుపాసనం చేతఁ
గారణత్వము కల్గి యున్నారటంచు

వార్తికా కారుఁడౌ సురేశ్వరుఁడు బ్రహ్మ
మునకె చేతనా చేతనమునగు నీ ప్రప
పంచమును కారణత్వముఁ బలికెఁ గాన

జీవునకుఁ గారణత్వము నేమి లేద
టంచు నీవందు వేనియు నట్లు గాదు

వార్తికా కారుఁడౌ సురేశ్వరుఁడు జీవ
ప్రత్య గాత్మలం బోలెఁ దద్బ్రహ్మమునకు
నీశ్వరునకును నధ్యాస మెనయఁ జేసి
యీశునకుఁ గారణత వచియింపఁడయ్యె

జ్ఞానము ననంతమును సత్యమైన బ్రహ్మ
మందు నాకస మనిలము నగ్ని జలము
నుర్వియును నన్నములను దదోషధులును
దేహములు పుట్టెనంచు శ్రుతియు వచించు

నైశ్రుతి వలన నిర్గుణ బ్రహ్మమునకు
నిందు సామాన్య దృష్టిచే నెంచి చూడ
నీ జగత్కారణము వచియింపఁ బడియె
కాని యీశ్వరుఁడే జగత్కారణుండు
దీన నన్యోన్య మధ్యాస తెలుపఁ బడియె
ఒక్క వస్తువుఁ గని మఱియొక్క వస్తు
వని తలంచుట యధ్యాస మన గ బరగు

రంగు వేసిన తెల్ల వస్త్రంబు నట్టి
రంగులోన భేదముగఁ జెలంగు నట్లు
ఆత్మతోడ నన్యోన్య మధ్యాస మొంది
మాయలోఁ బ్రతి బింబించి మలయుచుండు
జీవునకు బ్రహ్మమునకును నేమి భేద
ముండనటు లజ్ఞులకుఁ దోచు చుండుఁ జూవె

అజ్ఞులకు మేఘ మందుండు నాకసమున
కమ్మహాకాశమునకును నంతరమ్ము
గానఁబడ కుండి నట్టులుగానె యెపుడు
ఈశ్వరునకు బ్రహ్మమునకు నేమి భేద
ముండ నటు లజ్ఞులకుఁ దోచుచుండుఁ జూవె

అయ్యు పక్రమ మాదియైనట్టి లింగ
ముల వలనను దద్వేదార్థముల నరయగ
ఆ బరబ్రహ్మమే యసంగుఁడనియుఁ దెలియు
ఈశ్వరుండే సృజించిన ట్లెఱుఁగఁ బడెడు

[(1) సృష్టికిని బూర్వమున విశ్వమెల్ల రూప
రహిత మని చెప్పుచే యుపక్రమము నగును
దృశ్యమగు ప్రపంచము బ్రహ్మమే యటంచు
బ్రహ్మమే సత్యమనియుఁ దద్బ్రహ్మ మాత్మ
యనుటయే యుప సంహారమగునుజూవె

(2) బ్రహ్మమే జీవనుటయు నభ్యాస మగును

(3) అఖిల మందు నంతర్యామి యగుచు నుండు
నాత్మ నెఱుఁగుట పూర్వత యనఁగఁబడును

(4) ఎంత వఱకుఁ బ్రారబ్ధము నెసక మెసఁగు
నంత వఱకు నీ దేహేంద్రి యాది జగము
అనృతముగఁ దోచి ప్రారబ్ధ మంత మొందు
నపుడు జగము దోపక సర్వ మాత్మగానె
యుండుటయె జ్ఞాన ఫలమయి యుండుఁజూవె

(5) వినఁబడని దేది వినుటచే వినఁగఁబడునో
మననమును గాని దెయ్యది మననమునునో
నర్వఁదా మననము నేసిన యది యగునో
యనుటయే యర్థ వాదము ననఁగఁ బరగు

(6) మట్టి వలనఁ గల్గియునున్న యట్టి ఘటము
కనకము వలన గల్గిన కటక మందు
కారణము కంటె వేఱుఁగానఁ బడిన
కారణమునకు భిన్నమై కార్యముండ
దనెడు నదియుప పత్తియు ననఁగఁ బరగు]

ఆ పరబ్రహ్మ మగును సత్యమును జ్ఞాన
మును ననంతం బటంచును మొదలు పెట్టి
ఏ పరబ్రహ్మ మందుండి యెల్ల వాక్కు
లును నివర్తించు నని పూర్తియును నొనర్చి
బ్రహ్మము నసంగ మనియు నిర్ణయము చేసె

ఈశ్వరుఁడె యీజగము సృజియించు ననియు
జీవుఁడీ జగమున మాయచే నిరోధ
ముందునని యన్య వేద వాక్యంబు గలదు
అందుచే నీశ్వరుఁడె సృష్టి యాచరించు

అమలుఁడానంద మయ రూపుఁడైన యీశుఁ
డే ప్రపంచ మయ్యెద నంచు నెంచి నిద్ర
స్వ స్వరూపముగా మాఱు చందముగను
ఆ హిరణ్య గర్భుండు దానయ్యె నపుడు

ద్వి విధముగ శ్రుతి వాక్యముల్ తివురు చుంట
ద్వి విధ స్వప్నను భవములు తిరువు చుంట
నొకటి వెంట నొక్కటిగాని యొక్క మారె
గాని సృష్టియై నట్టులుగా నెఱుంగు
స్వప్న మొకటిపై నొక్కటి వచ్చుటయును
అన్నియొక మారె స్వప్న మందగ వచ్చుటయు
గనుచు నుందుము గాన రెండును నిజంబె

ఆహిరణ్య గర్భుండును నట్టి వాడుఁ
వస్త్ర మంతట దారము వ్యాప్తిఁ జెంది
నట్లు జగమెల్ల వ్యాపించి నట్టి వాఁడు,
అఖిల జనుల సమష్టి రూపైన వాఁడు,
అఖిల మేనను నభిమాన మందు వాఁడు,
సూక్ష్మ దేహ బండు, శక్తి సంశోభితుండు.

విశ్వనాథ మధ్యాక్కఱలు

నందమూరు శతకము

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

౧

పరమనాగరకముల్ వేదనుల్ శాస్త్ర పటలియు వేద
శిరసులు వదలి యాటవికు పోలిక శ్రీరమారమణ
యరయమి గొడ్డుగా నిన్నుఁ దలఁచెద నాఁపోవుగద
బిరుసెక్కి నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

చివరకు నొక్కదానికిఁ గృతజ్ఞత చెందక తప్ప
దప్పరొర! నీ యందు నే దురాచారమైనను నిన్ను
నవియింప మనసు కష్టపడు నీ పచ్చి యారక కరుణ
వివరింతు నంద మూర్నిలయ సంతాన వేణు గోపాల.

దిగులెప్పుడును విడరాక యుండ బాధించు చున్నావ
యిగమయి దినదిన గండమిదియు నూరేండ్ల యాయుస్సు
సగము చచ్చిన వాని నేల పట్టుక సాధింతు వెంత
వెగ్గలైతి నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

ఇప్పుడు కాకున్న నన్ను రక్షించు టెప్పుడో నీకుఁ
దప్పదంచును జెప్పుచుండె దోషజ్ఞతతి నాకుఁగన్న
కప్పెదు వానకు ముందుఁ జల్లని గాలి కొత్తరగ
విప్పదా నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

కొందఱు చేయు నట్టి యుపకారము గుర్తుగా జరుగ
దందఁడు స్పృశియించుచుండి జీవితమంత పాలించు
నొంది నా యెద నెడ్డా యెందుకో చిక్కుచుందు వైరాగ్య
బిందువుల్ నందమూర్నిలయ సంతాన వేణు గోపాల

సృష్టిలోపలఁగల సర్వమాధుర్యరేఖ సంగీత
యష్టిగాఁగ హిరణ్యగర్భు నాకారమైన వేణువును
ముష్టిఁగైకొని వచ్చినావు స్వామి నాముంగిలిలోఁబ్రవి
విష్టుడై నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

ముక్కున నడ్డబాసయును నధరంబు ముంగలవేణు
వక్కట వేదశిఖాసరస్వతి యన వచ్చినావు
మ్రొక్కు నా జీవుని గడప ముంగిట మ్రుగ్గులు తీర్చి
పెక్కులు నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

నీయంతటన్ నీవు నా యెదుట వచ్చి నిలువవు బ్రహ్మ
మై యా నిరాకారమై మదుజ్జ్వలమగు నూహా కల్ప
నాయత్త మూర్తివై వచ్చి నిలువక యదియౌను నీకు
ప్రియుఁడై నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

వచ్చిన నష్టమేమయ్య నీకు గోపాలయ్య నాదు
పుచ్చిన యూరుపులగురు ధూపంబు పొందమ్మి వోలె
విచ్చిన యెడద నైవేద్య మర్ఘ్యమ్ము వెలలు బాష్పములు
వెచ్చనై నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

శ్రీపరిణామ రేఖామనోహర స్మేర కపోల
గోపీసిత కపోల కలితనఖర సంకుమదజంబాల
కాపట్యరహిత ధీకృత సుధా గీతికాలోల నవగ
వీపాల నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

కాతన్త్ర వ్యాకరణం

[లఘువృత్తి సహితం]

శతావధానులు, శ్రీ శ్రీనివాస సోదరులు

3

ద్వితీయాధ్యాయము - ప్రథమ పాదము

౧. ధాతువిభక్తి వర్జ మర్థ వల్లిఙ్గమ్.

ధాతువూ ప్రత్యయమూ కానిదీ విభక్తి ప్రత్యయం చేరనిదీ అర్థం కలదీ అయిన శబ్దరూపానికి లిఙ్గ మని సంజ్ఞ. రామ, రాజన్ అహన్, లిఙ్గానికి విభక్తి ప్రత్యయం చేరితే 'పూర్వపరయో రర్థోపలబ్ధౌ పదమ్' (౧ ౧. ౨౦) అనే సూత్రం వల్ల పదమౌతుంది రామేణ, రాజ్ఞః, అహని అవ్యయాలుకూడా లిఙ్గాలే అపి, చ, వా, వీటికీ విభక్తి ప్రత్యయం చేరి ముందు చెప్పబోయే 'అవ్యయాచ్చ' (౨. ౪. ౪) అనే సూత్రం వల్ల లోపించి వీటికి పదత్వం సిద్ధిస్తుంది కనుక ఇవి లిఙ్గ రూపంలోనూ పద రూపంలోనూ ఒకే విధంగా వుంటాయన్న మాట

దీన్ని బట్టి తేలిన సారాంశ మేమంటే క్రియలు కాని యితర పదాలన్నిటికీ ప్రత్యయం చేరడానికి ముందు వుండే ప్రకృతి రూపానికి లిఙ్గ మని పేరు

అయితే అనుకరణ శబ్దాలుగా ప్రయోగించవలసి వచ్చినప్పుడు ధాతువులూ క్రియలూ, ప్రత్యయాలూ కూడా లిఙ్గాలుగా గ్రహించబడి విభక్తి ప్రత్యయాలు చేర్చి పదాలుగావ్యవహరించబడతాయి. వే ఞ శ్చ వయిః (౩ ౪ ౮౩) అనే సూత్రంలో వే ఞ్ ధాతు రూపాన్ని లిఙ్గంగా గ్రహించి దానికి షష్ఠీవిభక్తి ప్రత్యయం చేర్చి పదంగా వ్యవహరించబడింది 'హ్వాయతే ర్నిత్యం' (౩-౪-౧౪) అనేసూత్రంలో 'హ్వాయేతి' అనే క్రియను లిఙ్గంగా తీసుకొని షష్ఠీవిభక్తి ప్రత్యయం చేర్చి పదంగా వ్యవహరించ బడింది. 'జశ్శసౌ నపుంసకే' (౧ ౨ ౪) అనే సూత్రంలో 'శస్' అనే ప్రత్యయాన్ని లిఙ్గంగా గ్రహించి దానికి 'ఔ' అనే విభక్తి ప్రత్యయం చేర్చి పదంగా ప్రయోగించ బడింది. ఇలానే అంతటా గ్రహించాలి.

౨ తస్మాత్పరా విభక్తయః.

"సి ఔ జస్, అమ్ ఔ శస్, టా భ్యామ్ భిస్, ఙే భ్యామ్ భ్యస్, ఙసి భ్యామ్ భ్యస్, ఙస్ ఓస్ ఆమ్, ఙి ఓస్ సుప్,"

లిఙ్గానికి పరమందు విభక్తులు చేరుతాయి. అర్థాన్ని విడదీసేవి గనుక వీటికి విభక్తులని పేరు "సి ఔ జస్" మొదలైనవి ఏడు త్రికాలూ ఏడు విభక్తుల ప్రత్యయాలు. ప్రతి త్రికంలోను మొదటిది ఏకవచనానికి రెండోది ద్వివచనానికీ మూడోది బహువచనానికీ చెందినవి యీ విభక్తి ప్రత్యయాల్లో "ఇ, ఙ్, శ్, ట్, ఙ్ ఙ్" అనే వర్ణాలు ఇత్తులు సప్తమీ (ఏడవ) విభక్తి ఏకవచనప్రత్యయంలో వున్న ఇకారంమాత్రం ఇత్తు కాదు. ఒకానొక ప్రయోజనంకోసం ఉపదేశించబడి ప్రక్రియలో పుపయోగించని వర్ణాలకు ఇత్తు లని సంజ్ఞ. మరుత్ + జస్- మరుత్ + అస్ — మరుతస్ — మరుతః ఇక్కడ జకారం ఉపదేశంలో వున్నా ప్రక్రియలో పోయింది

ఇప్పుడు విభక్తిప్రత్యయాలుచేర్చి 'మరుత్' శబ్దరూపాలు చూపుతాము. మరుత్ + సి — మరుత్ + స్ — ఇక్కడ ముందు చెప్పబోయే 'వ్యఞ్జనాచ్చ' (౨ ౧-౪౯) అనే సూత్రంవల్ల వ్యఞ్జనాన్తమైన లిఙ్గానికి పరమైన 'సి' అనే ప్రత్యయం లోపిస్తుంది. అప్పుడు 'మరుత్' అనే ప్రథమావిభక్తి ఏకవచన రూపం ఏర్పడుతుంది. మరుత్ + ఔ —

మరుతౌ. ఇక్కడ స్వరం పరమైనప్పుడు తకారానికి దకారం రాదు. ఎందుకంటే అది (తకారం) పదాన్తంలో లేదు గనుక. అయితే మరుత్ + భ్యామ్ — ఇక్కడ ముందు చెప్పబోయే "ఝలాంజశోఽన్తే"(౮-౨-౩౯) అనే సూత్రంవల్ల ఘోషవత్ప్రత్యయం పరమైనప్పుడు 'ఝల్'సంజ్ఞ గల వర్ణాలకు వర్గతృతీయం వస్తుంది. భ్యామ్, భిస్, భ్యస్, - అనే ప్రత్యయాలు ఘోష వత్తులతో మొదలయ్యేవి. కనుక ఇవిపరమైనప్పుడు 'మరుత్' శబ్ద తకారానికి బదులు వర్గతృతీయమైన దకారం వస్తుంది. మరుత్ + భ్యామ్ — మరుద్ + భ్యామ్ - మరుద్భ్యామ్- మరుత్ + భిస్— మరుద్భిస్ — మరుద్భిః మరుత్ + భ్యస్ - మరుద్భ్యస్ — మరుద్భ్యః

'మరుత్' శబ్ద రూపాలు

ఏకవచనం ద్వివచనం బహువచనం విభక్తులు

మరుత్ మరుతౌ మరుతః [illegible] విభక్తి

మరుతమ్ మరుతౌ మరుతః ద్వితీయా విభక్తి

మరుతా మరుద్భ్యామ్ మరుద్భిః- తృతీయా విభక్తి

మరుతే మరుద్భ్యామ్ మరుద్భ్యః-చతుర్థీ విభక్తి.

మరుతః మరుద్భ్యామ్ మరుద్భ్యః-పంచమీ విభక్తి.

మరుతః మరుతోః మరుతామ్-షష్ఠీ విభక్తి

మరుతి మరుతోః మరుత్సు-సప్తమీ విభక్తి.

౩. పఞ్చాదౌ ఘుట్.

విభక్తి ప్రత్యయాల్లో మొదటి అయిదింటికి 'ఘుట్' అని సంజ్ఞ. సి ఔ జస్ అమ్ ఔ. దీని తరువాతసూత్రంలో నపుంసకలిఙ్గానికి వేరుగా ఘుట్ సంజ్ఞ విధించబడింది గనుక ఈ సూత్రం పుం స్త్రీ లిఙ్గ విషయకమని గ్రహించాలి.

౪. జశ్శసౌ నపుంసకే.

నపుంసకలిఙ్గంలో జస్, శస్ అనే విభక్తి ప్రత్యయాలుమాత్రమే ఘుట్ సంజ్ఞ గలవి.

౫. ఆమన్త్రితే సిః సమ్బుద్ధిః

ఆమన్త్రితమంటే సంబోధన—ఇతరులను తనకు అభిముఖులను చేసుకోటంకోసం పిలవటం. హే రామ! హే అంబ! హే వృక్ష! సంబోధించేటప్పుడు 'సి' అనే ప్రత్యయానికి 'సమ్బుద్ధి' అని సంజ్ఞ

౬. ఆగమ ఉదనుబన్ధః స్వరాదన్త్యాత్పరః.

అనుబన్ధమంటే ఇత్తు. ఉకారం అనుబన్ధంగా పఠించబడే వర్ణం ఆగమం ఆగమమంటే పూర్వ పర వర్ణాలకు ఏమీ హాని కలగకుండా మిత్రునివలె వచ్చి చేరే వర్ణం. ఆగమంగా విధించబడిన వర్ణం అన్త్యస్వరం వెనువెంటనే చేరుతుంది. పద్మ + జస్ - అన్నప్పుడు - "జశ్శసోః శిః" (౨ ౨. ౧౦) అనే సూత్రంవల్ల నపుంసకలిఙ్గంలో 'జస్, శస్' ప్రత్యయాలకు బదులు 'శి' వస్తుంది శకారం ఇత్తు కనుక 'ఇ' వస్తుందన్నమాట పద్మ + ఇ, అలాగే పయస్ + జస్- పయస్ + ఇ. ఇప్పుడు "ఘుట్ స్వరాద్ఘుటి నుః" (౨ ౨ ౧౧) అనే సూత్రంవల్ల అన్తస్థాను నాసికేతర వ్యఞ్జనాలకూ స్వరాలకూ ఘుట్ ప్రత్యయం పరమైనప్పుడు 'ను' వస్తుంది. 'ను' లో 'ఉ' అనుబన్ధం దీనివల్ల ఇది ఆగమమని తెలుస్తున్నది కనుక 'న్' చేరుతుందన్నమాట. ఈ నకారం ఎక్కడ చేరాలి అనేదాన్ని ప్రస్తుతసూత్రం నిర్ణయిస్తున్నది ఇది అన్త్య స్వరం వెనువెంటనే చేరాలి. కనుక పద్మన్ + ఇ, పయన్స్ + ఇ అనే ప్రక్రియ ఏర్పడుతుంది యిప్పుడు "ఘుటి చాసమ్బుద్ధౌ" (౨. ౨. ౧౨) అనే సూత్రంవల్ల సమ్బుద్ధికాని ఘుట్ప్రత్యయం పరమైనప్పుడు లిఙ్గాన్తమందున్న నకారానికి

ఉపధగా వున్న స్వరం దీర్ఘమవుతుంది. కనుక - పద్మాన్ + ఇ - పద్మాని. పయాన్స్ + ఇ — పయాన్సి - పయాంసి. ఇక్కడ - "మనో రనుస్వారో ధుటి" (౨ ౪ ౪౪) అనే సూత్రంవల్ల అన్తస్థాను నాసికేతరవ్యఞ్జనం పరమైనప్పుడు పదమధ్యమందున్న మకార నకారాలకు బదులు అనుస్వారం వస్తుంది. కనుక - సి' కి ముందున్న నకారం అనుస్వారంగా మారింది.

ప్రస్తుతసూత్రంవల్ల ఉదనుబన్ధమైన ఆగమం లిఙ్గాన్త్యస్వరం వెన వెంటనే చేరుతుందని చెప్పబడింది. కాని ఉత్తర సూత్రంలో తృతీయాది విభక్తులలో ఈ ఆగమం ప్రత్యయానికి మొదట చేరుతుందని చెప్పటంచేత తృతీయాది విభక్తేతర స్థలాలకు మాత్రమే ఈ సూత్ర కార్యం సీమిత మౌతున్నదని గ్రహించాలి.

౭. తృతీయాదౌ తు పరాదిః.

ఆగమం తృతీయాది విభక్తుల్లోనైతే ప్రత్యయానికి మొదట చేరుతుంది. ఈసూత్రం వెనుకటి సూత్రాన్ని బాధిస్తున్నదనే విషయం పైసూత్రం వివరణలో తెలుసుకున్నాము. "సు రామి సర్వతః (౨ ౧. ౨౯) అనే సూత్రంవల్ల త్రిలింగాల్లోనూ సర్వనామాలకు 'ఆమ్' అనే షష్ఠీవిభక్తి ప్రత్యయం పరమైనప్పుడు 'సు' ఆగమంగా వస్తుంది 'ఉ'అను బన్ధం. 'స్' ఆగమం. ఈ సూత్రం ప్రకారం ఇది తృతీయాదుల్లో చేరిన విభక్తి (షష్ఠి) కి సంబంధించింది గనుక ఈ 'స్' అనే ఆగమం ప్రత్యయానికి మొదట చేరుతుంది. సర్వ+ఆమ్ సర్వ + సామ్ "ధుటి బహుత్వే త్వే" (౨. ౧. ౧౯) అనే సూత్రంవల్లబహువచనంలో అన్తస్థానునాసికేతరవ్యఞ్జనం పరమైనప్పుడు లిఙ్గాన్తమందున్న అకారం ఏకారంగా మారుతుంది కనుక సర్వే + సామ్ అవుతుంది. "నామి క ర పరః ప్రత్యయ వికా రాగమస్థః సిః షం ను విసర్జనీయ షాన్తరో ఽపి" (౨. ౪. ౪౭) అనే సూత్రం ప్రకారం అవర్ణేతరస్వరాలకూ కకార రకారాలకూ పరమందున్న ప్రత్యయ — వికార ఆగమాలలోవున్న సకారం అను స్వార విసర్జనీయ షకారాలు మధ్యలో వున్నాకూడా షకారంగా మారుతుంది. ఈ సూత్రం ప్రకారం 'సర్వే + సామ్' లో ఏకారానికి పరమందు ఆగమంగావున్న సకారం షకారంగా మారి 'సర్వేషామ్' అనే రూపం సిద్ధిస్తున్నది. ఇలానే అంతటా గ్రహించాలి

౮. ఇదుదగ్నిః

శబ్దాన్తమందుండే ఇకార ఉకారాలకు అగ్ని సంజ్ఞ. 'హరి'లో ఇకారం 'శమ్భు'లో ఉకారం 'మతి' లో ఇకారం 'ధేను' లో ఉకారం

౯. ఈదూత్ స్త్ర్యాఖ్యౌ నదీ.

స్త్రీవాచక శబ్దాలచివర వున్న ఈకార ఊకారాలకు నదీ సంజ్ఞ 'నదీ' లో ఈకారం 'వధూ' లో ఊకారం. 'స్త్ర్యాఖ్యౌ' అనటంచేత పుంలిఙ్గాలైన 'సేనానీ,' 'యవలూ' వంటి శబ్దాల చివరి ఈకార - ఊకారాలకు నదీ సంజ్ఞ రాదు.

౧౦. ఆ శ్రద్ధా

స్త్రీవాచక శబ్దాన్తమందున్న ఆ కారానికి శ్రద్ధా సంజ్ఞ. 'రమా' శబ్దంలో ఆ కారం. స్త్రీవాచక మనటంచేత పుంలింగమైన శఙ్ఖధ్మా శబ్దానికి చివరవున్న ఆ కారానికి శ్రద్ధా సంజ్ఞ వర్తించదు.

౧౧. అన్త్యాత్పూర్వ ఉపధా

లిఙ్గంలోగాని ధాతువులోకాని చివరి వర్ణానికి వెనుకనేఉన్న వర్ణానికి ఉపధ అని సంజ్ఞ. 'రాజన్' లో అకారం. 'మనస్'. లో అకారం. వృత్ లో ఋకారం. ఇలానే అంతటానూ.

౧౨ వ్యఞ్జనాన్నోఽనుషఙ్గః.

లిఙ్గంలోగాని ధాతువులోగాని అన్త్యవ్యఞ్జ

నానికి వెనుకనే ఉన్న నకారాకిని అనుషఙ్గమని సంజ్ఞ 'విద్వాన్స్' అనే లిఙ్గంలో నకారం అనుషఙ్గం 'శ్రీన్స్'అనే ధాతూవులో నకారం అనుషఙ్గం.

౧౩. ఘు ద్వ్యఞ్జన మనన్తస్థానునాసికమ్

అన్తస్థగాని, అనునాసికంగాని కాని వ్యఞ్జనానికి 'ఘుట్' అని సంజ్ఞ
క ఖ గ ఘ చ ఛ జ ఝ ట ఠ డ ఢ త థ ద ధ ప ఫ బ భ శ ష స హ

౧౪. అకారో దీర్ఘం ఘోషవతి.

ఘోషవన్త మయిన ప్రత్యయంపరమైనప్పుడు లిఙ్గాన్తంలో వున్న అకారం దీర్ఘమవుతుంది. రామ + య - రామాయ రామ + భ్యామ్ — రామాభ్యామ్ దేవ + నామ్ — దేవానామ్ "(హ్రస్వ నదీ శ్రద్ధాభ్యః) ఆమి చ నుః" (౨ ౧ ౬౨) అనే సూత్రం ప్రకారం హ్రస్వాన్తాలూ నదీ, శ్రద్ధాన్తాలూ అయిన లిఙ్గాలకు 'ఆమ్' అనే విభక్తి ప్రత్యయం పరమైనప్పుడు నకారం ఆగమంగా వస్తుంది. ఇక్కడ హ్రస్వాన్తమైన 'దేవ' అనే లిఙ్గానికి 'ఆమ్' అనే షష్ఠీ విభక్తి ప్రత్యయం చేరింది. ఇది తృతీయాది విభక్తులలోది గనుక ప్రత్యయాదిని నకారం చేరింది దేవ + నామ్ నాకారం ఘోషవత్తు గనుక దాని వెనుక వున్న అకారం దీర్ఘమైంది 'దేవానామ్' అనే రూపం వచ్చింది

౧౫ జసి

జస్ ప్రత్యయంపరమైనప్పుడు లిఙ్గాన్తంలో వున్న అకారం దీర్ఘమవుతుంది. వృక్ష + జస్ - వృక్ష + అస్ - వృక్షా + అస్ - వృక్షాస్ - వృక్షాః "రేఫసో ర్విసర్జనీయః" (౨ ౩ ౬౩) అనే సూత్రం వల్ల పదాన్త సకారానికి బదులు విసర్జనీయం వచ్చింది

ఇక్కడ 'వృక్ష + అస్' అన్నప్పుడు "సమాన స్సవర్ణే దీర్ఘభవతి పరశ్చ లోపమ్" (౧. ౨. ౧) అనే సూత్రం చేతనే వృక్షాః అనే రూపం సిద్ధిస్తూంటే ఈ సూత్రం అనవసరంగదా అనవచ్చు కాని ముందు చెప్పబోయే "అకారే లోపమ్" (౨. ౧. ౧౭) అనే సూత్రంవల్ల విభక్తి 'అ కారం పరమైనప్పుడు లిఙ్గాన్తంలో వున్న అకారం లోపిస్తుంది అప్పుడు యీ సూత్రం "జసి" (౨ ౧ ౧౫) లేకపోతే బహువచనంలో గూడా 'వృక్షం' అనే అనిష్టరూపం వస్తుంది. "అకారే లోపమ్" అనే సూత్రం జస్ ప్రత్యయానికి వర్తించకుండా చెయ్యటమే ప్రస్తుత సూత్రం వుద్దేశం.

౧౬ శసి సస్య చ నః.

'శస్' పరమైనప్పుడు లిఙ్గాన్తమైన అకారం దీర్ఘం కావటమే కాకుండా ప్రత్యయంలో వున్న సకారానికి బదులు నకారమున్నూ వస్తుంది రామ + శస్ - రామ + అస్ రామా + అన్ - రామాన్. యిక్కడ శస్ అనేది విభక్తి ప్రత్యయం కనుక 'అల్పశస్' 'కణశస్' ఇత్యాదుల్లో వున్న 'శస్' అనే తద్ధితప్రత్యయానికిది వర్తించదు

౧౭. అకారే లోపమ్

విభక్తి ప్రత్యయం మొదట వున్న అకారం పరమైనప్పుడు లిఙ్గాన్తంలో వున్న అకారం లోపిస్తుంది రామ + అమ్ - రామ్ + అమ్ - రామమ్ సర్వ + అమ్ - సర్వ్ + అమ్ - సర్వమ్

౧౮. భిస్ ఐస్ వా

అకారాన్తమైన లిఙ్గానికి పరమైన 'భిస్' 'ఐస్' గా మారుతుంది ఒకప్పుడు మారక పోవచ్చుగూడా దేవ + భిస్ - దేవ + ఐస్ - దేవైః ఒకప్పుడు మారకపోవచ్చు. ననటంచేత 'దేవ — భిస్' అనేచోట "ధుటి బహుత్వే త్వే" (౨ ౧. ౧౯) అనే ఉత్తర సూత్రం చేత అన్తస్థానునాసికేతరవ్యఞ్జనంతో మొదలైన విభక్తి ప్రత్యయానికి ముందు బహువచనంలో లిఙ్గాన్తంలో వున్న అకారా

నికి బదులు ఏకారం వస్తుంది దేవ + భిస్- దేవే + భిస్ దేవేభిః అనే రూపం సిద్ధిస్తుంది ఇది వైదికరూపం మాత్రమే. అయితే దీనికి వ్యాకరణంలో తావు లేదు. అందుచేత ఇటు వంటి ప్రయోగాలు ఆనాటి లౌకిక భాషలో వుండేవనీ, వాటికోసమే యీ ప్రస్తుత సూత్రంలో 'వా' అని పక్షాన్తరం చెప్పబడిందనీ గ్రహించాలి. "మాన్యైరేభిః గన్ధర్వ వరేభిః" ఇత్యాది ప్రయోగాలు ఆనాటి బౌద్ధవాఙ్మయంలో చాలా వుండేవి.

'అతిజర' అనే అకారాన్తలిఙ్గానికి 'భిస్' చేర్చగా అతిజర + భిస్ - అతిజర + ఐస్ - అతిజరైః అనే రూపం వస్తుంది. ఇక్కడ పక్షాన్తరంలో - 'అతిజర + ఐస్ అని వుండగా "జరా జరస్ స్వరే వా" (౨ ౩ ౨౪) అనే సూత్రంవల్ల జరకు బదులు జరస్ వచ్చి- అతిజరస్ + ఐస్ - అతిజరసైః అనే రూపం సిద్ధిస్తుంది

౧౯ ధుటి బహుత్వే త్వే

అన్తస్థాను నాసికేతర వ్యఞ్జనంతో మొదలైన విభక్తిప్రత్యయం పరమైనప్పుడు బహువచనంలో లిఙ్గాన్తంలో వున్న అకారం ఏకారంగా మారుతుంది రామ + భ్యస్ - రామే + భ్యస్ రామేభ్యః వృక్ష + సు - వృక్షేషు (షకారం రావటానికి చూ వివరణ ౭వ సూత్రం)

ఈ సూత్రం 'అకారో దీర్ఘం ఘోషవతి" (౨.౧.౧౪)అనే సూత్రానికి బాధకం. అంటే ౨ ౧ ౧౪) సూత్రం బహువచనంలో అన్తస్థానునాసికేతరవ్యఞ్జనాలతో మొదలు పెట్టే ప్రత్యయం పరమైనప్పుడు ప్రసక్తం కాదన్న మాట. అన్తస్థానునాసికాలు ఘోషవత్తులు కనుక వాటితో ప్రారంభించే ప్రత్యయం పరమైనప్పుడు బహువచనంలో కూడా ౨-౧ ౧౪ సూత్రం ప్రవర్తిస్తుంది వృక్ష + నామ్ - వృక్షా + నామ్ ఇక్కడ "దప్ప వర్ణేభ్యో నో ణ మనన్త్యః స్వర హ య వ కవర్గ పవర్గాన్తరో ఽపి" (౨-౪-౪౮) అనే సూత్రం ప్రసక్తమౌతుంది. "రకార షకార ఋకారాల తరువాతవుండే అపదాన్త నకారం స్వరాలూ హకార యకార వకారాలూ కవర్గ పవర్గ వర్ణాలూ మధ్యలో వున్నప్పటికీ లేకపోయినప్పటికి ణకారంగా మారుతుంది." అందువల్ల వృక్షా + నామ్ అన్నచోట నామ్' లో వున్న నకారం 'వృక్షా' లో వున్న షకారం తరువాత 'ఆ' అనే స్వరం వున్నప్పటికీ ణకారంగా మారింది.

౨౦ ఓసి చ

'ఓస్' పరమైనప్పుడున్నూ లిఙ్గాన్తంలో వున్న అకారం ఏకారంగా మారుతుంది. రామ + ఓస్ - రామే + ఓస్ - రామయ్ + ఓస్ - రామయోః.

౨౧. ఙసి రాత్.

అకారాన్త లిఙ్గానికి పరమందు 'ఙసి' కి బదులు 'ఆత్' వస్తుంది రామ + ఙసి – రామ + ఆత్ – రామాత్ అతిజర + ఙసి – అతిజర + ఆత్ - అతి జరాత్, పక్షాన్తరంలో అతిజర + ఆత్ - అతి జరస్ + ఆత్ - అతి జరసాత్.

౨౨. ఙస్ స్య.

అకారాన్త లిఙ్గానికి పరమందు 'ఙస్'కు బదులు 'స్య' వస్తుంది రామ + ఙస్ - రామ + స్య - రామస్య విశ్వ + ఙస్ - విశ్వ + స్య - విశ్వస్య.

౨౩. ఇన టా.

అకారాన్త లిఙ్గానికి పరమైన 'టా' కు బదులు 'ఇన' వస్తుంది. రామ + టా – రామ + ఇన - రామేణ (చూ. వివరణ సూ ౧౯, నకారం ణకారంగా మారింది.) అతి జర + టా - అతిజర + ఇన - అతిజరేణ. పక్షాన్తరంలో - అతిజర + ఇన - అతిజరస్ + ఇన - అతిజరసిన. ఇంకొక

పక్షాన్తరం అతిజర + టా - అతిజర + ఆ - అతిజరస్ + ఆ అతిజరసా. టా ప్రత్యయంలో టకారం ఇత్తు గనుక 'ఆ' నిలుస్తుంది అప్పుడు స్వరాది ప్రత్యయానికి ముందు జరకు బదులు జరస్ వస్తుంది, అప్పుడది అకారాన్తలిఙ్గం కాదుగనుక 'ఆ' కు బదులు (టాకు బదులు) 'ఇన' రాదు అందుచేత 'అతి జరసా' అనే రూపం కూడా సిద్ధిస్తుంది.

౨౪. ఙే యః.

అకారాన్త లిఙ్గానికి పరమైన 'ఙే' కు బదులు 'య' వస్తుంది. రామ + ఙే - రామ + య - రామా + య (చూ సూ. ౧౪.) రామాయ వృక్ష + ఙే - వృక్ష + య- వృక్షా + య - వృక్షాయ.

చందాదారులకు వినతి

"నవభారతి" పత్రికకు అన్నివిధాలా సహాయ, సహకారాలు ఇస్తూవస్తున్న పాఠకులకు, అభిమానులకు కృతజ్ఞతను తెలియజేస్తున్నాము.

ఇంతవరకూ తమ చందాలను పంపటం పడనివారు, వెంటనే తమ చందాసొమ్మును పంపి, యథాతథంగా తమ సహాయ, సహకారము లిచ్చి, అన్ని విధాలా తోడ్పడవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

మేనేజరు, నవభారతి

బిరుదప్రదానము

శ్రీ అయితం కాళీవరప్రసాదరాయకవి

సీ.

కవిరాజా యిట భోజరాజసమున్నైకకల్యాణ సత్కావ్యసం
భవ దేశంబగు సత్కవిప్రతతి సంభావించి యున్ధన్యులౌ
యవనీనాధులు గల్గరాశ్రయమె ముఖ్యంబిందుఁ బ్రజ్ఞాప్రభా
వవులౌ సత్కవులేదొ వారికి సుఖప్రాప్తుల్ నభస్సౌధముల్

ధని నర్థింపక యింద్రుడంచనక పద్యస్ఫార రత్నాళి దు
ర్జనతా వర్తకకోటి కీయక కవీంద్ర వ్రాతమందెవ్వఁడున్
కనకాప్తింగనలే డెవండెవఁడునిక్కంబైన మానంబుతో
జని యార్జించెడు కూడుగుడ్డః కవితాచక్రాచ్యుతాకారుఁడై

పర కామినీ మణీ వక్షోజశయ్యానిద్రను గోరువానిని రాముఁడనియు
ఘనసాధులోకరక్తము ద్రావి త్రేనుచు నట్టిరాక్షసు నహింసాత్ముఁడనియుఁ
బేదకూడు హరించి పెద్దమేడలఁగట్టు పాతకజను విశ్వదాతయనియు
నక్కరం బెఱుగనియట్టి రసాభాస పశువునొక్కని వేదవక్త్రుఁడనియుఁ
బందినందిగాఁ గఁ బలుమారుస్తుతియించి నగవురంగు పూత వగపు గప్పి
సైఁగఁ బట్టిసేవచక్కఁగా నొనరించి దిక్కులేని కవిత దేవురించు

కెలపులు కంపిలన్విశద కీర్తియటం చనుదంభదాతకై
తలలను నెత్తుచున్మెఱుగఁ దార్కొను కాకవులెల్ల భ్రాంతిలో
పలఁబడు వెట్టికుక్కలు ప్రభత్తమయొక్క కవిత్వకాంతకే
యలవడ నన్యయశమక్కట నిల్పెడు నాసలేటికో

అకృతార్థుండ కృతార్థుని సుకృతిని జేయంగఁ జూచుచొప్పంధుఁడు వే
తొకయంధునిఁకిన్నొడ్పడ దికమికఁబడి గోతినిఁ బడు తెఱగులుగా వే

అంతరాంతర రత్న వాగబ్ధియైన ధన్యకవిరాజ శోభవ్యత్యస్తమయ్యె
యజ్ఞతాసూయ రాంధకమైనయపని ఛద్మ రత్నవర్తకులు ప్రశస్తులైరి.

భోగసక్తిస్వప్నముగలిగి మాధవమూర్ధచి రత్న రత్నముల్
రాజిలుపాదపీఠిఁ దనరారి యఖండరమాసతీకృపా
ప్రాజితచంద్ర చంద్రికల రంజిలిలెఖిని బూసునీవు మా
యాజన మధ్యబాధిత మహాకవిగాయమెఱుంగనేర్తురే.

నాయీస్థితిలో నేమో మోయనెదననుచు ననపము, పొడుచుచుమూపున్
గాయము చేసెడుకాకికి నేయెడతెలియునె వృషభముకేర్పడు బాధల్.

రోసమునగాదు సూ కాళిదాసనిన్ను కాకియనుచుల్కు తీరు లోకమునకంటి
శక్తి కిన్దగు సుఖము లేశంబునీని ధరనుగను ద్రోహపరుదంబు దలచికొంటి.

శతక్రతలం బొనర్చితిని సత్కవితానుషంగ శా
శ్వతసుఖమందఁ జాలితిని శారద సంతతమున్నటించు నా
యతమగునాదునాల్క నిటులయ్యును పాడుజగంబునందు నా
వెతలకు నంతమేగనను బుద్ధిరయు నన్గనదో కనీశ్వరా

దశపద్యకృతికై శతపుటాయతముపీఠి వ్రాయంగ నేర్పెఱువాఁడుగలుగ
మైత్రినో ! సిరికినో ! మఱిమఱి స్తుతియించి ప్రకటింప గలుగు దుర్భవులు గలుగ
నెఱిఁగియో ! నెఱుఁగకో ! ఏకారణముననో నొకవంకఁ బొగడు పత్రికలు గలుగ
వగలాఁడి మఱపించు సొగసుపుటలనక్ష రావళి ముద్రాలయమునఁ గలుగఁ
గాకవీంద్రుండు తానుండు కాలమెల్ల దంభగతి రాజ్యమేలఁ గాదంభరహిత
లలిత కవికావ్యహేమంబు దెలియరాదు రక్షణము లేక యగ్నిపరీక్ష లేక.

అంతులనంతమైన సిరులుంకముపై కెగఁబ్రాకి చుండఁగాఁ
జెంత దరిద్రదేవత వసింపఁగఁ జీర్ణకుటీరసీమ నా
కాంతయె తోడుగానిలువ గర్జిలిబాధలు పెక్కుమేధసున్
గ్రంతలు పెట్టుచుండఁ గవిగణ్యుడ నిల్చితిఁ గైత గూర్చితిన్

బాహ్య వాతావరణము తుపానుగాగ నెలక భంగోగ్ర జలధిగా నిలువనగునె
గేహ బాహ్యాంత రవ్యథా దాహబాధ కంటెనరకంబు మేలునిక్కంబుగాను

వరమము జీవనమేర్పడ నరుదారెటు ఘనవిలోకి నాత్మకివనిలో
స్థిరతర కవితాలతికా పరిమళలహరీ ప్రసూనపంక్తులు పొదలున్

వసుమతీ సుందరోద్యాన వాటియందు శ్రావ్యకలకంఠమగుఁ గవిరాజమూర్తి
గానమొనరింపవలెనన్నఁ గ్రమమధుర సుమరసార్థంబువలయు నుత్సుకతకొఱకు

గమిఁ గాకియుఁ గలకంఠిఁ దడవుప్రోచి కాలఁదన్నంగ వనలక్ష్మి గాచువెనుక
నాస్తియూ నమ్మకముగూడ నకట ! సుకవి పికమునకుఁ బలుగాకుల పృథివియందు.

పలుచనైన జీవనమునఁబడియు వనధి ఆస్థదాచుటనేమొ ? రత్నాకిరంబు
బ్రతుకునమ్మక కవిరాజ భావమణులు పృథివికిచ్చుటనేమొ? దరిద్రనరుఁడు

దంభధనికులు సమకాలధార్మికాళి మోసగించంగ దాతల వేసఘూని
సంచరింతురు కవులకై సాయపడరు హాస్యనిలయంబు వీరి మిథ్యాయశస్సు

సాధులు సత్కవీశులకు సాయమునీయమిఁ దద్దరిత్రతా
ఖాదితముల్పరిభావములు గాఢము రూఢము తద్వ్యథాళి, పెం
పెదినతచ్ఛి రాంతరమహీనము భావచి రత్న రత్నరే
ఖోదరకాంతి జాఱుసకలోర్వి మునుంగుఁద మచ్చటాస్థితిన్.

విశ్వదాతలంట! విబుధ కల్పకులంట దీనరక్షణంబు దీక్షయంట
యీ యయోగ్యనృపుల నేల నిందింపంగ దప్పుఁబలుకు కుకవుల తప్పుగాక!

పదము కడనువంగి వక్త్రంబుఁ దెఱచుచు నొకధనాంధుఁగూర్చి కవిమొఱఁగ
సుకవి భ్రమను మునిఁగియకట యాతనిచేర నరిగి భంగపడి వ్యధాత్ముఁడగును.

మఱుమరిచులందు మంచినీర్గ్రోలిన నింగి పూలుముడుచు నేర్పులున్న
యాచకమ్మువలన మదనసౌఖ్యము గొన్నఁ గపటదాతవలనఁ గలదుసుఖము.

కరము నెట్టవచ్చుఁ గౌఁగిలింపఁగవచ్చు మొలకనగవు పలుకుఁ జిలుకవచ్చు
ముగ్ధ పాత్రధారి భోగమీయఁగలేఁడు కపట విశ్వదాత కాఁడు దాత

డొక్కయెండి నిర్ధని కవియొక్కఁడుండగా నొసఁగు భావమునులేని కానరుండు
వసుధభ్రాంతిని ముంచ రూప్యములఁగోటి వెచ్చపెట్టి భోజఖ్యాతి ముచ్చిలించు

ప్రస్తుత లోకంబునఁగల వాస్తవరూపంబుఁ దెలుపువాడనునంతే
ప్రస్తుత వైభవలక్ష్మి కస్తుఁడనను సహమునాపఁ జరుగదుతండ్రీ

అహహ నాకేది! ఎట్టిభాగ్యంబులేదు కాని నిర్భాగ్య జీవనకంటకాగ్ర
సంకటంబులఁ బయనించు సాగువేళ ఆరిపోవని కైతయహంబునాపు

పెదాయ డవైన నీవు కవితాగణుండవో నీవు నా
బాకిన్నేటి జగంబు వన్నిలిచి భావసూచ్చ సత్కావ్య స
త్కేళిలోలతఁ దేలియాడఁ గలవా! కేలింపౌనర్పంగనీ
కిలంబల్కఁగ లేదు సత్యవచనాకింబల్కి నాడన్నుమీ

కూడుగుడ్డలకేని కొదయేర్పడ జేసి నిదురరానట్టి దుర్భిక్షలయందు
నౌషధంబులువేక యాయాసమునమూల్గి గన్నుమూయనియట్టి కాళరాత్రి
పణముకై ఋణదాత బాధింపసిగ్గిలి కూర్చుకలేనట్టి ప్రమోరనిశల
గహకిహారవముతో గర్జిల్లులేమిని దేలిమేల్కాంచినట్టి వేలయందు

గనులనీర్గ్రమ్మ దుడిచికొంచును గవిత్వ లలన పెట్టెడు గిలిగింత వలనఁగలము
పట్టివ్రాసితిఁ దారెడు భావములకు గట్టగట్టితి గుండియల్ దిట్టపరచి

వేడినెత్తురు బిందుల వెడలఁదిగిచి దిగులుదయ్యమొక్కెడఁ బ్రోలిదినుచునుండ
దేశకల్యాణ కవితకై తివిరి శేష రక్తకణములు జార్తు నాసక్తితోడ

వత్సరాఖ్యపుమైలు రాల్ప్రబతుకుటడవి దారిఁ గడచితి మృదుల పాదములుఁగంట
కప్రతానంబు చీల్చి రక్తంబు జార్ప, గమ్యధరఁ జూచుకేనాడొ! గదతలంప.

స్థానమేలేక శూన్యదృక్తతులనెఱపు కంటివెంటను గాల్వలై కాఱిపోఱు
బాష్పకణముల చాఱ లేర్పడియుఁగూడ ఛిలముగానట్టికైతలోఁ గలముసాగు.

ముమ్మరమ్మగులేమి చిమ్మచీఁకటిఁగూడ బదముత్రొట్రిలి కన్ను చెదరలేదు
వ్రాలినదుర్వ్యథాకేలికేలలఁగూడ భావామృతంబింకిపోవలేదు
బహువిఘ్నరూపక ప్రళయవాత్యలఁగూడఁ గొమరువాక్కుల తీగ గూలలేదు
భరణ దుర్వహ రోగవజ్రాహతులఁగూడ బుద్ధిభూధ్రము చీలిపోవలేదు

పడియుఁగూడను కాల్కేలు వడఁకలేదు విస్మరింతును సర్వంబు విశ్వమోహ
క్రమకవితామణీమణి గౌగిలించి గడుసు గిలిగింతవెట్టి యెక్కటనునవ్వ

అనియేమేమొ వచింప సాగితిని హస్తాంభోజముల్మోడ్చి యా
తని గంభీరతరాననంబు ననున్యస్తంబైన దృక్పాళిలో
విను తా కల్మషభావభావములతో విస్పష్ట భేదంబులో
డను నంతం గవిసార్వభౌముఁడు ప్రగాఢంబైన వాత్సల్యతన్

నను జేరంజనుదెంచి బాష్పముల స్విన్నంబైన గండస్థలిన్
చనవొప్పారఁగఁ బైకినెత్తిగురుఁడే చందంబున న్వీక్షించెన్
గనునారీతిని నన్నుగాంచి పలికెన్ గంభీర వాగ్వర్షధా
రనుతాపాగ్నిని నార్పుచున్ ప్రమదధైర్య ప్రాభవాపాదియై

రోదసిలో కాలభావం

శ్రీ వసంతరావు వేంకటరావు

ప్రకృతి శక్తులలో మహాబలవత్తరమైన ఒక శక్తిని మానవుడు ఛేదించి రోదసీ గవ్వారాలలో ప్రవేశింప గల సామర్థ్యాన్ని సంపాదించేడు ఖగోళమూర్తులుతప్ప నేటివరకు పొందని వేగాలతో గమించగల యంత్రాలను ఆకాశములో విక్షేపించి ఆకాశరహస్యాలను చేజిక్కించుకొంటున్నాడు నేలవిడచి సాముగాపరిణమించు రాకెట్లలో చేయుయాత్రలో భూలోకవాసి యూహింపలేని నవీన జ్ఞానాన్ని కైవసం చేసికొనే ప్రయత్నంలోనున్నాడు ధీరోదాత్తుడై, ప్రాణాన్ని తృణప్రాయంగా పరిగణించు స్థైర్యంతో, కేవల జ్ఞానార్జనాసక్తితో ప్రాణాపాయకరమైన క్రమశిక్షణకులోనై, ఊహా ప్రపంచాలలో నుండ గల పరిస్థితులను కల్పించుకొని, నిస్సహాయంగాను ఏకాకిగాను ఆపరిస్థితులలో జీవింపగల అవకాశాలను అన్వేషిస్తున్నాడు, కాని, మానవునిలో మొండితనంలేదు పైకిపోయిన రాకెట్టు సురక్షితంగా భూతలాన్ని చేరుకో గలిగినప్పుడు మాత్రమే రోదసీయాత్ర కుపక్రమిస్తాడు అంతకు పూర్వం, స్వయంచోదిత యంత్రాలను చంద్రలోకానికిపంపి, అవిపంపే సంకేతాలను బట్టి చంద్రతలం యొక్క లక్షణాలను తెలిసికొంటాడు చంద్రలోక పరిస్థితులను పూర్తిగా బోధపరచుకొని చంద్రలోకావాసానికి అనువైన పరికరాలతో, అవసరసామగ్రితో ప్రయాణమౌతాడు

భూలోకాన్ని విడిచి అంతరిక్షయానం చేయడానికై సెకెనుకి 7 మైళ్ళ వేగంతో భూతలంనుండి బయలుదేరాలని గణితంవల్ల లెక్కవేస్తేరు, అట్టి వేగాన్ని సాధించగల అవకాశం ఈమధ్యనే కలిగింది అంతర్జాతీయ జియోఫిసికల్ సంవత్సర కార్యక్రమాన్ని 18 నెలలపాటు ప్రపంచవ్యాప్తంగా సాగించడానికి రమారమి 70 దేశాలు కలిసి ఒకసంస్థగా ఏర్పడ్డాయి, ఇంత వరకు మానవుడు కాలిడని ప్రపంచభాగాలలో విజ్ఞానులు, జట్టులుజట్టులుగా, ప్రవేశించి జ్ఞానాన్ని సంపాదించడానికి ప్రయత్నాలుచేసేరు, వాటిని కొనసాగిస్తున్నారు ఆకార్యక్రమ నిర్వహణలో రోదసీయాత్ర కనువైన రాకెట్ల నిర్మాణ ప్రయోగాలు ఒకముఖ్యభాగం అమెరికా రష్యాలు విజయవంతంగా దానినిసాధించేయి భూమిచుట్టూ తిరిగేఉపగ్రహాలనూ (Satellites) భూబంధాలను త్రెంచుకొని రోదసిలో ప్రవేశించి సూర్యునికినిత్యప్రదక్షిణాలుచేసేగ్రహాలను (Planets) ప్రయోగించేయి. భూమికి పదివేల ప్రదక్షిణాలు పైగాచేసిన మూడవ స్పుత్నిక్ ఈమధ్యనే భూవాతావరణంలో ప్రవేశించి గాలిరాపిడికి మండి పోయిందని పరిశీలకులు ప్రకటించేరు సూర్యునిచుట్టూ రెండు కృత్రిమగ్రహాలు తిరుగుతున్నట్లు విజ్ఞానలోక మంగీకరించింది

ఇట్టిరాకెట్లలో మానవుడింకా బయలుదేరలేదు కుక్కలనూ ఉడుతనూ పంపేరు ఉపగ్రహంగా పరిభ్రమించిన రాకెట్లలోనిజీవులు అంతరిక్షంలోనే హరించిపోయేరు కొన్నిమైళ్ళపైకి ఆకాశంలో పయనించి తిరిగివచ్చిన జీవులు కొంత జ్ఞానాన్ని సమకూర్చేయి మండిపోకుండా భూతలాన్ని చేరుకోగల రాకెట్ల నిర్మాణానికి ప్రయత్నిస్తున్నారు 15-5-60ని నకిలీమనిషి ప్రతిమతో పరిభ్రమించే'అంతరిక్షనౌక' (Space ship) ను రష్యా ప్రయోగించింది. భూతలానికి 200 మైళ్ల ఎత్తున గంటన్నర కొకసారి భూప్రదక్షిణం చేస్తుంటా ఉపగ్రహం అట్టి ఉపగ్రహాలలో భూమికి నిత్యప్రదక్షిణాలు చేసే మొదటిమానవుని అనుభవాలు అత్యద్భుతంగా నుండాలి గంటన్నరలో భూమికొక ప్రదక్షిణం చేసే సందర్భంలో 45 నిమిషాలకాలం భూమియొక్క నీడలో ఆ ఉపగ్రహం ఉండవచ్చు. అప్పుడు ఆ ఉపగ్రహవాసికి రాత్రి వాని దినం గంటన్నరమాత్రమే ముప్పావుగంటలో సూర్యుడు నభోమార్గాన్ని ఉదయాస్తమయాల మధ్యగమిస్తాడు.

ఆయితే, అంతవేగంతో పరిభ్రమించు ఉపగ్రహమైన రాకెట్టులో మనిషిజీవించగలడా అని సందేహించ నవసరంలేదు మనం నివసిస్తున్న భూమియొక్కపరిస్థితిగమనిస్తేఆశ్చర్యమౌతుంది. భూగోళం బొంగరము లాగ తనఅక్షపై ఆత్మభ్రమణం చేస్తూంది ఒక ఆత్మభ్రమణకాలం ఒక రోజు భూగోళపు చుట్టుకొలత సుమారుగా 25,000మైళ్లు 24గంటలలో ఒకసారి తనలో తనుతిరిగినప్పుడు భూమధ్యరేఖ ప్రాంతంలో నున్న ఏవస్తువైనా గంటకి, రమారమి, 1,000 మైళ్లవేగంతో భ్రమిస్తూంది ప్రతిసెకెనుసుమారు రెండు ఫర్లాంగుల దూరం మనం భూతలంతో పరిభ్రమిస్తున్నాము. ఆభ్రమణవేగానికి భూతలం

నుండి ఎగిరిపోవలసిందే-బండిచక్రానికి అంటుకొన్నమన్ను ఎగిరినట్లు. కాని,గురుత్వాకర్షణ బల ప్రాబల్యంచే ఈఆత్మభ్రమణబలాన్ని అతిక్రమించి సుఖంగా దైనందిన కార్యక్రమాన్ని నెరవేర్చుకొంటున్నాము.

సూర్యుని చుట్టూ భూమిచేయు ప్రదక్షిణం రెండవగమనం. తనకక్ష్యలో భూమి పరిభ్రమిస్తూ సంవత్సరానికొక సూర్యప్రదక్షిణం చేస్తూంది. సూర్యునికి భూమికి గలదూరం సుమారు తొమ్మిదింపావు కోట్లమైళ్లు. దానినిబట్టి భూకక్ష్యయొక్క పరిమాణం, సుమారు, అరవైకోట్లమైళ్లని స్పష్టమౌతుంది. ఆదూరాన్ని ఒక సంవత్సరములో తిరిగి వచ్చేభూమి సెకెనుకి 18½ మైళ్ల వేగంతో పరిభ్రమిస్తుంది. కన్నుమూసి తెరిచే లోపుగా మనం భూమితోపాటు ఆకాశమార్గాన్న 18½ మైళ్లదూరం సాగిపోతున్నామంటే నమ్మగలమా?

ఈగమనాలుకాక, సూర్యునితో సహా గ్రహమండలం యావత్తు మనగెలక్సీలోతిరుగుతూంది. దానివేగం ఇంకా ఎక్కువ. మూడువిధాలుగా మనం క్షణక్షణం గమిస్తున్నాము. వాటిజ్ఞానం మనకించుకైనాలేదు. పరిశోధనాగారాలలో, వేధశాలలో, కర్మాగారాలలో. మానవులు ఎన్నోనున్నితమైన ప్రయోగాలు చేస్తున్నారు. గాలివీస్తేకదలిపోయే పరికరాలుసైతం భూచలనాన్ని గుర్తించలేవు. అంపుచేతనే, ఆకస్మికంగా, ఒక్కొక్కప్పుడు, విజ్ఞానులను సైతం వీపుతట్టి ప్రకృతి ప్రశ్నిస్తుంది. "భూమినిజంగా కదులుతూందా? తిరుగుతూందా? ఏకదలికనైన నీవెందుకు గుర్తించలేవు?"

జగత్తులోనున్న గోళాలన్ని, సాపేక్షంగా, చలనంలోనున్నాయి. కాని, ఏగోళానికాగోళమే తను స్థిరంగానున్నాదనీ, మిగిలినవి గమిస్తున్నాయనీ భావిస్తుంది. మనకు కనుపించేదేమంటే సూర్యచంద్రులూ, నక్షత్రగ్రహాలూకూడ ఆకాశమార్గాన్న తిరుగుతున్నాయని, కాని, సూర్యునిచుట్టూ భూమి, భూమిచుట్టూ చంద్రుడు తిరుగుతున్నాయనిచెప్పుకొంటాము. అయినప్పటికీ మనం స్థిరంగానున్నట్లు భావించడం పరిపాటి. మనలోకంలో నుండి సూర్యచంద్ర లోకాలలో పొడవులనూ కాలాన్నికొలుస్తాము. ఆప్రక్రియలో కొంత విశేషముంది. మనభూమితో సాపేక్షగమనంలోనున్న లోకాలపై పొడవులను కొలిచినప్పుడు, ఒకప్రత్యేకపరిస్థితిలో, పొడవుతగ్గినట్లుంటుంది. గోళాలు గమిస్తూన్న దిశలోనున్న పొడవు సంకోచించినట్లుండడం ప్రకృతి విశేషం. మనకొలబద్దలతో కొలిచినపొడవుకీ, ఆలోకవాసులు వారికొలబద్దలతోకొలచిన పొడవుకీ వ్యత్యాసముంటుంది. మన దృష్టిలో పొడవు తగ్గినట్లు కనిపిస్తుంది. అదేవిధంగా కాలాన్ని కొలిచినప్పుడు, మనవాచీల కంటె ఆలోకపువాచీలు మెల్లగా తిరుగుచున్నట్లుంటుంది. మనవాచీలతో మనలోకపు జీవులజీవితాలు, ఆలోకపు జీవులజీవితాలూ కొలిచినప్పుడు మనకంటె పరలోకవాసులు తక్కువకాలం జీవించినట్లు మన దృష్టికి కనిపిస్తుంది. ఈవ్యత్యాసం మన భూలోకానికీ మనం పరీక్షిస్తూన్న లోకానికి గల సాపేక్ష వేగంపై ఆధారపడిఉంటుంది. ఆలోకం ఎక్కువ వేగంతో గమించినకొద్దీ కాలవ్యత్యాసం కూడా ఎక్కువౌతుంది.

మహావేగాలతో ప్రయాణం చేసేరాకెట్లలోనున్న మనుష్యులకు ఎట్టి కాల భావముంటుంది? మన కాలప్రమాణాలు ఖగోళాల గమనాలవల్ల ఏర్పడ్డాయని విదితమే.భూమిఆత్మభ్రమణంచేసే కాలాన్ని 'దినం' అని, సూర్యునిచుట్టూ ఒక ప్రదక్షిణం చేసేకాలాన్ని 'సంవత్సరం' అని వ్యవహరిస్తున్నాము. మాసకారకుడు చంద్రుడు. భూమి చుట్టూ చంద్రుడొక ప్రదక్షిణంచేసి సూర్యపరంగా సూర్యభూముల మధ్యకు వచ్చే కాలప్రమాణాన్ని 'మాసం'అన్నారు. దినానికి 24గంటలని, వాటిని తిరిగి నిమిషాలుగా సెకెనులుగా విభాగాలు చేసేరు. ఇట్లేర్పరచుకొన్న కాలప్రమాణాల బట్టి మనజీవితాలను వివరించుకొంటాము. ఈకాలవాహినికి మనతో సంబంధంలేదు. గ్రహతారకాగతులబట్టి సమవేగంతో కాలం గడచి పోతుంది. అందుచేత, దీనిని భౌతిక (Physical) కాలం అన్నారు. ఏజీవికైనా భౌతిక కాలం ఒకేవడితో ప్రవహిస్తుంది.

దీనికిభిన్నమైనది, జీవులతో సంబంధమేర్పరచుకొన్నది, జీవిజీవికి మారకలిగేదీ వేరొక కాలముంది. అదిరెండువిధాలు: శారీరక కాలం, మానసిక కాలం. వీటిలో మొదటిది జీవియొక్క శరీరప్రక్రియలతో అన్వయింపబడేది; రెండవది జీవియొక్క మానసికావస్థకి సంబంధించినది. ఈ రెండుకాలాలలో వ్యత్యాసముంది. భౌతిక కాల భావం సరిగ్గా నున్నంతవరకు కాలమానంలో వ్యత్యాసంరాదు, కాని. భౌతికకాలభావమే మాయమైననాడు ఏవిధంగా కాలాన్ని కొలవడమన్నది ప్రశ్నగాపరిణమిస్తుంది.ఉపగ్రహమైన రాకెట్టులో తిరుగుతున్నంత వరకు సూర్యోదయాస్తమయాలు

అనుభవమౌచుంటాయి కాని, వాటిపరిమాణం మారిపోతుంది సూర్యోదయమైన 45 నిమిషాలకే సూర్యాస్తమయం కావచ్చు ఆకాశంలో సూర్యగోళం పరుగెత్తుచున్నట్లు రాకెట్టు వాసికి కనిపిస్తుంది, అయినప్పటికి తనవాచీతో సమన్వయించుకొనడానికి ప్రయత్నిస్తాడు అది కష్టసాధ్యమైనప్పటికి అసాధ్యమనలేము.

కాని, గురుత్వాకర్షణాన్ని త్రెంపుకొని రోదసిలో ప్రవేశించి, గ్రహమై, సూర్యునిచుట్టూ తిరుగురాకెట్టిలోనున్న జీవికి సూర్యుని ప్రత్యేకత కనిపించదేమో? మనవాతావరణాన్ని దాటిపోయేసరికి "పగలు" అర్థరహితమౌతుంది నల్లటి ఆకాశంలో దుర్నిరీక్ష్యంగానున్న అసంఖ్యాక నక్షత్రాలలో సూర్యబింబం పెద్దదిగా కనుపిస్తుంది కాని, భూకక్ష్యనుదాటి ఏ యురేనస్, ప్లూటోలున్నంత దూరంగా రాకెట్టు పోయేసరికి సూర్యబింబపరిమాణం తగ్గడమేకాక తైక్ష్ణంకూడ బాగా క్షీణిస్తుంది. అప్పుడు అహర్నిశలను కాలవిభాగాలే మాయమౌతాయి, సంవత్సర భావంకూడా లుప్తమౌతుందేమో.

పైగా, గమనవేగంతో కాలప్రమాణం మారుతుందని గమనించేము. భౌతికకాలభావానికి అవకాశంలేని పరిస్థితులలో శారీరక మానసిక కాలాలపై రోదసీ యాత్రికుడు ఆధారపడాలేమో? భౌతిక పరిస్థితులు మారిపోగానే శారీరకప్రక్రియలలోకాని మానసికప్రక్రియలలోకాని ఎట్టి మార్పు వాటిల్లుతుందో చెప్పలేము. ఒకవిజ్ఞాని చమత్కరించినట్లు వివాహితుడైన యువకుడు రోదసీయాత్రచేసి తిరిగివచ్చేసరికి తన భార్యపిల్లలుకూడ ముసలివారైపోగా యువకుడింకా బలంగా ఉంటాడట.

అత్యధికవేగంతో గమించగల సామర్థ్యాన్ని సంపాదించిన మానవుని క్లిష్టమైన ప్రశ్నలు వేధిస్తున్నాయి. సిద్ధాంతానికి అనుభవానికి ఉన్న సాన్నిహిత్యాన్ని ప్రత్యక్షంగా తెలిసికొనగలిగే వరకు ఈప్రశ్నలు ప్రశ్నలుగానే ఉంటాయి, కాంతివేగంతో పయనిస్తేనే $4\frac{1}{4}$ సంవత్సరాలలో కాని మనకతి సమీపంగానున్న నక్షత్రాన్ని చేరుకోలేము. ఇప్పటి వరకు మానవుడు సాధించిన వేగాలతో ప్రయాణించినప్పుడు కొన్నిపురుషాంతరాలుగడచిపోవాలంటారు. కాని, నక్షత్రలోకాలని మానవుడు చేరుకోగలడా? ప్రయాణం పూర్తి అయేలోపుగా జీవించిఉండగలడా? అంతవరకు జీవితకాలాన్ని పొడిగించుకోగలడా? రోదసియాత్రలో కాలప్రమాణాలే తారుమారౌతాయా?

ఆ నా డే...

శ్రీ "కౌటిల్యుడు"

మనకు స్వపరిపాలనవచ్చినది మనమీస్వపరిపాలనా విధానమునకు ఒక రాజ్యాంగ చట్టము యేర్పరచుకొనియుంటిమి ఈ రాజ్యాంగ చట్టమును ప్రజాస్వామ్య బద్ధమైనదని మనమనుకొనుచుంటిమి. ఈ చట్టముద్వారా ప్రజాప్రతినిధులైనవారికి కొన్ని బాధ్యతలు, కొన్ని హక్కులు, కొన్ని విధులు నిర్వచన చేయబడియున్నవి ఈ చట్టమునకు లోబడి యీ దేశమున నివసించు ప్రతిఒక్కరికి కొన్ని బాధ్యతలు, కొన్నిహక్కులు, కొన్నివిధులు యేర్పరచి స్త్రీ, పురుష విభేదములేని వయోజన వోటింగ్ యిచ్చియుండిరి ఇది సామాన్యులకు సామాన్యము ఇది అసామాన్యులకు అసామాన్యము ఇది సామాన్యులు, అసామాన్యులు కాని వారికి అసందిగ్ధము

పరిపాలనయనునది అందరి ప్రయోజనమును ఆశించి యేర్పడి యున్నదని మనము చెప్పుకొనుచుంటిమి ఇందునుగురించి రాజకీయ శాస్త్రమని ఒక విధమైన మానవానుభూతిని గ్రంథస్థముచేసి యిది సార్వజనీనమైన ప్రయోజనమును సాధించునని చెప్పుచుంటిమి మన యీ భావములు జాతీయములైనవా? విజాతీయములైనవా? సజాతీయములైనవా? లేక సమ్మిశ్రమములైనవా? ఈ మొదలైనప్రశ్న పరంపరలు మనలో నొక విధమైన సందేహ ప్రవృత్తిని కలిగించి మన చిత్తమున ప్రతిబింబించుచునే యున్నవి. మనలోని యీ సందేహ ప్రవృత్తియే మనపరిపాలనా విదానములోని లోపములకు, మన ప్రజలలోని సత్ప్రవర్తనా రహితమైన పరిస్థితులకు ప్రధాన కారణము

ప్రతిజాతికిని కొన్ని లక్షణములు, కొన్ని సంప్రాదాయములు, కొన్ని సంస్కారములు, కొన్నిసభ్యతలు, కొన్నిబాధ్యతలు, కొన్ని హక్కులు, కొన్నివిధులు కొన్నివిద్యలు కొన్ని కళాచమత్కృతులు జాతిలో అంతర్లీనమై ఒక విధమైన నడవడిక కలిగి అనుశ్రుతముగా వ్యక్తముచేయబడుచున్నవి. కొన్నికొన్ని ధర్మములు, కొన్నికొన్నిన్యాయములు, కొన్నికొన్ని హితవులు, కొన్నికొన్ని మమకారములు, కొన్నికొన్నిమమతలు, కొన్నికొన్నిప్రేమలు కొన్నికొన్నిభక్తి ప్రపత్తులు గలిగి ఆచరణలో జీవితవర్తనముద్వారా రుజువు చేయబడుచున్నవి.

ఈనాడు పాలితులు, పాలకులు అనువిభజన నామమాత్రముగానున్నది పాలకులేపాలితులు. పాలితులేపాలకులు ఈ పాలిత, పాలకుల విభాగము ఓటుద్వారా నిర్ణయించబడుచున్నది ఈ ఓటుప్రయోజనము పాలితునకు తెలియదు పాలకునికి తెలియదు ఈ పాలిత పాలకుల విద్యా వివేకములు బహుపరిమితములు ఈరాజ్యాంగ చట్టమును చదివి పాలిత, పాలకుల భావవిభాగము పరిగ్రహించి ప్రయోజనాపేక్షను పెంపొందించుకొని వివేకవర్తనులై ప్రవర్తించుటకు యేదికావలయునో అది యీ రాజ్యాంగ చట్టముద్వారా పొందుటకు మాత్రము వీలులేదని చెప్పవచ్చును ఈపాలిత పాలక విభాగము ప్రజామోదమును పొందినదని మనము మాత్రము చెప్పుకొనుచున్నాము ఇది రాజకీయ పక్షముల సూత్రనిర్వచనమునందున్నది ఈ దేశమున రాజకీయ పక్షములను నవి యేర్పడి పాలితపాలక సూత్రములలోని భావములను వివరించి విజ్ఞతకలుగజేయుటకు బదులుగా వారికోరికలనుతీర్చుకొనుటకు ఉపకరణములుగా వినియోగించుకొనుచున్నారు

మనదేశములో రాజ్యాంగచట్టమును చదివినవారు బహుపరిమిత సంఖ్యలోనున్నారు ఈ రాజ్యాంగచట్టమును చదివి అర్థముచేసుకొని అన్వయించి చెప్పగలిగినవారు ఆ పరిమితమైన సంఖ్యలో బహుపరిమితమైన సంఖ్య కలిగియున్నారు ఈ అతిస్వల్పమైన సంఖ్యగలవారు మాత్రమే ఈ రాజ్యాంగబద్ధమైన చట్టముల ప్రయోజనములను బహుజన సంఖ్యాకులైన పాలకులకు, పాలితులకు, పాలిత పాల

కుల మధ్య కార్యనిర్వహణ చేయువారికి చెప్పగలిగిన సమర్థత కలిగిలేరనియే చెప్పవచ్చును

మనజాతీయ భావములకు, జాతీయ సంప్రదాయములకు, జాతీయ నాగరికతకు, జాతీయ మత, దైవభావములకు మనరాజ్యాంగ చట్టము దోహదము చేయుటలేదు. మన రాజ్యాంగ చట్టము పశ్చిమదేశ సంప్రదాయకములైన భావములకు సమ్మిశ్రమమైయున్నది దీనిని మన జాతీయ జీవితమునకు వర్తింపచేసి ఒకపరమ ప్రయోజనమును సాధించ వలయునని కుతూహల పడువారికి పరీక్షాకేంద్రముగా తోడ్పడునెమోకాని, ప్రయోజనమును సాధించి పెట్టగలవని చెప్పుటకు సుసాధ్యము కాకున్నది

మనకు చదువను వ్రాయనుతెలిసినవారి సంఖ్య అతిసామాన్యమని మనకుతెలియును చదువను, వ్రాయనుతెలిసి సద్వివేచనా శక్తిగల వారి సంఖ్య అతితక్కువయనికూడ మనకు తెలియును జాతీయము కాని విజాతీయభావములను చట్టబద్ధము చేసియుంటిమి మన రాజ్యాంగచట్టమునకు మన జీవిత విధానమునకు యిందువలన వైరుధ్యమేర్పడి జాతీయ వికాసమునకు విఘాతము కలుగు చున్నది

పాలితులు ప్రతినిధుల నెన్నుకొనెదరు ప్రతినిధులు పాలకుల నేర్పరచెదరు పాలకులు, పాలితులు తమతమ విద్యుక్త ధర్మములను నిర్వర్తించుటకు పాలకవ్యవస్థానిర్వహణోద్యోగులు తోడ్పడు చుందురు. ఈ పాలక నిర్వహణ వ్యవస్థానిర్మాణము పాలితపాలక వర్గవిభేదములను కల్పించి అనేకమైన చిక్కులను కల్పించుచున్నది ఈ వ్యవస్థా విభాగములోని విధి నిర్వహణ విభాగముల తారతమ్యములు పరస్పర విరుద్ధ ప్రమాణములు కలిగి పాలితులపై పాలకులకు, పాలకులపై పాలితులకు పరస్పర విశ్వాసము, గౌరవాభిమానము క్రమక్రమముగా క్షీణించి పోవుటకు తోడ్పడుచున్నది

మన రాజ్యాంగచట్టము గొప్పదని, మనప్రతినిధుల సభలు ఉన్నతమైనవని, మనప్రభుత్వ నిర్వహణశాఖ, న్యాయశాఖ ఉత్తమమైనవని, మనపాలితులు, పాలకులు ఉదార స్వభావులని మనకుమనమే ప్రశంసించుకొనుచున్నాము. మన ప్రశంసలకు మనము సరితూగగల అర్హత నెంతవరకు సంపాదించుకొనగలిగినామో యోచింపగలిగిన ప్రశాంత వాతావరణములో మనము లేమని చెప్పవలసి యున్నది

మనము జాతీయ రంగములోను, అంతర్జాతీయ రంగములోను కొన్నికార్యవిధానములను రూపొందించుకొని మనశక్తిని మనము పరీక్షించు కొనుచున్నాము

ప్రపంచములోని జాతులన్నింటిలో భారత జాతీయ పౌరధర్మ నిర్వహణ అతిసామాన్యమైనదని మనమంగీకరించకతప్పదు. మన శక్తికి మించిన బాధ్యతలను మనము స్వీకరించి మనకు మనమే అపచారము చేసుకొనుచున్నాము మనపూర్వుల ఔన్నత్యము, మనపూర్వుల సత్ప్రవర్తన, మనపూర్వుల వివేక విజ్ఞానముల స్థాయీభావము మనలో ఏమూలనో దాగి యుండి అప్పుడప్పుడు స్మృతి మాత్రముగా స్ఫురించడమువలన మనకు గొప్పస్థానము సంప్రాప్తించినదని మురిసిపోవుచున్నాము

మనము మనయథార్థ పరిస్థితులను గమనించక మనశక్తి సామర్థ్యములను గుర్తించక, మన భావనా ప్రపంచములోని ఊహా గానములకు రూపురేఖలు సమకూర్చుకొనవలయునని అత్యాశాపేక్షతో జీవిత విధానమునకు సంబంధించిన కొన్ని తియ్యతియ్యని కలలను కనుగొన్నామని భ్రాంతిపడుచున్నాము మనలో మనము ఆత్మపరీక్ష చేసికొనినచో తుది మొదలు తెలియని జీవిత పథములో మనము ప్రయాణము చేయుచున్నామని చెప్పకతప్పదు.

మనఆశలను, మన అభిలాషలను, మన ఆకాంక్షలను, మన జాతీయ సంప్రదాయములను, మనజాతీయ నడవడికను మనజాతీయ కళా సంస్కృతులను, ఆత్మీయము చేసుకొని మన అంతరంగములలో ప్రేమాదరములను సమకూర్చుకొనిననాడే మన పురోభివృద్ధికి మన స్వరాజ్య సాధన తోడ్పడినదని, మనలోమనకు విశ్వాసము కలిగించినదని సుస్పష్టముగా చెప్పవచ్చును.

మధురోహ

శ్రీ శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి, బి ఎ బి ఇడి.

[ఒక సరోవరం గట్టున ఒక చెట్టు, చెట్టుమీద శుక మిథునం, సరోవరంలో రాయంచలు, దూరాన లేడి పిల్లలు; నీటికుండ ఒయ్యారంగా తెస్తూఉన్న సుందరి]

ఆ కనుదోయి తళ్కుల యొయ్యారము జూచి కురంగ శాబకా
నీకము దవ్వు దవ్వులనె నిల్చెను సిగ్గున, మందయానపున్
పోకుల కీడు గామను అసూయను రాజమరాళముల్ సరో
జాకరమందు దూరమున నల్లలనాడుచు నుండె సుందరీ

పెదవుల్ విప్పి యొకింత పల్కగదవే పీయూష మాధుర్యమిం
పొదవన్ పైతరుశాఖికన్ శుకశుకీ యుగ్మమ్మునీ పల్కుతీ
య్యదనంబొక్కరవంత నేర్చుకొని ప్రేమాలాపసాఫల్య సం
పద చేకూర్చుకొనంగ జూచెడిని, లావణ్యైక రమ్యాకృతీ

హొయలొప్పారగ అందపున్ రవికలో ఉప్పొంగు వక్షోగుహా
ద్వయి కానించిన నీటికుండ నొక చేతందాల్చి నాజూకు ప
న్నియ కుచ్చిళ్లు మరొక్క చేతగొని ఎంతే రీవిగా సాగు క
న్నియ! ఏమో మధురంపుటూహాస్పదవున్ వీక్షింప నీరూపమున్

తన తొల్లింటి సుమాస్త్ర పంచకము వ్యర్థంబంచునూహించి నీ
కనుదమ్ముల్, పెదవుల్, నితంబతటి దాకన్ వ్రాలు వేణీభరం
బున్, వక్షోజయుగమ్ము, మేని మెఱుగున్, పొల్పారసాయంబు గై
కొని సాధించు జయమ్ము భావజుడు లోకుల్ విస్మయంబందగన్

మహాకవి శ్రీ బాణభట్ట ప్రణీత

పార్వతీ పరిణయము

ఆంధ్రీకరణ శ్రీ జూలూరి హనుమంతరావు

3

తృతీయాంకము

(మహేంద్ర బృహస్పతులు ప్రవేశింతురు)

మహేంద్రుఁడు - గురువరా! కాముఁడే బాణసంధానముచే నైనను ఖండపరశుని వశీకరించెనో, వికల్పసంవర్త సమయ చండకరునివలె దుష్ప్రేక్ష్యుఁడగు మునినిఁజూచుటకు శక్తిరహితుఁడై వెనుదిరిగెనో, లేక కోపాంధకారిచేతముతోఁ దనకుఁదాను ఫాలనయనుని నేత్రజ్వాలలఁ బురోడాశముగా మారెనో, ఏమిజరుగనున్నదో తెలియుటలేదు (ఎడమకన్నదరుట సూచించి శంకతో)

అదరు నెడమకన్ను పొదలునో దేవకా
ర్యమున కిప్పుడు విఘ్నమనెడు శంకఁ
గలుగఁజేసి-విధివికల్పమ్ము దరియంగ
జాగ్రతను వహించి సలుపవలయు

బృహస్పతి - అమంగళ ముపశమించుగాత.

భగవన్! వృత్తాంతజ్ఞములగు కొన్ని నిమిత్తములచే నెవరోవచ్చునని జ్ఞాపితమగుచున్నది

(తదుపరి నారదుఁడు ప్రవేశించును)

నారదుఁడు - ఇంద్రునాదేశము ప్రకారము స్థాణ్వాశ్రమమునకుఁబోయి యచ్చటి యుదంతమును దెలిసికొని వచ్చుచున్నాను. ఆతని యొద్దకుఁబోయి యచ్చటి యుదంతము సకలమును నివేదింతును (అనిపరిక్రమించును)

మహేంద్రుఁడు - (అంజలిఘటించిచూచి) అడుగో! మహతీవల్లభుఁడగు నారదముని యరుదెంచుచున్నాఁడు ఆసనము తెప్పింపఁబడుగాత

(బృహస్పతియాసనముఁ దెప్పించును నారదుఁడు కూర్చొనును)

మహేంద్రుఁడు - (అంజలిఘటించి) భగవన్! దివిషదులచే నభిలషితకార్యము భద్రమైనదో, యభద్రమైనదో తెలియఁజేయుఁడు.

నారదుఁడు - మొదటినుండియు సర్వమును జెప్పుదును. వినుఁడు

మహేంద్రుఁడు - సావధానులమై యున్నాము.

నారదుఁడు - దేవకార్యము కొఱకై ప్రస్థితుఁడైన కందర్పునిఁదిరస్కరిణీ విద్యచే నచటఁగలుగు వృత్తాంత జిజ్ఞాసచే త్వదీయాదేశానుసార మనువర్తించుచు నేయుంటిని

మహేంద్రుఁడు - తరువాత! తరువాత

నారదుఁడు - స్థాణ్వాశ్రమ సమీపమునకుఁ జేరి కాముఁడు వసంతునిఁ గోరినాఁడు.

మహేంద్రుఁడు -ఏమని?

నారదుఁడు -'సఖుఁడా! ఈ హిమవదుప కంఠ కాననమునందు నీవు విజృంభింప వలయు'నని.

మహేంద్రుఁడు -అతనేమి యొనర్చినాఁడు?

నార-కల రుతమ్ములు పలుక కోకిలకులమ్ము
మలయమారుత కందళమ్ములు జనింపఁ
బెంప, భుజగర్వమా పుష్పవిశిఖునకునుఁ
బ్రబలిచైత్రుఁడు జృంభించె వనమునందు

మహేంద్రుడు -తరవాత! తరువాత!

నారదుడు —

పొంగి ప్రియలీయ బహుమానపూర్వకముగ
చూతరసములు గోకిలల్ చూరగొంచుఁ
దనిసి పంచమరాగ భేదములతోడఁ
బంచశరు గర్వమును ప్రబోధించుచుండె.

మహేం -తరువాత తరువాత.

నార-ననలబాణాలు తుమ్మెదనారినెక్కు
పెట్టు హిమగిరి ప్రాంతజృంభిత సుమాస్త్రు
కార్యమున భజించుదురు కాలములు లేక
హెచ్చు ప్రణయాతురత విమోహితులు జతలు

మహేం -తరువాత తరువాత

నారదుడు:—

అలరెమ్మావులు కోరక ప్రతతి హస్తామర్శ నల్లేక సొం
పుల కంకేళులు పాదతాడన వినా పుష్పించె సంగీతక
మ్ములు లేకే హసియింపసాగె లలితంబుల్ ప్రియాళమ్ములు
మ్ములు లేకే ముకుళించె కేసరము లేముగ్ధేక్షణాపాళిచే.

మహేం -తరువాత తరువాత

నారదుఁడు -ఇంత యెందులకు

ఆ వనమునందు నివసించు నబలలందు
ధైర్యమర్యాదయను ననుతటము దాటి
మానసోద్వేలమై గాఢమైన దగుచు
పరిథ విల్లెడు నతిరాగవనధి నిజము

మహేం -ఈవిధమైన సకలజన వికారకర మగు ప్రవృత్తము నందుఁ గాముఁడే మొనర్చెను?

నార -కాముఁడు రతివసంతులతో నన్వేషించుచు మహాద్దేవదారు ఖండమండపమున మృగాదన చర్మనిర్మితమగు నహిమ శిలావేదిక యందు నాసీనుఁడగు యంతర్ముఖ చిత్తవృత్తుడు, నభ్యంతరపవన నిరోధనిశ్చలాననుఁడు, నాసాగ్రనిహిత పక్ష్మాతుండు, నపర నిస్తరంగాంబుధియు నగు నిందు శేఖరుని జూచెను

మహేం -తరువాత తరువాత

నార -తరువాత భగవానుడు నీలలోఁహితుఁడును బ్రతీచావలోకనము న దిక్కాలాకులను దనలో సాక్షాత్కరించుకొని శిథిలిత పర్యంకబంధుఁడై ప్రణిధానమున ప్రవర్తించెను.

మహేం -తరువాత తరువాత

నార -కాముఁడాతనిని జూచి కార్ముకమును గరమునుండి జార్చినవాఁడై కర్తవ్యమేమియుఁదోచక క్షణకాలము చిత్తరువువోలె భయముతో నిలిచినాఁడు.

మహేం:-తరువాత తరువాత.

నార - అపుడు శృంగార వీరతపోధిదేవ తవలె నిజసఖీపరివృతయనుచు గౌరి హారునుపాసింపజను దెంచెసురభికుసుమ మంజులాలంకృత ప్రభామంగళాంగి.

మహేం -తరువాత తరువాత.

నార -తరువాత కాముఁడాలంబనము దొరికినటుల సమాశ్వసించి దృష్టిప్రతీప విహారముచే పాశ్చాత్యభాగమునకు బోయిసమయము నిరీక్షించుచుండెను.

మహేం -తరువాత తరువాత.

నార -పార్వతి సుఖోప విష్టుఁడగు నష్ట మూర్తికి సాష్టాంగ నమస్కారమొన రించెను.

మహేం -తరువాత తరువాత.

నా-అనురూపవరునిఁ బొందుమనియామె కర్ధచంద్రమౌళి యాశీస్సుల నిచ్చి నాఁడు

మహేం -తరువాత తరువాత

నార -తరువాత నాక్షణమునందే యదే యవసరసనుయమని కాముఁడుకార్ము కమునందు సమ్మోహనాస్త్రమును సంధానించినాడు

మహేం -తరువాత తరువాత.

నార -కలికినగవులు దొరలుచెక్కిలులపైన సొగసులూరెడు పార్వతీసోయగంపు టాననజలేజమున నిల్చెనపుడ యీశుఁ డాచకితుఁడౌచుఁదనదునుల్లోచనముల

మహేం -తరువాత తరువాత.

నార -కనులు కనుల నిల్వ గలిగినపులకలు తనువు పైన-నుదము దరఁగలెత్త సాత్మలోనఁగలుఁగునావేదననఁజంద్ర వదన సిగ్గుతోడ తరలె నపుడు.

మహేం-తరువాత తరువాత.

నార -తరువాత భగవానుఁడంతఃకరణ విక్రియను దపోబలముచే నెటిఁగికొని, తత్కారణమున దృష్టుల నన్నిదిక్కు లకుఁ బ్రసరించినాఁడు

మహేం -తరువాత తరువాత.

నార -కాంచె సమీపదేశమునఁగార్ముక కల్పిత మోహనాస్త్ర న భ్యంచిత కర్ణభూషణమునంట గుణ మ్మును లాగువానినా కుంచితపాదు నంచితు నకుంరితధీ యుత పూర్వకాయు ల క్ష్యించినవాని స్వీయతను వేయ మహే శుఁడు పుష్పబాణునిన్.

మహేం -(భయముతో) మిగిలినదియుఁ జెప్పుము.

నార -అతికుపితుఁడైన త్రిశూలి ఫాలలో చనమునుండి గ్రాసలాలసమగు ప్రళ యకాలానలము వలెను జృంభితోగ్ర జ్వాలాశిఖలతో వహ్ని ప్రసరించినది

మహేం -(నిర్వేదముతో) అటుపైనేమి నివేదింపఁబడునో!

నార - ఆ త్రిపురారి ఫాలలోచనాగ్నిచే మదనుఁడు పురోడాశమైనాఁడు

(మహేంద్రుఁడు మూర్ఛిల్లును. నారదుఁ డూరడించును)

మహేం -(ఊరటపొంది) హా! త్రిభువన సుందరా! పుష్పబాణా! సకలజనా నందనా! పురందరునికోసమై జీవిత మును వదలితివికదా!

బృహస్పతి.-భగవన్! విషాదము పొంద వలదు. భవితవ్యతయే బలమైనది. ఊర కుండుము

మహేం -రతి యేమొనర్చినది?

నార -రతియు మోహమును బొందినది

మహేం -వసంతుఁడేమొనర్చినాఁడు?

నార - ప్రియసఖుఁడగు వసంతుఁడును మోహమును బొందినాఁడు

మహేం :-మూర్ఛితులగు రతివసంతు లెటు లున్నారు?

నార -మొదల వసంతునిచే నాశ్వాసితయై రతియెట్టో సంజ్ఞాలంచితయయ్యును దిరిగి పెనుగాలిచేఁజెదరుచున్న రేణు వులుగల భసితమయమగు పతిపురుషా కృతిపైఁబడి-

పతివియోగముపలననాపన్నయగుచుఁ బొరలి కన్నీరు పొలిండ్ల దొరలి తమప గురుపరప్మగు శోకానగురరవోలె బాలకమునేడ్చె నార్తనాదాలతోడ

మహేం -తరువాత తరువాత!

అపుడు హా! నాధా! యనును మిక్కు టముగా విలపించు రతిని నాకాశ వాణి యిట్లూరడించినది

కామవల్లభ! విడుము శోకమ్మదేల జగతిలో బ్రహ్మవిధిదాటు జనుఁడు లేడు భవునిచేతనె పార్వతీపరిణయమున నీప్రియపఖుండు తిరిగిజన్మింప గలఁడు

మహేం -(ఊరటపొంది, హర్షముతోఁ గూడిన వానివలె)

నావమైన మనోరథ మీవార్తననుసరించియొసయంగానౌ నావారిద సంసక్తము దావానల దగ్ధశేషతరువు విధానన్.

బృహ -ఇంద్రా! ఆకాశవాణి సత్యమునే పలికినది. ఏవిధముగాఁజూచినను మన్మ థుఁడు తిరిగియుజ్జీవితుఁడు కాఁగలఁడు.

మహేం -తరువాత తరువాత.

నార -సమనుగా దుఃఖించు వసంతునిచే నెటులో యూరటపొంది రతి నిజ భవ నమునకుఁదీసికొనిరాఁబడినది

మహేం -కాముని దహించి కాలకంఠుఁడే మొనర్చినాఁడు?

నార -పార్వతి యెదుటనే పరిజహర్షచే భూతగణములతో గూడి భూతపతి యంతర్ధానమైనాఁడు

మహేం -పార్వతి యేమి చేసినది?

నార -గనుదెంచి బాహుయుగమునఁ గొనిమూర్ఛముకుళితాక్షిఁ గొమరత గౌరిన్ గొనిపోయె నిజగృహమ్మున కెనసిన వాత్సల్యమునను హిమ ధరరాట్

మహేం -భగవన్! నారద! నీవుచెప్పినదంత యువింటిని ఇంకేమిప్రతిపాదింతువో!

నార -ఈవృత్తాంతమును సత్యలోకవర్తి యగు చతుర్ముఖునకు నివేదించుటకు వెడలుదు (అని నిష్క్రమించును)

(తరువాత రంభ ప్రవేశించును.)

రంభ -కుబేరభవనమునుండి తిరిగి వచ్చుచు నోషధిప్రస్థనగరమున నే వినినవృత్తాం తమంతయు దేవరకు విన్నవించు కొందును (అనిపరిక్రమించును)

మహేం.-(చూచి)

నడచెడు లతవలె చపలత
విడచినచంచలనువోలెవిలసితమూర్తిం
బడసిన మోహన కళవలెఁ
గడునొప్పెడు నీరజాక్షి కననీమెవరో!

(నిర్ధారించుకొని) ఈమె రంభకదా!

రంభ - (దగ్గఱకువచ్చి) దేవరకు జయమగుగాత

మహేం -రంభా! ఎక్కడనుండిరాక!

రంభ -కుబేరభవనమునుండి.

మహేం -అక్కడ నేమయిన నపూర్వవృత్తాంతమున్నదా యేమి?

రంభ - నీలలోహితుని నిటలాగ్నిజ్వాలలచే కాముఁడు కథావశేషితుఁడై నాఁడని యందఱనుచున్నారు ఓషధిప్రస్థనగరమున మఱియొకటియుఁగలదు.

మహేం -అదియేమి?

రంభ -'మన్మథ దాహముచేభగ్నమనోరథయైన పార్వతి పరమేశ్వరునే పతిగా నభిలషించుచుఁ గఠినతపశ్చర్యచేఁదన వాంఛితమును నెరవేర్చుకొన నిచ్చగించుచున్న'దని

మహేం - ఈవిషయమున నామె జననీజనకులచే నేమి చెప్పఁబడినది?

రంభ - మేనకాదేవిచే నీవిధముగాఁజెప్పఁబడినది.

మహేం ఏమని?

రంభ -పరుషము తపోవిశేషము

శరీరము శిరీషకుసుమసదృశముకరినం
బరసినఁ దలపడునిది దు
ష్కరమగునని పార్వతీ! భృశంబుగ దోచున్

మహేం -హిమవంతునిచే నేమిచెప్పఁబడినది?

రంభ -ఆతనిచే ననుమతి యొసంగఁబడినది.

మహేం -రంభా! మిక్కిలి మంచివార్తను దీసికొనివచ్చితివి సముచిత నియోగకరణమునకై వెడలుము.

రంభ -అటులనే (అని నిష్క్రమించును)

(నేపథ్యమునందు)

వైతాళికులు -

దినకరుఁడేగుచుండఁబరదేశము ప్రేమ విఘూర్ణయౌచుఁబ
ద్మిని విరహానమండి కడతేరఁగలేక మొగమ్ము వాడఁగాఁ
గనఁబడు సంజచీరమెయిఁగైకొనుచున్ మధుపాళిమాలనా
తనిఁ గయికొంటకోయనఁగఁదాపసవృత్తిని స్వీకరించుచున్.

మహేం (విని) మేమును సంధ్యావందన మొనర్చుటకు వెడలుదుము.

(అని యందఱు నిష్క్రమింతురు.)

ఇది తృతీయాంకము

శాతవాహన సప్తశతి

శ్రీ వాసిరెడ్డి వెంకటసుబ్బయ్య

౩

ఓనమాలు గూడ రానివారినె గౌర
వాధికులుగ లోకు లాదరింత్రు
తమ భుజాగ్రములను దాల్తురు గద నిర
క్షర మయినను స్వర్ణకరుని త్రాసు.

గండఫలక మరుణకాంతు లీనఁగ మోవి
వడఁక సఖుఁడ! మాట తడవడంగ
వలదు నన్ను ముట్ట వలదంచు మాటికి
జరిగి జరిగి పోవు సతి స్మరింతు.

ఎరవు దెచ్చుకొన్న గరణిఁ దల్లి విప
శాసహంబులైన యంగకముల
నాతఁ డెంత ధూర్తుఁడైనను గినియ నా
కలవి గాదు నవ్వులాటకైన.

నీ విషయముఁ గూర్చి నే నెంత చెప్పినఁ
జెప్పు వినఁగ లేదు చెప్పు మనుచు
మఱల మఱల నూరుమార్లు నా చేతఁ జె
ప్పించుకొనుచు నాలకించు నార్య

కొడుకు గంటువెట్టెఁ గ్రొత్తగా మొలచిన
పంట ననుచు నవ్వ పట్ట లేక
యిదిగో! చూడుఁ డనుచు నిల్లాలు తన ప్రాణ
పతి కరమున నుంచె బదర ఫలము.

ఉరక తోఁచి నట్టు లూరేఁగు దాన! చే
కుఱని వాని కొఱకు నుఱుకు దాన!
గగన వీథులందుఁ గాఱాడు దాన! నీ
వెందొ భంగ పడెద వెడఁద కాన!.

సుగుణ గణమె తెలి కగునేమొ! లేక లో
కులు గ్రహింపఁ బోరొ గుణము! లేను
గుణ విహీన నేమొకో! వాని యాపె నా
కంటె సుగుణవంతురాలో యేమొ!.

అన్య జనుల బాధ లద్దమందునఁ బాప
పగిది నెవని మదికిఁ బట్ట పట్టి
కుమతి కెట్లు చెప్పికొందు నత్తా! గుండె
యవిసి వ్రయ్యలైన నయ్యెఁగాని.

అవనతాంగి యగుచు నధ్వగు నాలు కే
ల్చాచి వైచు నపుడు జాఱి పడిన
గాజు నడుమ నున్న కబళంబుఁ దన కురి
పెట్టి రనుచుఁ గాకి ముట్టు కొనదు.

ఈపు గడచుచుండ నింటి యావరణపుఁ
గ్రంత లెల్ల వరుస గలయ బాల
తరళ లోచనములఁ దడగాళ్లు వగఁ జూచెఁ
బంజరమ్ములోని పక్షియగుచు.

కొమ్మ లాకు లేది కుబ్జయై యేకాన
నైనఁ బుట్టవచ్చుఁ గాని మనుజ
జాతి పుట్టుచోట దాతయై రసికుఁడై
బీదవాఁడు పుట్టరాదు గాద.

లభ్యపడని గొప్ప లాభ మందిన యట్లు
కుసుమపూవు వన్నె కోక దాల్చి
పీట నున్న రాజ వీధులఁ బట్టఁ బ
గ్గాలు లేక తిరుగుఁ గాఁపు వెలఁది.

నీ మొగమ్ముఁ దాకు నీరజాప్తునిఁ బైట
చెఱఁగు నొడ్డి యడ్డు పఱచఁ బోకు!
తమ్మియందు నీ మొగమ్మందుఁ గల స్పర్శ
సుఖపు టంతరమ్ముఁ జూడ నిమ్ము!.

సహజ గౌరవమ్ము సమకూరినను స్త్రీల
స్త్రైన భరమ్మదేలో జాఱి పడుట
యెంతవారలైనఁ గాంతల డెందానఁ
జాల దనుక నిల్వ! జాలరేమొ!.

వెలికి పొక్క వెట్టి కలహవేళఁ గూడఁ
నాత్మయందె జీర్ణమగుచు నుండు
సచ్చరితులు విన్న చాటు మాటలు వారి
యంతమునఁ జితాగ్ని యాహుతించు.

తన్నుఁ గడచి నీవు చన్నంతఁ గన్నీటఁ
దఱలు చేరెడేసి దాని కనులు
నిన్ను మఱలఁ జూచు నిఖిల సౌఖ్యంబుల
కిన్ని నీళ్లు విడిచె నెమ్మొ కాఁడ.

తలఁచుకొన్న మాత్ర ధర్శనం బొసఁగు నీ
మొగముఁ జూచి బ్రదుక బుద్ధి పుట్ట
నెంతకాల మనుచు నే నిట్లు కంటికిఁ
గడివె డూరుచుండఁ గడప వలెనో!.

మానతరు మహోగ్ర మారుత మానంద
హేతు వంగములకు మాతులాని!
యతని గౌఁగిలింత యగు రతి నాటక
ప్రథమ రంగమునకు భద్ర గీతి.

శశివింశతి

శనగన నరసింహస్వామి

తమమను పూర్ణసాగరము త్రావు నగస్త్యుడు, సర్వజీవ లో
కమునకు భోగభాగ్యము లఖండముగా నిడురాజు, కైరవ
ప్రమదల మోములం గలతబాపు భుజంగుడు, చంద్రకాంత బృ
దముల గరంచు భావుకుడు తారకనాథుడు మిమ్ముబ్రోచుతన్.

శరనిధి శుక్తిగర్భమున జన్మము గాంచిన ముత్తియమ్ము, ని
ర్జరులకు నిత్యమైన మధుశాల, చకోరవిహంగమప్రపా
శరణము, సస్యసంతతుల సాకి పెసంబెరిగించు మందు, చం
దురుడు భవత్సుఖంబుల ననూనముగా వెలయించు గావుతన్.

తెలివలిపమ్ము లంగములఁదీరిచి, వేనలు లందు మల్లెలన్
దలముగ నింపి, చిర్నగవు తళ్కుల వెన్నెల జిమ్ముమంబ్రియ
స్థలములు చేరబోవు నభిసారికలందన శీతగౌర ర
శ్ములు నిగిడించి సాకు శశిశూరుడు మిమ్ముల సాకుగావుతన్.

శ్రీ పరమేశకేశకుజశృంగము పూచినపూలగుత్తి, ల
క్ష్మీపతి మోమునం జలువ చిందెడు వామవిలోచనమ్ము, భూ
మీపరమానుబింబనము మ్రింగు మణీముకురమ్ము, మౌని నే
త్రోపరిహర్షవాష్పక మనుష్ణమయూఖుడు మిమ్ము నేలుతన్

విరహితమానినీ తతికి వేయివెలుంగులవాడు, జారతా
పరులకు చోరచక్రయుగపాళికి గర్భవిరోధి, రాగసం
గరవశదంపతిం గలిపి గౌరవముంగొను రాయబారి, పం
కరుహరిపుండు మీహృదయ కాంక్షితముల్ నెఱవేర్చుగావుతన్.

మూడు జగమ్ములున్ నిదురమున్గి విరామము నొందుచుండ, మో
మోడక యర్ధరాత్రమున నుజ్వలవేషము దాల్చి, చుక్కపూ
బోడుల మధ్య నోలగము పొంది దరాపతి భంగి నాడుచుం
బాడుచు కాలముంగడుపు పార్వణ చంద్రుడు మిమ్ము నేలుతన్

నీలవియన్మహాతలము నిర్మలమైన సరో వరేణ్యముం
బోలగ, తారకా తతులు పూచిన తామరపూల చాలుగా
గ్రాలగ, చంద్రికాలహరికా రుచిరోర్ముల రాజహంసయై
తేలి విహారమున్ నెఱపు దివ్యుడు చంద్రుడు మిమ్ముగావుతన్.

జలదపథోదధిం బొడము స్వాదుసుధాకలశమ్ము, ప్రాక్సతీ
తిలకముఫాలదేశమున దిద్దెడి కుంకుమబొట్టు, శైలభి
న్నిలయమతల్లికాగ్రమున నిల్పు సువర్ణఘటమ్ము, రిక్కచె
ల్వలగమికాడు మీ మధురవాంఛలు సర్వము దీర్చుగావుతన్

విరహితభామినీ జనము వేయితెఱంగుల దూఱ దుర్యశః
స్ఫురణము పేరిలాంఛనము పూనికళంకితుడైనవాడు, తా
మరసపతివ్రతామణులు మాటికి రోయుచునుండ భీతిమై
నురిగి యమాసయందు తలసూపని చంద్రుడు మిమ్ము నోముతన్

పడతుల చిత్తవీథికల పంచశరాగ్ని రగిల్చి తద్గతిం
బొడమిన ధూమ మంబరము పొంది నవాంబుదముల్ సృజింప, నం
దెడ నెడ మాటుజెంది వెఱపేది బయల్పడు పాలసంద్రపుం
బుడుతడు మీకు సౌఖ్యములు పూర్ణముగా విరజిమ్ము గావుతన్.

గాదిలి బావ శౌరి లయకాలమునందు జగమ్ము లెల్ల స
మ్మోదము నూన ముగ్ధశిశుమూర్తి ధరించి సముద్రశయ్యని
ద్రాదరుడైన చంద మపహాస్యముగా నొనరింప నెంచి, యు
ద్భోదధియందు పండుకొనియుండు శశాంకుడు మిమ్ము బ్రోచుతన్

సుతుగనినంత కాదతని జూచి జనమ్ము స్తుతించునప్పుదే
పితృమతి సంతసించునను పెద్దలవాక్యము నిశ్చితమ్ముకాన్
సుతుని నుతించు లోకమునుజూచి కరమ్మును పొంగు నాపగా
పతిపిత జూచి గర్వపడు పార్వణ చంద్రుడు మిమ్ము నేలుతన్

మాసిన చీరవీడి, యసమాన సితాంశుకమున్ ధరించి పే
రాస శచీ హృదీశ విమలాశ ప్రతీక్ష బొనర్చు శర్వరీ
వాసక సజ్జికన్ దరియవచ్చి కరమ్ములు సాచి మర్మముల్
రోసి కరంచు చంద్రము డురు ప్రమదంబులు మీకొసంగుతన్

దివిజులు పట్టణంపు మొగదీరుచు దీపము, సౌరబాలికా
నివహము లాటలాడుకొను నిగ్గుల బంతి, స్వపాదమెక్కి ఘూ
ర్ణుపవనముజూచి మెచ్చు శశి పుల్లముఖాంబురుహమ్ము, రోహిణీ
ధవ పరిపూర్ణబింబము సదాభవదర్ధము లిచ్చుగావుతన్.

[సశేషము]

ఆంధ్ర మహాజనులకు

విజ్ఞప్తి

భారత జాతీయ సాహితీ సంస్కృతులను పునరుజ్జీవింపజేసే సమగ్ర సాంస్కృతికోద్యమంలో ఒక చైతన్య శక్తిగా 'నవభారతి' ఇప్పటికి రెండేండ్లుగా విజయవాడనుండి వెలువడుతున్న సంగతి తమకు తెలుసు విజాతీయ సాహితీ సంస్కృతులకు తలయొగ్గి భావదాస్యం చేస్తున్న నేటి మనజాతి పునరుద్ధరణకూ పురోభివృద్ధికీ ఈకృషి ఎంతఅవసరమో తమకు వేరుగా చెప్పనక్కరలేదు.

మన జాతీయ రంగంలో వికసిస్తున్న సాంప్రదాయకములైన నవీన కళా సంస్కృతులకు రూపురేఖలు దిద్దటానికీ, రూపొందుతున్న నూతన సామాజిక శక్తులకూ చిరంతన మానవ మర్యాదలకూ వెలుగు దివ్వెటీలు పట్టటానికీ 'నవభారతి' నిరంతరం కృషి చేస్తున్నది. సనాతనములై సర్వ సంపూర్ణములైన మన ఉపనిషదాది సమస్త శాస్త్రములను తేట తెనుగులో తెనుగు లోకానికి 'నవభారతి' అందజేస్తున్నది.

ఆయుర్వేదం మొదలు నాట్యవేదంవరకూ గల సచేతన భారత కళా సర్వస్వాన్ని జాతికి సుపరిచితంచేసి, 'నవభారతి' జాతిలో ఒక నూతనోత్తేజం కలిగిస్తున్నది, జాతి విజ్ఞాన వికాసాలకు వెలుగు బాటలు తీరుస్తున్నది.

ప్రాక్ప్రతీచీ సాహితీ సంప్రదాయాలను ఉగ్గడించడమే గాక ఉత్తమ విమర్శలను వెలయించి, ఆధునికాంధ్ర సాహితీ జగత్తుకు దారి చూపుతూ మన కవి ప్రవరుల ఉత్తమ కావ్యాలను, కథలను, నాటికలను, సారస్వత వ్యాసాలను, మనకళా శిల్పుల చిత్ర శిల్ప ప్రతిమలను పర్చికూర్చి 'నవభారతి' ప్రచురిస్తున్నది

ఒక్కమాటలో చెప్పవలెనంటే - ఒక ఉత్తమాశయంతో ఒక జాతీయాదర్శంతో - వ్యాపారదృష్టి లేకుండా — వెలువడుతున్న తెలుగు పత్రిక 'నవభారతి'!

ఈ 'నవభారతి'ని అనేక కష్ట నష్టాల కోర్చి ఈ రెండేండ్లుగా ప్రచురిస్తున్న మహాదర్శ ప్రేరితులు, త్యాగ శీలురునైన శ్రీ చదలవాడ పిచ్చయ్య, జె రాధాకృష్ణరెడ్డిగార్ల పరిశ్రమను ప్రశంసిస్తున్నాము

ఇట్లు ఒక మహోద్యమంగా రూపొందుతున్న 'నవభారతి'ని ఆదరించి, అభివృద్ధికి తేవలసిన బాధ్యత కళాభిమానులూ దేశభక్తులూ అయిన ఆంధ్ర మహాజనులందరిమీదా ఉన్నదని మేము నమ్ముతున్నాము

తాము విరాళము లిచ్చి, చందాదారులుగాచేరి చేర్పించి, ప్రకటనదారులైన వారు తమ ప్రకటన లిచ్చి, తమశక్తికొలది 'నవభారతి'కి తోడ్పడి, ఆంధ్ర కళాసంస్కృతుల వికాసానికి దోహదం చేయగలరని కోరుతున్నాము.

ఇట్లు

హైద్రాబాద్,
5–5–1960

డి. సంజీవయ్య,
(ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి)

ఎం ఆర్. అప్పారావు,
(ఆంధ్ర విశ్వవిద్యాలయ తాత్కాలికోపాధ్యక్షులు.)

కె. వి రంగారెడ్డి,
(ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి)

ఎ. సి సుబ్బారెడ్డి,
(భారీపరిశ్రమల, పురపాలక శాఖామంత్రి)

కల్లూరి చంద్రమౌళి,
(దేవాదాయ ధర్మాదాయ, సహకారశాఖామంత్రి)

కె. బ్రహ్మానందరెడ్డి,
(ఆర్థిక, న్యాయశాఖామంత్రి)

అల్లూరి సత్యనారాయణరాజు,
(ఎక్సైజ్ పన్నులు, విద్యుత్ శాఖామంత్రి)

యస్ నరోత్తమరెడ్డి,
(ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ సంఘ అధ్యక్షులు)

Edited, Printed & Published by Sri J. Radhakrishna Reddy, Vijayawada-2
Printed at Nava Bharathi Press, Vijayawada-2